శ్రీ సాయి సచ్ఛరిత్ర

నిత్యపారాయణ గ్రంథం

పారాయణ చేయు విధానము

సాయి బాబా యొక్క ఈ జీవితచరిత్రను రెండు విధములుగా పారాయణ చేయవచ్చును.

1. నిత్య పారాయణ:- కుటుంబంలోని సభ్యులందరు కలిసి ఒకచోట కూర్చుని ఎదురుగా బాబా పటము పెట్టుకుని ఒక అగరువత్తి వెలిగించి వారి అవకాశమును బట్టి ప్రతి రోజు ఇందులోని అధ్యాయములను చదువుకొనవచ్చును. ఒకరు బిగ్గరగా చదివినచో మిగిలిన వారంతా వినవచ్చును. ఈ విధంగా చేయు పారాయణను ప్రతి రోజు యింత చదువవలెను అను నియమము లేదు. వారి వారి అవకాశములకు వీలుగా చేయవచ్చును. ప్రతిరోజూ పారాయణ ముగించు ముందు బాబాకు కర్పూర హారతి ఇవ్వవలెను.

2. సప్తాహపారాయణ:- ఒక దీక్షగా దీనిని చదువదలచిన వారు ఒక గురువారంనాడు ప్రారంభించి మరలవచ్చే గురువారం నాటికి చదువుట పూర్తి చేయవలెను. ఏ రోజు ఎంత వరకు చదువవలెనో విషయ సూచికలో సూచించబడినది. సప్తాహ పారాయణను మాత్రము ఎవరికి వారు వంటరిగా మాత్రమే చేయవలెను. పూజా మందిరంలో బాబా పటము కెదురుగా కూర్చుని పారాయణ చేయవలెను. మధ్య మధ్యలో బాబా కళ్ళలోకి చూస్తూ వారిని పలకరించుచుండవలెను. ప్రతి రోజూ పారాయణ పూర్తి చేయగానే బాబాకు కర్పూర హారతిని ఇవ్వవలెను. సప్తహ పారాయణను పూర్తి చేయగానే గురుదక్షిణగా బాబాకు 5 రూపాయలు ఈ క్రింది గల ఇంగ్లీషులో వ్రాయబడిన షిరిడి అడ్రసుకు మనియార్డరు చేయవలెను. వీలైనచో ఒకరిద్దరు నిరుపేదలకు మాత్రమే భోజనము పెట్టిన మంచిది.

Sri Shiridi Saibaba Samsthan
Shiridi Post, Kopargoam Tq.
Ahamad Nagar Dist.
Maharastra - 423 109.

మొదటిరోజు పారాయణ-గురువారము

ఓం శ్రీసాయిరాం

షిరిడి, (ద్వారకామాయి)

08-03-93 సోమవారం, రాత్రి గం 10-40 ని.

విఘ్నదేవుడైన వినాయకునికి నమస్కరించి, సకల దేవతా స్వరూపుడైన సాయిని మది తలచి ముందుకు సాగుతున్నాను. ఈ శరీరంలో వున్న బుద్ధికి సాయి జీవితచరిత్ర, అందులో 16 సంవత్సరాల వయసుకు ముందు జరిగిన జీవిత కథ అసలు తెలియదని నాకు బాగా తెలుసు. భక్త సులభుడైన సాయి అనుగ్రహంలో నుంచి వెలువడే ఒక్క చిన్న సాయికిరణం చాలు ఈ సాయి కిరణ్ సీరిస్ యొక్క బాబా జీవితచరిత్రను యధాతధంగా చిత్రించటానికి. యిది వ్రాయటం మొదలు పెట్టగానే ఈ ద్వారకామాయి చుట్టూ పూరేకులలాంటి సన్నని మృదువైన వానజల్లు ఒక్క క్షణంపాటు పూలు జల్లినట్లుగా పడి ఆగిపోయింది. యిది సాయి ఆశీర్వాదానికి గుర్తేమోనని నాలో ఆశ చిగురించింది. జగన్మాతైన సాయి తప్ప అనాధుడనైన నన్ను ఆదరించే దెవరు? ఆ ఆదిశంకర రూపుడైన షిరిడి ప్రభువు తప్ప ఈ అజ్ఞాని యొక్క ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహించి ముందుకు పంపగలిగిందెవరు? అందువలననే ఆ యోగిరాజు వాకిట్లో కూర్చుని ఈ నా బృహత్ ప్రయత్నాన్ని ప్రారంభించాను.

ఈ టైము మంచిదో కాదో కూడ చూడలేదు. విశ్వాంతరాళాలలో గల గ్రహరాసులు ఏవైనా యిది ప్రారంభించిన ముహూర్తానికి చెడు కలిగించే స్థానాలలో వుంటే అవి వాటి స్థానాలలో నుంచి తిరగబడి పరిశుద్ధమైన అత్యంతశక్తివంతమైన శుభ స్థానాలకు మారవలసిందిగా ఆదేశించమని సాయిని పాదములంటి ప్రార్థిస్తున్నాను. కథకుడనైన నా గురించి కాకపోయినా కథానాయకుడైన సాయి కోసమైనా గ్రహాలన్నీ ఒక్క క్షణం ఈ ముహూర్తానికి శుభ స్థానాలలో ప్రవేశించుగాక!

చదువుల రాణి-వాణి తన మృదుమధుర వీణానాదంతో ఈ కథకు శృతిలయలు పలికి రజింపచేయక తప్పుతుందా! దైవం మానవ రూపంగా దిగివస్తే ఆ దైవశక్తిని గుర్తించేదెలా? ఆనాటి సమకాలికు లెవరూ ఈనాడు మన మధ్యన అందుబాటులో లేరు కదా! కాబట్టి అవసరమైనప్పుడల్లా సాయి సాక్షాత్కారించి తన జీవితచరిత్ర విశేషాలు వివరించక తప్పుతుందా! నా సలహానుగాని, సహాయమును గాని కోరిన తక్షణమే యిస్తానన్న సాయి అభయం వుండనే వుంది కదా!

అందువలనే నాచేత వ్రాయించుకునే ఈ జీవితచరిత్రలోని కథా వస్తువులు, వివరాల కొరకు ఎక్కడికీ పరుగులు తీయకుండా! తన సలహాను సహాయాన్ని కోరిన తక్షణమే యిస్తానన్న సాయి అభయాన్నే గుర్తు పెట్టుకుంటూ ఈ రచనను ముందుకు సాగించాలని ఆశయం.

సత్యం తప్ప యింకేదీ ఈ రచనలో రాకుండా చూడమని, ఒకవేళ యింతకు ముందు ఈ శరీరంతో వ్రాయించుకున్న సాయి కిరణ్ సీరీస్ పుస్తకముల నెం. ఒకటి నుంచి ఏడు వరకు గల వాటిలో ఎక్కడైనా ఏవైనా కాల్పనిక దోషాలు దొర్లితే వాటిని సత్య దృష్టితో సరిచేసి యిందులో వ్రాయించమని కూడ సాయిని ప్రార్థిస్తున్నాను.

కృతి కర్త, కృతి భర్తతానే అయితే తప్ప ఈ పుస్తక రచన ముందుకు సాగదని సాయికి తెలుసు. లోకం దృష్టిలోనే ఈ నా శరీరానికి రచనా వ్యాసంగం, యదార్థానికి ఈ సాయి జీవిత కథకుడు కూడ సాయియే గాని నేను కాదు!

జై సాయి రాం!

- రచయిత

శ్రీ షిరిడి సాయిబాబా జీవిత చరిత్ర

ఒకటవ అధ్యాయము

మానవ మేధస్సుకు అందని ఈ విశాల విశ్వంలో భూమి ఒక చిన్న గ్రహం. యిందులో అనేక జీవనదులు, పర్వతాలు, అరణ్యాలు, మహాసముద్రాలతో కూడిన ఈ భూగ్రహంపై అనేక క్రిమి కీటకాదులు, పశుపక్షులు, యితర జీవజంతువులతో నిండిన 84 లక్షల జీవరాసులలో మానవుడిది శ్రేష్ఠమైన జన్మని, ఉత్తమమైన జీవితం గడిపే అవకాశాలు గల జన్మని అనేక మహాత్ములు పరిశీలించి నిర్ణయించారు. యిలాంటి పవిత్రమైన ఈ మానవజన్మ యొక్క యదార్థ విలువను గుర్తించలేక మనిషి అహంకార, అజ్ఞానాలకు లొంగిపోయి తాను అశాంతికి గురి అవటమే కాకుండా తన చుట్టూ ఉన్న ఈ సృష్టినంతటినీ అల్లకల్లోల పరుస్తున్నాడు. దీనికి కారం ఏమిటి? దీనిని మనం ముందు తెలుసుకోవాలి. యింకా కొంత ముందుకు వెళ్ళి మానవజన్మ భూమి మీదకు ఎలా వచ్చింది అని ఆలోచిస్తే జీవ పరిణామ సిద్ధాంతం ప్రకారంగానే మనిషి మొదట భూమిపై జన్మించి వుండవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం మొట్ట మొదట ప్రాణికోటి జన్మ నీటిలో ఏర్పడి కేవలం జలచరాలుగానే ప్రాణులు వుండేవి. ఆ తరువాత జలచరాలు, భూచరాలుగా వుండేవి అంటే నీటిలోను, భూమిమీద కూడ తిరగగలిగిన ప్రాణులుగా వుండేవి. ఆ తరువాత క్రమంగా భూచరాలు, అంటే భూమిమీద మాత్రమే నివసించగల ప్రాణులు అభివృద్ధి చెందాయి. వాటిలో నుంచే వివిధ రకాల జంతువులు అభివృద్ధి చెందాయి. అలాంటి జంతు జన్మ నుండి అభివృద్ధి చెందిన స్వరూపమే మానవుడు.

ఈ సిద్ధాంతం ప్రకారమే మన దశావతారాల క్రమాన్ని కూడ నిర్ణయించారు. మత్స్యావతారము అంటే చేప రూపంలో భగవదవతారం. చేప కేవలం నీటిలో మాత్రమే వుండే ప్రాణి. ఆ తరువాత కూర్మావతారం. అంటే తాబేలు రూపంలో దైవం అవతరించిన రూపం. తాబేలు ఎక్కువగా నీటిలో వున్నా కొంతకాలం భూమిమీద కూడ నిశ్చలంగా వుండగల ప్రాణి. ఆ తరువాత మార్పు వరాహ అవతారం. పందిరూపంలో దైవం జన్మించటం. పంది భూమిమీదనే ఉండే జంతువైనా నీటిలో కూడ వుండగలదు. తరువాత మార్పు నృసింహావతారం. యిది భూమిమీద మాత్రమే వుండగల జంతు స్వరూపం. ఆ తరువాత వామనావతారం. యిది మానవ అకారం

మూర్తీ భవించిన దైవరూపం. రామకృష్ణాది తరువాత మానవ అవతారాలు అభివృద్ధి చెందిన మానవత్వపు విలువలకు, మానవునిలో గల దైవగుణాలకు పరాకాష్ఠ.

మన పెద్దలు నిర్ణయించిన దశావతారాల ఈ క్రమాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, సైన్సు చెప్పే పరిణామ సిద్ధాంతానికి ఖచ్చితంగానే సరిపోతున్నది. ప్రాణికోటి మొదట నీటిలో పుట్టిందని, అవి క్రమంగా భూమిమీదకు వచ్చి భూమిమీద [illegible] గల వాతావరణంలో బ్రతకగలగడం నేర్చుకున్నాయని, ఆ విధంగానే అనేక జంతువులుగా ఆ ప్రాణులు మారాయని, అలా మారిన జంతువులలో మానవుడు కూడ చాలా అభివృద్ధి చెందిన ఒక జంతువేనని ఈ సిద్ధాంతం చెబుతున్నది.

అయితే ఈ మానవుడు తన బుద్ధిని ఉపయోగించి ఆలోచించటం మొదలుపెట్టాడు. అందరూ కలిసి సుఖంగా జీవించే సాంఘిక జీవితాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ సమిష్టి జీవితం సుఖంగా వుండటానికి తన అనుభవంతో కూడిన కొన్ని కట్టుబాట్లను, నియమాలను క్రమంగా చేసుకుంటూ వచ్చాడు. భూమిమీద గల వివిధ ప్రాంతాలలో నివసించే ఈ మానవజాతి వాళ్ళ వాళ్ళ ప్రాంతాలలో గల దేశకాల వాతావరణ పరిస్థితులను బట్టి వాటికి అనుకూలంగా జీవన పద్ధతులను, కట్టుబాట్లను క్రమశిక్షణగా అలవాటు చేసుకున్నారు. ఈ అలవాట్లు కాలక్రమేణా ఆచారాలుగా మారినాయి. ఈ ఆచారాలు బలపడిపోయి అవి మతాలుగా మారినాయి.

ఎవరి మతాన్ని వారు గట్టిగా అభివృద్ధి చేసుకున్నారు. శక్తికి యుక్తితోడైన సమర్థులు పాలకులుగా, నాయకులుగా నిలచారు. బలం ముందు మతం తలవంచవలసిన స్థితి అన్ని మతాలలోను వ్యాపించింది. మతం బలాన్ని అనుసరించివలసిన పరిస్థితులు అన్ని మతాలలోను ఏర్పడ్డాయి. బలవంతులైన నాయకులు మతాన్ని అడ్డుగా పెట్టుకుని పరదేశాలపై దండెత్తటంతోపాటుగా పరమతాలపై కూడ క్రమంగా తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నం తెలియకుండానే చేశారు. ఇది ప్రపంచ చరిత్ర మనకు నిరూపిస్తున్న నగ్నసత్యం.

యిదే పద్ధతిలో పుణ్యభూమి, కర్మభూమి అయిన మన భారతదేశంలోకి అనేక మతాలు ప్రవేశించాయి. ఎవరి మతాన్ని వారు వారి వారి పరిపాలనా కాలంలో అభివృద్ధి చేసుకున్నారు. యిలా అభివృద్ధి చెందినవే ఈనాడు మన దేశంలో గల మహమ్మదీయ, క్రైస్తవ మతాలు. మతం అనేది క్రమశిక్షణ కోసం ఏర్పాటు చేసిన

కొన్ని నియమాలు, ఆచారాలు మాత్రమే కాని వేరేమీ కాదు. అయితే ఈ యిరవైయవ శతాబ్దపు చివరి రోజులలో మన భారతదేశంలో కూడ మతం పేరిట ఉగ్రవాదాలతో కూడిన అలజడులు, అరాచకాలు మారణహోమాలు జరిగి అవి రాజకీయాలుగా రూపుదాల్చటం సాయి భక్తులంతా జాగ్రత్తగా గమనించాలి. మతం మంచిదే అయినా ఆచరణలో అమోదయోగ్యమైన శాంతి మార్గాన్నే అనుసరించాలనేది హిందూ మత ముఖ్య ధర్మం. ఒక దేశంలో ఒకే మతం వుండాలనేది నేటి దేశకాల పరిస్థితుల ప్రకారం హర్షదాయకమైనా, ఈ లక్ష్యాన్ని సాధించటంలో ఆచరించే మార్గాలు సర్వ మతాలకు హర్షదాయకమైన సంపూర్ణ "ప్రేమమార్గం" ముందు ముందు తెలుసుకునే ప్రయత్నం చేద్దాము.

మన ఈ భారతదేశాన్ని పుణ్యభూమి అని, కర్మ భూమి అని, ధర్మభూమి అని అనేక పేర్లతో దీనిని మన పూర్వీకులు వర్ణించారు. యిది ఎలా పుణ్యభూమి, కర్మభూమి, ధర్మ భూమి అయినదో తెలుసుకునే ప్రయత్నం చేద్దాము. 18వ శతాబ్దపు మధ్యలోగల దేశ చరిత్రను గమనిస్తే, బ్రిటీషువారి పరిపాలనలో గల మనదేశం వారి నాగరికతను, జీవన సరళిని, భౌతికవాదాన్ని క్రమంగా నేర్చుకుంటూ భారతీయ సంస్కృతికి ఆధ్యాత్మిక జీవితానికి మెల్ల మెల్లగా తిలోదకాలిచ్చే నవీన నాగరికతకు ప్రాధాన్యం పెరుగుతూ వచ్చే పరిస్థితి ఏర్పడే సూచనలు క్రమంగాకనపడబోతున్నాయి. యిలాంటి స్థితిలో ఈ పుణ్యభూమి అయిన భారతదేశాన్ని రక్షించే అధిదేవతలు, అష్టదిక్పాలకులు, యిక్కడ గల పంచభూతాలకు నిలయమైన భూదేవి, అందరూ కలిసి విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళి యిలా తమ బాధలను చెప్పుకున్నారు.

యింతకాలం పుణ్యప్రదేశమైన భారతదేశంలో మేము హాయిగా, ఆనందంగా ధర్మదేవతతో కూడి సంతోషంగా ఈ భూభాగంలో మాకు మీరు అప్పగించిన కార్యక్రమాలను నిర్వహిస్తూ వుండే వాళ్ళం. కాని ఇప్పుడు ఈ కొత్త వాతావరణంలో యిక్కడి ప్రజలలో క్రమంగా ధర్మంకన్నా సౌఖ్యం ముఖ్యమని, న్యాయంకన్నా ధనం ముఖ్యమని, ప్రేమకన్నా బలం గొప్పదని, త్యాగంకన్నా శారీరక సుఖం ముఖ్యమని, ఆధ్యాత్మికతకన్నా భౌతికం గొప్పదనే ఆలోచనలు పెరుగుతున్నాయి. వీటిని ఆదిలోనే త్రుంచే ఏర్పాటు చేయకపోతే ముందు ముందు మేము అశాంతితో అల్లకల్లోమై బాధపడవలసి వస్తుంది. కాబట్టి ద్వాపరయుగంలో కృష్ణావతారమెత్తి మహాకురుక్షేత్రంలో ధర్మయుద్ధం ద్వారా శాంతి స్థాపన చేసిన మీరు ఈసారి కొంచెం ముందుగానే

అవతరించి ఈ కర్మభూమిపై తిరిగి పూర్వపు ధర్మ సంస్థాపనా కార్యక్రమాన్ని త్వరగా చేపట్టమని ప్రార్థించారు. వారి మాటలను విన్న విష్ణుమూర్తి వారిని కొంతసేపు కూర్చోమని, విశ్రాంతి తీసుకోమని చెప్పి అల్పాహార విందు యిచ్చిన తరువాత వారికి యిలా చెప్పాడు.

మీరందరూ యింతకాలం భారతదేశంలో అత్యంత సుఖ శాంతులను ధర్మబద్ధంగా అనుసరింపజేశారు. నేను కృష్ణావతారం ముగించగానే కలి పురుషుడు భూమిమీదకు ప్రవేశించాడు. అతని సృష్టి కూడ కారణ యుక్తమైనదే. అఖండ మండలాలకు మూలకారణమైన ఆదిశక్తి సృష్టించిన ఈ కలి పురుషుడిని ఆపటం ధర్మంకాదు. అతను చేయవలసిన కార్యాన్ని అతను చేయకతప్పదు. ప్రస్తుతం మీ స్థానమైన భారతదేశంలో కూడ అతని ప్రభావం వలననే ఈ మార్పులు ప్రజానీకంలో వస్తున్నాయి.

అయితే ఈ కలి పురుషుడి బారి నుండి ప్రజలను తప్పించే మార్గం లేదా అని తిరిగి వారు విష్ణుమూర్తిని ప్రశ్నించారు. వారి ప్రశ్నకు సమాధానమిస్తూ విష్ణుమూర్తి యిలా చెప్పటం ప్రారంభించాడు.

భారతదేశం పుణ్యభూమి అన్న కారణం ఏమిటో మీకు తెలుసుకదా! ఈ భూగోళంపై ఎప్పుడూ మంచుకురిసే చలి ప్రదేశాలు చాలా వున్నాయి. త్రాగటానికి మంచి నీరుగాని తినటానికి సరైన తిండి గాని దొరకని దేశాలు చాలా వున్నాయి. అత్యధిక ఎండ వేడితో అట్టుడికిపోయే ప్రదేశాలు మరికొన్ని వున్నాయి. అయితే భారతదేశంలాంటి కొన్ని ప్రాంతాలలో మాత్రమే చలి, ఎండ, వర్షాకాలాలు వున్నాయి. జీవనదులవల్ల సశ్య శ్యామలంగా మారి భూమాత పులకిస్తున్నది. అందువలన ప్రజలు ఆహారం కొరకు చక్కని ఏర్పాట్లు చేసుకుని ఆనందిస్తున్నారు. ప్రజలంతా స్నానం, నిత్యానుష్టానంలాంటి దైనందిన కార్యక్రమాలలో పాల్గొనగల్గుతున్నారు. వాయుదేవుడు ఆరోగ్యవంతుడై ఈ ప్రాంతంలో తిరగ గలుగుతున్నాడు. భూగోళంలో పుణ్యం చేసుకున్న ప్రాణులు మాత్రమే యిలాంటి ప్రాంతాలలో పుట్టి ప్రాకృతికమైన ఈ సహజ సుఖాలుఅనుభవిస్తారు. యిది సూక్ష్మంగా ఈ పుణ్యభూమి చరిత్ర అని చెప్పి యింకా యిలా చెబుతున్నాడు విష్ణుమూర్తి.

కలి తన మాయా ప్రభావాన్ని భూగోళంలో గల అనేక ప్రాంతాలపై యింతకు ముందే చూపిస్తూ ఈ ప్రాంతానికి ఆలస్యంగా వచ్చాడు. యింకా ముందు ముందు తన ప్రభావాన్ని అధికం చేస్తాడు. అప్పుడు ఈ ప్రాంత ప్రజలలో కూడ అనేక విచిత్రమైన మార్పులు వస్తాయి.

కర్మలకు ప్రాధాన్యత తగ్గి, కాసులకు విలువ పెరిగిపోతుంది. ప్రతి మనిషి ఎదుటివాడు కష్టించి పని చేయాలని, అలా ఇతరులు కష్టించి పనిచేసిన ఫలితాన్ని మాత్రం తాను అనుభవించాలని కోరుకుంటాడు. అందువలన అనేక విధాలైన వర్గపోరాటాలు చెలరేగుతాయి. మతం పేరుతో, కులం పేరుతో, ప్రాంతాల పేరులతో, ఆఖరికి ఆడ మగ లింగ భేదాలతో కూడ ప్రజలు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు రక్తం చిందిస్తూ వుంటారు. ప్రజలలో నీతి నియమాలు కనిపించవు. అన్ని మతాలవారు దేముడిని ప్రార్థిస్తారు, కాని ఎవరూ దేముడు చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టరు. దైవ ప్రార్థన కూడ యాంత్రికంగా జరిగే ఒక దినచర్యగా మారి భక్తివేరు, ఆచరణ వేరుగా మారిపోతాయి. మాటసాగిన మనిషి దేముడిని, దైవధనాన్ని కూడ అపహరిస్తాడు. యిలాంటి కలి ప్రభావం నుంచి మానవ జాతిని కాపాడగలగటం అసాధ్యం. యిది యుగధర్మం. రానురాను ప్రజలలో త్రికరణ శుద్ధి పూర్తిగా నశిస్తుంది. మనసులోని ఆలోచనలు ఒక రకంగా వుంటే, మాటలు యింకో రకంగా చెపుతారు. చేతలు ఈ రెండింటికి విరుద్ధంగా వేరే విధంగా వుంటాయి.

యిలాంటి ఈ వాతావరణాన్ని కలి ప్రభావం నుంచి పూర్తిగా తొలగించలేము. కాని కొంతవరకు దీనిని ధర్మానికి సమతూకంగా వుంచటానికి ప్రయత్నం చేసి భూభారాన్ని కొంతవరకు తగ్గించే ఏర్పాటు చేయవచ్చు. నేను స్థితి కారకుడను. మనిషి సృజనాత్మకతను పెంచుకోవటంవలన నా పని ఎక్కువైనది. అందువలన మీరు పరమశివుని వద్దకు వెళ్ళి ఆయనను ప్రార్థిస్తే ఆయన తన పూర్ణ అంశతో త్వరలో మీ ప్రాంతంలో పుట్టి అజ్ఞానులైన అక్కడి ప్రజలకు జ్ఞానబోధ చేసే సాధారణ సద్గురు రూపంలో జన్మించి దత్తావతార పద్ధతిలో తన మహిమల ద్వారా శాంతి స్థాపన చేస్తాడు. అని చెప్పి వారిని శివుని దగ్గరకు పంపుతాడు. విష్ణుమూర్తి ఆదేశం మేరకు వారంతా శివుడు దగ్గరకు వెళ్ళి తమ బాధలను చెప్పకోగా శివుడు వారిని అనుగ్రహించి అతి త్వరలోనే తాను అవతరిస్తానని, అయితే యిది కలికాలం కాబట్టి దైవాన్నుంచి కూడ కేవలం భౌతిక కోరికలు కోరే ప్రజలే

ఎక్కువ వుంటారు. కాబట్టి శరీరంగా వున్నప్పుడు ఎక్కువ మహిమలు చూపించకుండా, శరీరం వదిలిన తరువాతే అవతార మహత్యం ప్రజలు గుర్తించగలిగేటట్లుగా వుంటుందని చెప్పి వారికి అభయమిచ్చి పంపిస్తాడు శివుడు. వారంతా భూదేవితో కలిసి తిరిగి వచ్చి ఎవరి కర్తవ్యాలలో వారు నిమగ్నమై పరమశివుని జననం కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తూ వుంటారు.

పరమశివుడు కైలాసం నుంచి తన వాగ్దానం ప్రకారం భూమి మీద అవతరించటానికి సరైన సమయం కోసం సరైన తల్లిదండ్రుల కోసం ఎదురుచూస్తూ వున్నాడు.

జ్ఞాన స్వరూపా సాయి శరణం
ఒకటవ అధ్యాయం సంపూర్ణం

రెండవ అధ్యాయము

ఈ పుణ్యభూమి పరదేశీయుల పాలనలో వుండగా హైదరాబాదును రాజధానిగా చేసుకుని నిజాం ప్రభువుల పరిపాలనలో గల నైజాం రాష్ట్రందాదాపుగా ప్రస్తుత మహారాష్ట్రలో గల అవురంగాబాద్ పై వరకు వ్యాపించి వుండేది.

ఈ నైజాం రాష్ట్రంలో గల అతి చిన్న గ్రామం "పత్రి". పేరుకు తగినట్లుగా ఎటు చూసినా పచ్చని చెట్లతోను, పైరు పంటలతోను నిండిన సహజ ప్రకృతి సంపద అనాటి గ్రామ వాతావరణంలో గల నిర్మల, ప్రశాంత, పవిత్ర వాతావరణానికి అద్దం పట్టినట్టుగా వుండేది ఆ చిన్న పల్లెటూరు. చల్లని పిల్లగాలులతో కూడిన పైరుగాలులు శరీరాన్ని తాకి గిలిగింతలు పెడుతుంటే పరవశించే శరీరాలు భావుకులను భక్తి భావంలోకి వాటంతట అవే లాక్కెళ్ళేవి.

వూరును అనుకొని సాగే చిన్న నది పాయలోని స్వచ్ఛమైన నీరు పవిత్ర గంగా జలంవలె సర్వరోగ నివారిణి, సర్వశక్తి ప్రదాయినిగా వుండేది. ఈ గ్రామంలో గంగా భవాజ్యాడు, దేవగిరియమ్మ అనే పుణ్యదంపతులు అతి పవిత్ర జీవితం గడుపుతూ వుండేవారు. వీరు నిర్మలమైన ప్రశాంత మనస్సుతోను, కల్లాకపట మెరుగని విధంగాను, తమకున్న దానితో తృప్తి చెందుతూ, అన్యోన్య ప్రేమాను రాగాలతో జీవితం గడుపుతూ వుండేవారు. వీరికి స్థిరచర ఆస్తులు ఏమిలేవు.

గంగా భవాజ్యాడు నదిలో పడవను నడుపుతూ దాని మీదవచ్చే ఆదాయంతో సంసారాన్ని పోషించుకుంటూ వుండేవాడు. ధనం విషయంలో ఈ దంపతులిద్దరు నిరుపేదలైనా, అజ్ఞాత ధనాలైన తృప్తి, శాంతి, సహనము, ఓర్పు, నేర్పు, నీతి, నిజాయితీ మొదలైన సద్గుణాలలో వీరు చాలా గొప్పవారు. గంగాభవాజ్యాడు శివుణ్ణి, దేవగిరియమ్మ గౌరీ దేవిని పూజిస్తూ వుండేవారు. ఎలాంటి పరిస్థితులలోనైనా వీరి యింటిలో పార్వతీ పరమేశ్వరులకు నిత్యపూజ జరుగవలసినదే. పూజ పూర్తికానిదే గంగా భవాజ్యాడు పడవ ఎక్కేవాడుకాదు. దేవీపూజ చేయనిదే దేవగిరియమ్మ యింటి పనులు ప్రారంభించేదికాదు. అది దేవులైన పార్వతి పరమేశ్వరులు తమ యింట్లో తమతోపాటే వుంటారని తమను ప్రతిక్షణం రక్షిస్తూనే వుంటారని ఆ దంపతుల విశ్వాసం. ఈశ్వరుడు వారికి యిచ్చిన దానితో తృప్తిచెంది శుఖ జీవితాన్ని సాగిస్తున్నారు

ఆ దంపతులిద్దరూ. చాలాకాలం దాంపత్య జీవితం గడిపినా వారికి పిల్లలు పుట్టలేదు. పిల్లలు కలగటం కోసం తమ ఆరాధ్య దేవతలైన పార్వతి పరమేశ్వరులను ఆరాధిస్తూ వుండేవారు.

ఒకనాడు కైలాసంలోని పరమ శివుడు పార్వతితో "దేవి నేను భూమాతకు యిచ్చిన వాగ్దానం ప్రకారం భూమి మీదకు వెళ్ళి జన్మించవలసిన అవసరం వున్నది. ఆ సమయం దగ్గర పడుతున్నది" అంటాడు. అందుకు పార్వతీదేవి "ప్రభూ! ఈ సారి నేనుకూడ మీతో భూమిపై అవతరించి మీ అవతార కార్యక్రమానికి సహకరిస్తా"నని అడుగుతుంది. శివుడు అందుకు అంగీకరించడు. "ప్రస్తుతం భూమి మీద ప్రజలు కేవలం బోధనల ద్వారా మాత్రమే మార్పు చెందే స్థితిలోలేరు. అందువలన రాబోయే నా అవతారంలో ఏమి బోధించదలచుకున్నానో వాటినన్నిటినీ నా మానవ శరీరంతో ఆచరించి చూపాలి. కఠోర నియమాలకు నిలయంగా వుండే ఆ ఫకీరు జీవితంలో నీకు స్థానం యివ్వనందుకు నీవు నన్ను మన్నించాలి" అంటూ భూమి మీదగల గంగాభవాజ్యుడు, దేవగిరియమ్మలను చూపించి వీరే నాకు మానవ జన్మను ప్రసాదించబోయే తల్లిదండ్రులు అని చెపుతాడు. అప్పుడు పార్వతీ దేవి ఎలాగూ మీతో పాటుగా భూమిపై జన్మించే అవకాశంలేదు కాబట్టి యిప్పుడే ఒకసారి యిద్దరం కలిసి వాళ్ళ దగ్గరకు వెళ్ళివద్దామని ముచ్చటపడుతుంది. ఆమె కోర్కెను తీర్చదలచిన శివుడు ముందుగా గంగాదేవిని పంపి ఆ ప్రాంత మంతా వర్షంతో నింపమని ఆదేశిస్తాడు. అలాగే గంగాదేవి ముందుగానే "పత్రి" కేంద్రంగా గల భూభాగన్నంతా కుండపోతగా వర్షంతో నింపుతుంది. ఆనాటి రాత్రి నది బాగా పొంగుతూ వుండటం వలన పడవలు కొట్టుకొనిపోతాయేమోనని వాటిని జాగ్రత్త చేయుట కోసం భార్యతో చెప్పి భోజనం చేసిన తరువాత నది దగ్గరకు వెళ్ళిపోతాడు గంగా భవాజ్యుడు.

రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎవరో తలుపు తట్టిన శబ్దంకాగా భర్తే తిరిగి వచ్చాడేమోనన్న ఆదుర్దాతో గబ గబా వెళ్ళి తలుపు తీస్తుంది దేవగిరియమ్మ. కాని వచ్చినది భర్తకాదు, ఒక అపరిచితుడైన వృద్ధుడు లోనికి ప్రవేశిస్తాడు. ఆ చిన్న గ్రామంలో తనకు తెలియని ఈ వృద్ధుడు ఎవరు? అందునా రాత్రి తొమ్మిట గంటల ప్రాంతంలో యింటికి వచ్చాడే? ఎవరీయన అని మనసులో అనుకుంటుంది. యింతలో ఆ వృద్ధుడు అమ్మా బయట చాలా చలిగా వున్నది మీ యింటిలోపల కొంచెం వుండటానికి అవకాశం యిప్పించ మంటాడు. ఆమె వృత్తమురాలు గనుక

తలుపు తెరచి వరండాలో పడుకోమని చెప్పి ఆమె లోపలికి వెళ్ళిలోపల తలుపు వేసుకొని పడుకుంటుంది. కొంత సేపటికి ఆ వచ్చిన ముసలాయన తలుపును తడతాడు. ఆమె తలుపు తీస్తుంది. అమ్మా! నాకు ఆకలిగావుంది యింత అన్నం పెట్టమ్మా అంటాడు. ఆ మాటలు విన్న ఆమె బాధపడుతుంది. యిద్దరూ అంతకు ముందే భోజనం చేయటం వలన వండిన పదార్థమేదీ యింట్లో వుండదు. అయ్యో! ఏమీ లేదే! అని బాధపడుతూ అక్కడక్కడా వెతికి మిగిలివున్న కొద్దిపాటి పిండిని తీసుకొని కొంచెం పెరుగులో కలిపి తెచ్చిపెడుతుంది. ముసలాయన దానిని ఆరగిస్తాడు. తలుపు వేసుకొని లోపలికి వెళ్ళి పడుకుంటుంది. కొంత సేపటికి మళ్ళీ తలుపు తడతాడు. ఆమె తలుపు తెరుస్తుంది. అమ్మా నాకు కాళ్ళు నొప్పిగా వున్నాయి కొంచెం వత్తుతావా అంటాడు. ఆ మాటలకు ఆమె ఆశ్చర్యపోతుంది. భర్త యింట్లో లేని సమయంలో రాత్రివేళ పర పురుషుడు (ఆయన వృద్ధుడే కావచ్చు) వచ్చి తనను కాళ్ళు పిసకమంటున్నాడే? ఈయన సామాన్యుడైన మానవుడేనా లేక తనను పరీక్షించటానికి వచ్చిన ఆ పరమేశ్వరుడా! యిప్పుడు ఏం చేయాలి? అనే సందేహంతో పూజా మందిరానికి వెళ్ళి తల్లీ ఏమిటి ఈ పరీక్షనాకు. ఈ సమయంలో నేను ఏమి చేసేది? నేను స్త్రీని కదా! ఆయనకు సేవ చేయనా? వద్దా! నాకు యిలాంటి పరిస్థితి తెచ్చి పెట్టావేంటి తల్లీ అని పార్వతీదేవిని ప్రార్థిస్తూ ఏడుస్తుంది దేవగిరియమ్మ. ఆయనకు కాళ్ళు వత్తే సేవచేయటానికి ఎవరైనా దొరుకుతారేమోనసే ఆశతో దొడ్డి తలుపు గుండా బయటకు వెళ్ళి అంత రాత్రివేళ యిద్దరు ముగ్గురు పని మనుషులకొరకు ప్రయత్నిస్తుంది. అందుకు ప్రతి ఫలంగా వారికి కొంచెం ఎక్కువ డబ్బు కూడ యిద్దామని అనుకుంటుంది. ఎంత ప్రయత్నించినా ఎవరూ ఆమెకు కనిపించరు. నిరాశతో ఆమె ఇంటికి తిరిగి వస్తుంది. ఏమి చేయాలా అని ఆలోచిస్తుంది. ఆ వృద్ధుడి కోరిక మేరకు ఆయన కాళ్ళు నొక్కటమా! లేక మానడమా? అసలు ఈ వచ్చిన ముదుసలి ఎవరు? అని తనలో తాను మదనపడుతూ తనకు మార్గం చూపమని పార్వతీదేవిని మనసారా ప్రార్థిస్తుంది. యింతలో ఆ వృద్ధుడు మళ్ళీ తలుపు కొడతాడు. అదే సమయంలో వెనుక దొడ్డి వైపుగల తలుపు నుంచి ఒక స్త్రీ వస్తుంది. "అమ్మా నీవేమో మా యింటికి వచ్చావట. ఒక ముసలి వానికి సేవ చేయాలని పిలిచావట. అప్పుడు నేను యింటిలో లేను. యిప్పుడే వచ్చాను. నేను ఎవరికి సేవ చేయాలి?" అని అడుగుతుంది.

అప్పుడు దేవగిరియమ్మ ఆనందానికి అంతే వుండదు. తన పార్వతీదేవే ఈమెను పంపించి వుంటుందని భావించి గబాగబా పూజా మందిరం దగ్గరకు పరుగెత్తుకొని వెళ్ళి కృతజ్ఞతతో దేవికి నమస్కరించి వెంటనే తిరిగి వచ్చి ఆమెను వరండాలోనికి పంపించి ఆ వృద్ధునికి సేవ చేయమంటుంది. తరువాత తలుపు వేసుకుంటుంది. కొంత సేపటికి మళ్ళీ తలుపు తెరుస్తుంది. తలుపు తెరచి చూసేసరికి ఆ వృద్ధుడు గాని, ఆ స్త్రీగాని కనిపించరు. వారి స్థానంలో పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమౌతారు. ఆమె ఆనందమును భరించలేక వారి పాదములపై పడుతుంది. ఈశ్వరుడు పార్వతితో ఆమె మనోభీష్టాన్ని నెరవేర్చమంటాడు. మీరు ప్రదీక్షులు కదా మీరే అనుగ్రహించండి అని అంటుంది పార్వతి. నేను నీకోరికపై వచ్చినవాడను కనుక నీవే ఆవరం అనుగ్రహించాలంటాడు ఈశ్వరుడు. అప్పుడు పార్వతీ దేవి ఆశీర్వదిస్తుంది. వంశోద్ధారణకు ఒక కుమారుడు, కన్యాదానమునకు ఒక కుమార్తెను నీకు అనుగ్రహించానంటుంది. ఆ మాటలను విన్న దేవగిరియమ్మ మరల ఈశ్వరుని పాదాలపై పడుతుంది, అమ్మా! నీ భక్తికి సంతోషించాను. మూడవ గర్భంలో నేనే వచ్చి నీ కడుపున పుడతానంటాడు ఈశ్వరుడు. ఆమె నమస్కరించి పైకి లేచేటప్పటికి పార్వతీ పరమేశ్వరు లిద్దరూ మాయమౌతారు.

దేవగిరియమ్మ ఆనందంతో పొంగిపోతూ వుంటుంది. ఎప్పుడు తెల్లవారుతుందా! ఎప్పుడు తన భర్త వస్తాడా! ఈ విషయం ఆయనకు చెబుదామా! అనే ఆనందంతో ఆ రోజు తెల్లవార్లూ ఆమె మేల్కొనే వుంటుంది. కళ్ళు మూసినా తెరచినా పార్వతీ పరమేశ్వరుల పవిత్ర రూపాలు ఆమె కళ్ళముందు కనిపిస్తూనే వుంటాయి. అతి కష్టంగా ఆ రాత్రి గడిచిపోయి తెల్లవారుతుంది. ఆమె భర్త తిరిగి యింటికి వస్తాడు. ఆయనకు రాత్రి జరిగినదంతా వివరంగా వివరించి చెబుతుంది. భర్తనమ్మడు. పార్వతి ఏమిటి? పరమేశ్వరుడు ఏమిటి? మన యింటికి రావటమేమిటి? అంత తేలికగా వారు మనకు కనిపిస్తారా! ఏమిటి నీకీ పిచ్చి? రాత్రి నీకు ఏదో కల వచ్చి వుంటుంది, అని హేళనగా మాట్లాడతాడు. ఆమె ఎన్ని విధాల నచ్చ చెప్పటానికి ప్రయత్నించినా భర్త నమ్మలేక పోతాడు.

ఎవరి నమ్మకాలతోను, అపనమ్మకాలతోను నాకు సంబంధంలేదు అన్నట్లుగా కాలం ముందుకు జరిగిపోతుంది. రోజులు, వారాలు, నెలలు జరిగిపోయాయి. కొంత కాలానికి దేవగిరియమ్మ గర్భవతి అవుతుంది. నెలలు నిండిన తరువాత ఒక కుమారుడు పుడతాడు. మరుసటి సంవత్సరానికి ఒక కుమార్తె కూడ పుడుతుంది.

అంత కాలంగా పుట్టని సంతానం యిప్పుడు కలగటం, అందులోను పార్వతీదేవి వరమిచ్చినట్లుగా మొదట కుమారుడు ఆ తరువాత కుమార్తె కలగటం వలన దేవగిరియమ్మకు పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమవ్వటం నిజమేనన్న సత్యాన్ని ఆమె భర్త నమ్ముతాడు. అయితే ఆమెకు ప్రాప్తించిన ఆ దివ్యదర్శనం తనకు ప్రాప్తం కాలేదే అని బాధ పడతాడు. అప్పటి నుంచి ఆయనలో చాలా మార్పు వస్తుంది ఎలా అయినా సరే తపస్సు చేసి పార్వతీ పరమేశ్వరుల దర్శనం పొందాలనే కోరిక కలుగుతుంది. ఆ కోరిక క్రమంగా తీవ్ర కోరికగా మారుతుంది. ఈ సంసారము, బంధాలు తపస్సుకు అవరోధం అని ఆయన మనస్సుకు అనిపిస్తుంది.

గాంగా భవాజ్యాడిలో ఈ ఆలోచనలు బలపడుతూ వుంటాయి. దేవగిరియమ్మ మరల గర్భవతియై నెలలు నిండుతూ వుండగా భర్త యొక్క వైరాగ్య భావాలకు కూడ పూర్ణత్వం నిండుతూ వస్తూ వుంటుంది. మనస్సులో ధృఢ నిర్ణయం తీసుకొని ఒకనాడు భార్యతో నేను అరణ్యాలకు వెళ్ళి పోతున్నానని చెబుతాడు. సతీధర్మం ప్రకారం పతియే దైవమని భావించే దేవగిరియమ్మ భర్తను అనుసరిస్తుంది. ఆయన వెంటే బయలు దేరుతుంది. నిండు చూలాలు, భర్తతో అంతు తెలియని నిర్జన. ప్రదేశానికి ప్రయాణం, చేతిలో రూకలులేవు. ఆ పరమేశ్వరుడి మీద భారం వేసి గంగాభవాజ్యాడు. ఆ పరమేశ్వరిపై భారంవేసి దేవగిరియమ్మ ముందుకు సాగుతున్నారు. పరమేశ్వర సాక్షాత్కారమే పరమ ధర్మంగా భావించి, ఆశాపాశాలకు బాధలకు, లెక్కించకుండా ముందుకు సాగుతున్నాడు గంగాభావాజ్యాడు. నెలలు నిండి ప్రసవ సమయమాసన్నమై సాక్షాత్తు ఆ పరమ శివునికి జన్మనిచ్చే భాగ్యానికి ఒక ప్రక్క మురిసిపోతూ, అలాంటి సమయంలో దిక్కుతోచని ఈ ప్రయాణం ఏమిటా? అనే భయంతోను, ఆశ్చర్యంతోను, సంతోషంతోను కలగాపులగంగా వున్న ఆలోచనలతో పతిని అనుసరిస్తున్నది దేవగిరియమ్మ. యిలా ముందుకు సాగుతున్నది వారి ప్రయాణం.

అది 1835 వ సంవత్సరం సెప్టెంబరు నెల 28వ తేది॰ గంగా భవాజ్యాడు, దేవగిరియమ్మ ముందుకు నడుస్తూ తమ ప్రయాణాన్ని ముందుకు సాగిస్తూనే వున్నారు. ఉదయపు సూర్యకిరణాలు ప్రకృతిని మేలుకొలుపుతున్నట్లుగా తూర్పుదిశ నుంచి ఎరుపు లేతరంగులో భూమిపైకి రావటానికి సిద్ధంగా వున్నాయి. దేవగిరియమ్మకు నొప్పులు ప్రారంభమైనాయి. నిర్జన ప్రదేశంలో దేవగిరియమ్మ పెద్ద విశాలమైన

వట వృక్షం క్రింద పడుకొని ప్రసవ వేదనపడుతున్నది. సాక్షాత్తు పరమ శివుడే పశి బాలునిగా జన్మించబోతున్న ఆ సమయంలో పార్వతిదేవి అదృశ్యరూపంలో ఆమె ప్రక్కనే వుండి ఆమెకు ధైర్యం చెబుతున్నది. మతమౌఢ్యాలను, మానవజాతిలోని ఈర్ష్య, ద్వేషాలను, అహంకార, మమకారాలనే మాయా జనిత ద్వేషాలను నిర్మూలించి, శాంతి, జ్ఞాన, ప్రేమలను, సమానత్వాన్ని బోధించటానికి ఈశ్వరుడు మానవ రూపంలో అవతరించబోతున్న ఈ సరిక్రొత్త అవతారాన్ని తిలకించటానికి పైనుంచి దేవతలు అదృశ్యరూపంలో పూలవర్షం కురిపిస్తున్నారు. ప్రకృతి పులకించి తన్మయత్వం చెంది శిశువు రూపంలో అవతరించబోతున్న పరమశివునికి జోహారులర్పించి చేతులు జోడించి నిలబడి వుంది. ప్రపంచమంతటా వ్యాపించియున్న మహాత్ములైన మహనీయులందరూ ఒక్క క్షణం అచేతనులై సమాధి స్థితిలో నుంచే ఆ పరమ శివునిజననాన్ని వారి వారి నివాస స్థానాలనుంచే చూస్తున్నారు. దేవగిరియమ్మ ప్రసవ వేదన ఎక్కువైంది. శాంతి, సమభావనలతో కూడిన దివ్యత్వాన్ని తెలుపుట కోసం అవతరించిన యీశ్వరుడు పశిబాలుడై జనన మొందాడు. భారతదేశ శాంతి పర్వంలో ఒక వెలుగురేఖ గోచరించింది. ఆనాడు పుట్టిన ఆ బాలుడు షిరిడి సాయి బాబాగా ప్రసిద్ధి చెందుతాడని గాని, పిలిస్తే పలికే దైవంగా, ఎంతో మందికి అధ్యాత్మిక మార్గానికి దారి చూపి సద్గురువౌతాడనిగాని, మరణించిన తరువాత కూడ సజీవుడై భక్తులను వెన్నంటి కాపాడతాడని గాని ఆనాడు ఎవరికి తెలుసు!

దేవగిరియమ్మ సాక్షాత్తు యీశ్వరుడు తనకు బిడ్డగా పుట్టినందుకు లోలోపల ఎంతో సంతోషిస్తున్నది. ఆమె ఆనందానికి అడ్డు గోడలు లేవు. అయితే గంగా భవాజ్యాడికి మాత్రం బిడ్డ రూపంలో వున్న ఆ ఈశ్వరుని దర్శనం తృప్తిని కలిగించలేదు. తన భార్య పొందిన ఆ పార్వతీపరమేశ్వరుల నిజరూప దర్శనమే తనకు కావాలని, అదే తన జీవిత లక్షమనే ఏకైక భావనమారలేదు. యింకా బలపడినది. దేవగిరియమ్మ ప్రసవవేదన నుండి తేరుకొన్నది. గంగా భవాజ్యాడు అప్పటికి తన బాధ్యత పూర్తి అయినట్లుగానే భావించాడు. అరణ్యం వైపు ప్రయాణానికి సిద్ధమయ్యాడు ఆమె మాత్రం మనసులో మధనపడుతున్నది. అటు పశికందు, యిటు భర్త, యింకొక ప్రక్క ప్రశవంవలన కలిగిన అలసట, బలహీనత, వీటన్నిటినీ మించి పతినే అనుసరించాలనే సతీ ధర్మం. గుండె రాయి చేసుకున్నది. మమకారాన్ని తెంచుకున్నది. కర్తవ్యాన్ని మాత్రమే పాటించదలచుకున్నది. కొన్ని పచ్చని ఆకులు

వత్తుగా నేలపై పరచింది. వాటిపై తనవద్దగల మెత్తని గుడ్డను మరింత వత్తుగా పక్కవేసింది. తన బిడ్డను దానిపై పడుకోపెట్టింది. సాక్షాత్తు పరమేశ్వరుడే బాలుని రూపంగా పుట్టినా, ఆ చిన్నారిని యిలా నిర్జన ప్రదేశంలో వదలి వెళ్ళవలసి వచ్చినందుకు చాలా బాధపడింది. మాతృ సహజమైన ప్రేమ కన్నీరు రూపంలో ముంచుకు వచ్చింది. గుండెల లోతులలో నుంచి పొంగివచ్చిన ఆ దుఃఖపు కన్నీళ్ళు వెచ్చగా క్రిందపడుకో పెట్టిన పశి బిడ్డపై పడుతున్నాయి. ఆ కన్నీటి బొట్లే ఆ తల్లి కొడుకుల మధ్యగల ఆఖరి సంబంధం. తన బిడ్డకు రక్షణ, పోషణ చేయలేని తన నిస్సహాయతను తలచుకొని ఆమె విలపిస్తున్నది. ఈ సృష్టినంతటిని రక్షించగల ఆది శంకరునికి ఆమె రక్షణతో అంత అవసరంలేదన్న సంగతి ఆమెకేం తెలుసు పాపం!

గంగా భవాజ్యాడి మనసులో ఈ ఆలోచనలేమీ లేవు తాను సాధించవలసిన ఈశ్వర సాక్షాత్కారమే ఆయన కన్నుల ముందు ప్రతి క్షణం కనిపిస్తున్నది. అందుకు ఈ కుటుంబ బంధాలు, మమకారాలు అడ్డుగోడలని, వాటికి దూరంగా అడవిలోకి వెళ్ళి తపస్సు చేయాలనే కోరిక ఒక్కటే ఆయన మనస్సంతా నిండిపోయింది. ఆయన అక్కడినుండి అడుగులు ముందుకు వేసినడుస్తున్నాడు. పతివ్రతా ధర్మంగా ఆమె భర్తను అనుసరించి వెనకాలే వెళుతున్నది. ఒకటి, రెండు, మూడు, అలా ఎన్నో అడుగులు ముందుకు వేస్తూనే వుంది. ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్న కొద్ది ఆమెలోని మాతృత్వపు మమకారం కన్నీరుగా కరిగి కళ్ళ నుంచి ధారగాకారుతునే వుంది. వెనక్కు తిరిగి చూస్తూ అడుగులు మాత్రం ముందుకు వేస్తూనే వుంది. కళ్ళ నిండా కన్నీళ్ళు నిండటంవలన ఏమో తన బిడ్డడు మసక మసకగా కనిపిస్తున్నాడు. అలా కొంత దూరంపోయేటప్పటికి కొన్ని చెట్లు అడ్డం వచ్చాయి. అయినా వెనక్కు చెట్టు కొమ్మల మధ్య నుంచి, చిన్న చిన్న మండలు, ఆకుల మధ్య నుంచి తొంగితొంగి తన కుమారుని చూడకుండా ఆమె వుండలేకపోతున్నది. బహుశా ఈమె బాధ చూడలేకేమో తెలియదు కాని అంతవరకు సాఫీగా సాగిన కాలిదారి మలుపు తిరిగింది. యిక బిడ్డను చూసే అవకాశమే లేదు. భర్త వెనకాల అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా నడవసాగింది ఆమె. గమ్యం తెలియని వారి ప్రయాణం ఎక్కడి వరకు సాగిందో, ఎలా సాగిందో రాబోయే అధ్యాయాలలో తెలుసుకుందాము.

బంగారు కొండపై కైలాసంలో పార్వతీదేవి సమేతంగా ప్రమధ గణములతో కొలువు తీరి వుండవలసిన పరమేశ్వరుడు ఆ నిర్జన ప్రదేశంలో చెట్టుక్రింద తన చిన్న కాళ్ళను, చేతులను అటూ యిటూ ఆడిస్తూ తనను పెంచటానికి రావలసిన మనిషికోసం ఎదురుచూస్తూ వున్నాడు. ఆ మహాత్ముని పెంపకానికి సిద్ధంగా ఏ లోకాల నుంచి ఏ మహా మహుడు వచ్చి సిద్ధంగా వున్నాడో మనకు తెలియక పోయినా ఆయనకు తెలుసు కదా! ఆ మహాత్ముడు రోషన్‌షా అనే పేరుగల ఒక ఫకీరు రూపంలో రానే వచ్చాడు. అయన తన భార్యతో కలసి ఆ దారిన వెళుతువుండగా పిల్లవాని ఏడుపు విని పిల్లలు లేని తన భార్యకు అల్లా వరప్రసాదంగా ఆబాలుణ్ణి యిస్తాడు.

ఆ దంపతుల అదృష్టాన్ని ఏమని అనగలం. పరమశివునికి పాలు పడుతూ, స్నానం చేయిస్తూ, మురిసిపోతూ వుండేవారు. 1839 వ సంవత్సరం వరకు అంటే నాలుగు సంవత్సరాల వయసు వచ్చే వరకు ఆ బాలుడు ఆ ఫకీరు వద్దే పెరిగి పెద్దవాడయ్యాడు, దైవలీలలు అతి విచిత్రం. ఎవరు ఎప్పుడు, ఎందుకు, ఎలా కలుస్తారో, ఎలా విడిపోతారో సామాన్యులమైన మనలాంటి వారికి అర్థం కాదు. ఆ ఫకీరు ఒకనాడు మరణించాడు. ఫకీరు భార్య కూడ బాలుని పుత్ర ప్రేమతో పెంచుతూ వుంటుంది.

అప్పుడు ఆ ప్రాంతాలలో హిందూ ముస్లిం మత భేదాలు బాగా వుండేవి. అలాంటి భేద వాతావరణంలో ఈ బాలుని ప్రవర్తన మరింత విచిత్రంగా వుండేది. వున్నట్టుండి ఒకసారి హిందూ దేవాలయములోనికి వెళ్ళి "రాముడే దేముడు, శివుడే అల్లా" అని బిగ్గరగా అరుస్తూ వుండేవాడు. అలా ప్రవర్తించినప్పుడు అటు హిందువులు, యిటు ముస్లిములు కూడా ఆ పిల్లవాడిని బాధిస్తూ వుండేవారు. రెండు మతముల వారు తరచుగా వచ్చి ఫకీరు భార్యతో ఫిర్యాదు చేస్తూ వుండేవారు. మగదిక్కులేని తన యింటికి వూరిలోని వారందరూ వచ్చి మందలిస్తూ వుంటే ఆమె చాలా బాధపడుతువుండేది. ఆఖరికి ఆ ఫిర్యాదులు భరించలేక ఆ పిల్లవాడిని తీసుకొని వెళ్ళి దగ్గరలోనే వున్న వెంకూసాదాస్ అనే ఒక సాధువునకు అప్పగించాలని అనుకుంటుంది.

ఓం శాంతి శాంతి శాంతి

రెండవ అధ్యాయం సంపూర్ణం.

మూడవ అధ్యాయము

అప్పటి నిజాంపరిపాలనలో (ప్రస్తుత మహారాష్ట్ర)గల "జాంబవావీ" అనే గ్రామంలో కేశవరావు అనే సద్బ్రాహ్మణుడు వుండేవాడు. ఈయన భార్య మహాపతివ్రత. వీరిద్దరు తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తులు. చాలాకాలం వీరికి పిల్లలు పుట్టని కారణంచేత ప్రతి నిత్యం వీరు పుత్ర సంతానం కోసం శ్రీ వెంకటేశ్వరుణ్ణి విశేషంగా ప్రార్థించేవారు. ఒకనాడు ఆ స్వామి కేశవరావుకు కలలో దర్శనమిచ్చి పూర్వము కాశీలో అనేక పుణ్యకార్యాలు చేసిన పవిత్రుడైన రామానంద యోగి వారికి త్వరలో కుమారుడుగా జన్మించునని చెప్పెను. కొంతకాలమునకు కేశవరావు భార్య గర్భవతి అయ్యెను. నెలలు నిండుతున్న కొద్ది కేశవరావు ఆమెకు అనేక ఆధ్యాత్మిక గ్రంధాలు చదివి వినిపిస్తూ, అష్టాంగ యోగాలను, ఆత్మజ్ఞానాన్ని సవివరంగా బోధిస్తూ వచ్చాడు. గర్భంలో వున్న శిశువుకు తల్లి ద్వారా జ్ఞానం అందించటానికి చేసిన కృషి అది. నెలలు నిండి ఆ పుణ్యాత్మురాలు ఒక శుభ ముహూర్తాన చక్కని బాలుని ప్రసవించెను. ఆ బాలునికి "గోపాలరావు" అని పేరు పెట్టి అనేక రకాలైన విద్యలు అత్యంత శ్రమకోర్చి గోపాలరావుకు నేర్పించారు ఆ తల్లిదండ్రులు. యుక్త వయస్సురాగా యొగ్యురాలైన తగిన కన్యను చూసి వివాహం జరిపించారు.

గోపాలరావు యుక్తి, శక్తి, ఓర్పు, నేర్పు గలవాడు. అన్నింటికీ మించి పరోపకారం, సేవా భావాలు గలవాడు. తన బల పరాక్రమాలచే పీష్వాలను మెప్పించి "జింతూరు" అను పరగణాను జాగీరుగా పొంది ప్రజలను కన్న బిడ్డలవలె ప్రేమించి పాలించెను. తన నివాసమును తన ప్రాంతానికి కేంద్రంగా వున్న "సేలు" అనే గ్రామానికి మార్చి దానిని ఎంతో అభివృద్ధి గావించెను. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన వెంకటేశ్వర భక్తే ఆయనకు అంతులేని ఆస్తి. అప్పుడప్పుడు ఆయనకు వెంకటేశ్వరుడు ప్రత్యక్షమౌతూ ఉండేవాడు. ఆయన తన కోటలోనే ఒక ఆశ్రమాన్ని స్థాపించి ఎంతో మందికి ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రసాదించాడు. ఒకనాడు ఆయన తన కోటమీద సాయంత్రంపూట చల్లగాలిలో విహరిస్తూ వుండగా యుక్త వయస్కురాలైన ఒక స్త్రీ స్నానము చేయటానికి బట్టలు వూడ తీసుకుని నగ్నంగా వుండటం చూసి మనస్సు చలించగా తన మనో వికారానికి కారణమైన కళ్ళలో సూదులు గ్రుచ్చుకుని కంటి చూపు పోగొట్టుకుంటాడు.

కంటి చూపులేని కారణంగా పరిపాలనా బాధ్యతలలో సరిగా పాల్గొనలెక పోతాడు. జమిందారీ వ్యవహారాలు చూసే సన్నిహితుల కోరికపై ఒకసారి తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజ ఏర్పాటుచేసి ఆ స్వామి అనుగ్రహంవలన పోయిన కంటిచూపును తిరిగి పొందగలుగుతాడు. ఆనాటి నుంచి శ్రీ వెంకటేశ్వరుని దాసుడు ఈయన అనే భావనతో "వెంకుసాదాస్" అనే మారుపేరుతో పిలవబడుతూ వుండేవాడు. రాను రాను "వెంకూసా"గా ఆయన పేరు స్థిరపతిపోయింది. దయా దాక్షిణ్యములకు, నిరుపేదలను ఆదరించటంలో మంచి పేరు తెచ్చుకున్న ఈ వెంకూసా దగ్గరకు రోషన్‌షా భార్య నాలుగేండ్లు నిండిన ఆ బాలుణ్ణి తీసుకొచ్చి అప్పగించాలని ఆలోచన చేయగా ఆయన అప్పుడు తీర్థయాత్రలు చేస్తూ వున్నాడని తెలుస్తుంది. వెంకూసాకు మతభేదంలేదు. కులభేదం లేదు. జాతి విచక్షణలేదు. కేవలం మానవతావాది ఆయన. అందువలన తీర్థయాత్రలు చేస్తూ హిందూ దేవాలయాలనే కాక, మహమ్మదీయుల దర్గాలను, గురుద్వారాలను కూడ దర్శిస్తూ అహమ్మదాబాద్‌లో గల "సావగ్వాహి" దర్గాను సమీపించగానే ఆశ్చర్యకరముగా ఆ దర్గా నుండి కొన్ని మాటలు వెంకుసాను ఉద్దేశించి యిలా వినిపిస్తాయి. "సలామ్ లేకుం మహరాజ్! నీవు కారణ జన్ముడవు. నీవు నివసించే "సేలు" గ్రామమునకు 100 మైళ్ళ దూరంలో గల "మన్వాత్" అనే గ్రామంలో లోకోద్ధరణకు పుట్టిన అల్లా ఒక సాధువైన ఫకీరు యింట్లో పెరుగుతున్నాడు. నీవు తిరిగి వెళ్ళిన తరువాత నీ దగ్గరకు వస్తాడు. ఆ బాలునికి నీవు గురువువై అన్ని విద్యలు నేర్పించాలి. యిది దైవకార్యం. నీ పెంపకంలో ఆ బాలుడు పెరిగి పెద్దవాడై జగద్గురు వౌతాడు."

తాను చేయవలసిన తీర్థయాత్రలను త్వరగా ముగించుకొని సేలు చేరగానే రోషన్‌షా భార్య తాను పెంచుతున్న బాలుడిని తీసుకొచ్చి వెంకుసాకు అప్పచెబుతుంది. అలా తన అయిదవ ఏట బాబా వెంకుసా దగ్గరకు చేర్చబడతాడు. రోషన్‌షా బాబాకు "మజీదా" అనే పేరు పెట్టినట్లుగాను వెంకుసా దగ్గర కూడ అదే పేరుతో పిలవబడినట్లుగా కొన్ని ఆధారాలు దొరుకుతున్నాయి.

వెంకుసా ఆ బాలునికి అతి చిన్న తనంలోనే సమస్త ఆధ్యాత్మిక విద్యలు నేర్పాడు. సహజ దైవత్వంతో పుట్టిన ఆ బాలుడు అచిరకాలంలోనే అన్ని విద్యలలో అరితేరాడు. ఆ బాలుడు వెంకూసా యొక్క ఆశ్రమంలోనే పెరిగి పెద్దవాడవుతున్నాడు. వెంకూసా ఆ బాలుని తన ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించి ఆదరించేవాడు.

యిది అక్కడి వారందరికి నచ్చక వారు ఆ బాలుని యందు అసూయా, ద్వేషాలను పెంచుకున్నారు. ఈ ఆశ్రమంలో వున్న కాలంలో వెంకుసా అప్పుడప్పుడు ఆ బాలుణ్ణి తన వెంట యితర గ్రామాలకు తీసుకువెళుతూ వుండేవాడు. అలాగే 1842 వేసవికాలంలో ఒకసారి యిద్దరూ షిరిడి గ్రామానికి వచ్చారు. 7 రోజులు ఆ గ్రామంలో వున్నారు. బయజాబాయి యింట్లో భోజనంచేసి రాత్రులందు వూళ్ళో గల చిన్న గుళ్ళలో నిద్రించారు. అంటే బాబా మొట్ట మొదట షిరిడి ప్రవేశించింది 1842లో. మొట్ట మొదటగా ఆహారం పెట్టిన కారణం చేతనే నేమో బాబా తరువాత కాలంలో బయజాబాయికి బాగా దగ్గరై "అక్కా" అని కూడ సంబోధించారు. యిదే విధంగా నానావళితో కూడ ముందుగానే ఈ బాలుడికి పరిచయం ఏర్పడుతుంది.

నానావళి వయసులో బాబాకన్న చిన్నవాడు నానావళి అనే ఒక మహాత్ముని సమాధికి ఔరంగాబాదు ప్రాంతంలో సేవ చేస్తూ వుండేవాడు. అందువల్ల అతనికి నానావళి అనే పేరు స్థిరపడిపోయింది. వెంకూసాతో కలిసి పర్యటన చేస్తున్న కాలములోనే మొట్ట మొదటిసారిగా బాబా, నానావళుల యొక్క కలయిక 1849లో జరుగుతుంది. నానావళిబాబాను అతి చిన్నతనంలోనే "మామా" అని పిలచేవాడు. సూఫీ మతస్థుడైన ముస్లిం పకీరు రోషన్‌షా ఇంట్లో పెరిగి, హిందూ మతస్థుడు తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తుడు అయిన వెంకూసాదాస్ చేతుల మీదగా పెరిగిన ఆ బాలుడు హిందూ మహమ్మదీయ మతాలలోని మౌలిక సిద్ధాంతాలతోపాటు రెండు మతాలలో గల మూఢాచారాలను కూడ బాగా అవగాహన చేసుకోగలిగాడు. వెంకూసా హిందూ మతస్థుడే అయినా రెండు మతాలలోని మహత్ములను, వారి సమాధులను తాను వెంటవుండి స్వయంగా ఆ బాలునికి చూపించి వారి వారి బోధనలను, సిద్ధాంతాలను వివరించి చెప్పేవాడు.

కాలచక్రం తిరుగుతూవున్నది కారణ జన్ముడయిన పిల్లవాడు, శివ అంశతో పుట్టిన ఆ బాలుడు త్వర త్వరగా ఆది భౌతిక, అధ్యాత్మిక, ప్రాకృతిక, శారీరక జ్ఞానాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నాడు. పంచభూతముల తత్వాలను అష్ట దిక్కుల యొక్క అవసరాలను, అనుభవ పూర్వకంగా తెలుసుకోగలుగు తున్నాడు. ఈ చరాచర సృష్టికి మూలమైన దివ్య శక్తిని దర్శించగలుగుతున్నాడు. శరీరంలో గల ప్రాణం, ఆత్మ, మనస్సు, బుద్ధి, అహంకారం, వీటి అస్థిత్వాన్ని గుర్తించగలుగు తున్నాడు, యింద్రియాలకు వీటికి గల సంబంధాన్ని పూర్తిగా గ్రహించి, దేనితో

యింకోదాన్ని అరికట్టాలో, శరీరంలో గల దివ్యశక్తిని ఎలా అదుపులో వుంచి అజ్ఞాపించగలగాలో నేర్చుకున్నాడు. కళ్ళలో దివ్య తేజస్సు, మాటలో స్థిరత్వం, చేతలలో నిశ్చలత్వం, ఆలోచనలలో పూర్ణత్వం నిండి తొణికిసలాడుతున్నాయి ఆ బాలునిలో.

వెంకుసా ఆనందానికి అవధులే లేవు. తాను చూస్తూ వుండగానే, తన చేతులమీదుగా పెరుగుతున్న ఆ బాలుడు అద్వితీయ, మానవాతీత శక్తి యుక్తులతో నిండిన దివ్యశక్తితో ప్రకాశించటం చూసి అప్పుడప్పుడు ఆనంద భాష్పాలు కళ్లనుండి కన్నీరుగా కారుతూవుంటే నిశ్చేష్టుడై ఆ బాలుని వైపు చూస్తూ వుండిపోయేవాడు. పగలు రాత్రి ఆ పసివాడిని తన వద్దే వుంచుకునేవాడు. ఒక్క క్షణం అయినా అతనిని విడిచి వుండటాన్ని సహించగలిగేవాడు కాదు. అతనికి స్నానం చేయించటం, బట్టలు తొడగటం, ఆహారం పెట్టటం, నిద్రపుచ్చటం లాంటి పనులన్నీ తాను స్వయంగా చేసేవాడు. రాత్రి పడుకునేటప్పుడు కూడ తనతోనే పడుకోపెట్టుకునే వాడు. ఏనాడైన యితర పనులు ఎక్కువగా వుండి ఈ పనులన్నీ తాను స్వయంగా ఆ పిల్లవానికి చేయకపోతే వెంకూసాకు ఆ రోజు మనసంతా బాధగా, ఆందోళనగా, అశాంతిగా వుండేదట. యిది ఆ బాలునియందు వెంకూసాకు కలిగిన సహజ ప్రేమో, లేక భగవంతుడు స్వయంగా ప్రక్కన వున్నప్పుడు పొందే ఆకర్షణో సామాన్యులమైన మనకేమి అర్ధమౌతుంది. ఏది ఏమైనా సాక్షాత్తు కైలాసవాసుడైన పరమ శివునికే గురువుగా, రక్షకునిగా, సహాయకునిగా, తల్లిగా, తండ్రిగా, సర్వస్వంగా తయారైన వెంకూసా జీవితం ధన్యం. ఆయన రూపం మనకు తెలియకపోయినా మన సాయికి సర్వస్వం తానే అయి పెంచిన ఆ పుణ్యాత్ముని పాదాలకు ఒక్కసారి మన మనస్సులలోనే నమస్కారిద్దాం. సాయిని తీర్చిదిద్ది ప్రపంచవ్యాప్తిగా గల కోట్లాది భక్తులకు అందించిన ఆ మహాత్మునికి, రెండవసారి నమస్కారం చేద్దాం. సాయి మనందరికి సమర్ధుడైన సద్గురువు. అలాంటి మన గురువుకే గురువై నిలిచిన అదృష్టానికి గాను మూడవసారి కూడ కృతజ్ఞతా పూర్వకంగా భక్తితో ఆయనకు నమస్కరిద్దాము.

"వెంకూసా" ఈ బాలుడిని విసేష శ్రద్ధతో పెంచటంవలన ఆశ్రమవాసులందరికి ఆ బాలుని యందు ప్రేమానురాగాలు పెరగటానికి బదులుగా, ఈర్ష్య, ద్వేషాలు బలంగా పాదుకుపోవటానికి ముఖ్య కారణంగా మారింది. మాయాశక్తి

ప్రభావం అంత బలీయమైనదేమో! సాక్షాత్తు భగవంతుడే స్వయంగా పుట్టినా బలీయమైన ఈ మాయాశక్తి కోరలకు చిక్కక తప్పలేదంటే యిక సామాన్యులమైన మనందరం మాయకు దాసులు కావటం అనివార్యం.

ఈ బాలునికి విద్యా రహస్యాలు, అధ్యాత్మిక బోధలు చేస్తున్న సమయాలలో ఆశ్రమంలోని మిగిలిన వారంతా వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా అనవసరపు అడ్డదిడ్డమైన ప్రశ్నలు, సంభాషణలతో వెంకూసా దృష్టిని మళ్ళిస్తూ వుండేవారు. యిలాంటి యిబ్బందులు తరచు వుండటంవలన విద్యా బోధన సరిగ్గసాగదని భావించి వెంకూసా ఈ బాలుడిని అడవికి తీసుకు వెళ్లాడు. అక్కడ ప్రశాంత వాతావరణంలో ఆరు నెలలకు పైగా తనకు తెలిసిన సమస్త విద్యలు, జ్ఞానం, ప్రపంచ పోకడలు, మానవ మనస్సు యొక్క మర్మాలనన్నిటిని పూర్తిగా బోధిస్తూ వుంటాడు. వెంకూసా వారసులు, శిష్యులు కొందరు కలిసి వీరి ఆచూకి తెలుసుకుని తిరిగి ఆయనను సేలు తీసుకు వెళ్ళాలనే ప్రయత్నంలో కొంత మందిని ఆ పని పై పంపుతారు. వారు మొత్తంమీద వీరిద్దరు వున్నచోటు తెలుసుకో గలుగుతారు. అలా వాళ్ళు తమ ఉనికి గుర్తించినట్లు వెంకూసా కూడ గ్రహిస్తాడు. అజ్ఞానం పూర్తిగా తొలగని అహంభావంలో వున్న వాళ్ళు గనుక తన వారసులు ఈ బాలునికి ఏదైనా అపకారం కూడ తలపెడతారని వూహిస్తాడు. అలశ్యం చేయకుండా తనకున్న కొన్ని శక్తులను ఆశ్వీయుజ శుద్ధ దశమినాడు శాస్త్రోక్తంగా ఆ బాలునికి ధారపోస్తాడు. 16 సంవత్సరములు నిండుతున్న ఆ చిరు వయస్సులోనే దివ్య శక్తులతో పూర్ణరూపుడుగా కనపడుతూంటాడు ఆ బాలుడు.

దైవ నిర్ణయం ప్రకారం తనవంతు పనిని తాను నిర్వహించానని, త్వరలోనే మన యిద్దరం విడిపోవలసి వుంటుందిని కూడా హెచ్చరిక చేస్తాడు ఆ బాలునికి. తన జీవత పరమార్ధం నెరవేరింది కాబట్టి యిక తాను సమాధి అవుతానని కూడ సూచన చేస్తాడు వెంకూసా. శాస్త్ర ప్రకారం గురువు సమాధి అవటం శిష్యుడు చూడరాదు. నీవు తిరిగి సేలు పరిసర గ్రామాలకు వస్తే, ఈర్ష్యా ద్వేషాలతో అక్కడివారు నీకు హాని కలిగించే ఏర్పాట్లు చేస్తారు. అలాంటి అశాంతిలో నీవు సాధనా మార్గంలో ప్రశాంతంగా గడపలేవు. యింకా నేను నీతో కలిసి వున్నా నావాళ్ళు మనలను వెంటాడుతూనే వుంటారు. కాబట్టి యిక మనిద్దరం విడిపోవటం తప్పదని సమాధానపరుస్తాడు. మిగిలిన శక్తులనన్నిటినీ పూర్ణిమ రోజున ఆ బాలునికి ధారపోసి

వెంకూసా సేలు తిరిగి వెళ్ళటానికి, ఆ బాలుడు గోదావరి నదీతీరంగా ముందుకుసాగి వెళ్ళటానికి కూడ నిశ్చయమౌతుంది. వీరిద్దరి ఉనికిని తెలుసుకున్న వార్తాహరులు విషయాన్ని "సేలు"కు చేరుస్తారు. అక్కడి నుంచి వెంకూసా వారసులు వెంటనే వచ్చి రహస్యంగా ఒక రోజు వీరిద్దరి దినచర్యను గమనిస్తారు.

ఈ బాలుని కోసమే ఆస్థిని, కుటుంబాన్ని, ఆశ్రమాన్ని వదిలి వెంకూసా వచ్చాడు కాబట్టి రహస్యంగా ఈ బాలుని మాయంచేసి తీసుకుపోతే తప్పక తిరిగి తన స్వగృహానికి చేరతాడనే పిచ్చి ఆలోచనలతో వారు రహస్యంగానే వుండి బాలుడిని ఎత్తుకుపోవాలని ప్రయత్నిస్తారు. వారి మనస్తత్వం ప్రకారం యిలాంటి ప్రయత్నమేదో చేయవచ్చనే ఆలోచనతో వెంకూసా జాగ్రత్తగా ఒక్కక్షణం కూడ ఆ బాలుని వదలి వుండడు. తీసుకు వెళ్ళటానికి వీలుపడటం లేదు కాబట్టి, రహస్యంగా అతనిని చంపివేస్తే అప్పుడైనా గత్యంతరం లేక తిరిగి యింటికి చేరుకుంటాడనే ఆలోచనలతో ఆ రాత్రికి హత్యా ప్రయత్నానికి ఏర్పాట్లు చేసుకుంటారు. అది చతుర్దశి నాటిరాత్రి. తెల్లవారితే పూర్ణిమ. వెంకూసా, 16 సంవత్సరముల ఆ బాలుడు, యిద్దరూ చెరొక దారి విడిపోయి వెళ్ళి పోవటానికి నిర్ణయించుకున్నరోజు. ఈ విషయం పాపం వెంకూసా బంధువులకు తెలియదు కదా! పండువెన్నెలలో వాళ్ళు హత్యాప్రయత్నానికి కావలసిన ఏర్పాట్లు గురించి ఆలోచిస్తున్నారు. కర్రలు కత్తులులాంటి గట్టి ఆయుధాలేమీ లేవు. ఆఖరికి దగ్గరలో పెద్ద కొండరాళ్ళు లాంటివి కూడలేవు చూస్తుండగానే అర్ధరాత్రి అయిపోతుంది. అప్పటి వరకు కూడ అనేక విషయాలు బోధిస్తూ వుంటాడు వెంకుసా! కొద్ది క్షణాల తరువాత యిద్దరూ ప్రక్క ప్రక్కనే పడుకుని నిద్రపోవటానికి సిద్ధమౌతారు.

మన కథా నాయకుడైన బాలుడు నిశ్చల భావంతో నిద్రపోతూ వుంటాడు. వెంకూసాకు నిద్రరాదు. అంతులేని ఆలోచనా తరంగాల్లో విహరిస్తూ వుంటాడు. అటు హత్యాప్రయత్నంలోని వాళ్ళలో ఒకడు ఆలస్యం చేయరాదని దగ్గరలోనే పడివున్న బాగా కాలి గట్టిగా వున్న పెద్ద సైజు యిటుకరాయిని తీసుకుని బాలుని తలపై గట్టిగా కొట్టి ఒక్క దెబ్బతోనే ప్రాణం పోయేలా చేయాలని అడుగులు ముందుకు వేస్తుంటాడు. నిద్రరాక ఆలోచనా వ్యూహాలలో నుంచి ఒక్కసారి కళ్ళు తెరుస్తాడు వెకూసా. అప్పటికే రాయి బాలుని తలపై పడటానికి సిద్ధంగా వున్నది. పట్టరాని ఆవేశంతో కళ్ళెర్ర చేసి ముందు తన తలను అడ్డంగా పెడతాడు. యిటుకరాతి

దెబ్బ వెంకూసా నుదుటిపై బలంగా తగలటంవలన నుదురు చిట్లి రక్తం చిందరవందరగా పడుతుంది. అంతకు ముందే కాలరుద్రుని వలె ముందుతున్న కోపం ఆ దెబ్బవలన కలిగిన బాధతో మరింత వుధృతమై శాప వాక్యాలుగా ఆ పుణ్య పురుషుని నోటి నుంచి బయటకు వస్తాయి. ఆ మహాత్ముని వాక్కుల ప్రభావంచేత యిటుక రాయితో కొట్టినవాడు మరుక్షణంలోనే మరణిస్తాడు. కేవలం కొన్ని క్షణాలలోనే జరిగిన ఈ సంఘటనలన్నీ నిద్ర నుంచి వెంటనే మేల్కొన్న ఆ బాలుడు కూడ గమనిస్తాడు. హత్యా ప్రయత్నంలో పాల్గొని దూరాన్నుంచి చూస్తున్న యింకో యిద్దరు ఆ కోపాగ్నిలో వాళ్ళు కూడ బలికాకుండా దూరంగా పారిపోతారు.

వెంకూసా నుదుటిపై నుంచి కారుతున్న రక్తాన్ని ఆ పిల్లవాడు తన అంగీ నుంచి గుడ్డను చింపి తుడుస్తాడు. మాటల కందని మౌన ప్రేమానురాగాలు ఆ గురుశుష్యుల మధ్య రాజ్య మేలుతూ వున్నాయి. మాటలు లేవుగాని. మనస్సులు రెండు ఏకమౌతున్నాయి. నా ప్రాణాలు పోయినా సరే నిన్ను ఈ లోకానికి "గురు" రూపంలో అందించి తీరుతాను. అదే నా జీవత లక్ష్యం అన్నట్లుగా వెంకూసా హృదయం తృప్తి పడుతూవుంటే, నా ప్రాణాన్ని రక్షించటం కోసం, మీ ప్రాణాన్ని అడ్డుపెట్టిన గురుదేవునికి ఏమిచ్చి నేను ఋణం తీర్చుకోగలను అన్నట్లుగా బాలుడి హృదయం ప్రతిధ్వనిస్తున్నది. ఈ విధంగా గురుశిష్యుల హృదయాలు ఏకమౌతున్నాయి. భావాలు ఏకమౌతున్నాయి. ప్రేమానురాగాలు లయమౌతున్నాయి. శరీరాలు వేరు వేరుగా వున్నా హృదయాలు మాత్రం మాటలకందని మౌన శిఖరాలపై ఏకమై, తన్మయత్వంతో, ఆనంద తరంగాలలో తేలియాడుతున్నాయి. అది నిజమైన గురుశిష్యుల అనుబంధం.

వీరి ప్రేమానురాగాలను తనివి తీరా చూసిన ఆకాశంలోని చంద్రుడు ఈ వార్తను బహుశా సూర్యునికి చెప్పడేమో! పాపం సూర్యుడు త్వర త్వరగా ప్రయాణమై వస్తున్నట్లుగా వున్నాడు. తూర్పున ఎర్రని వెలుగు రేఖల జీరలు ఆకాశంపై కనపడుతున్నాయి. అది గమనించిన వెంకూసా ముందుగా అనుకున్న ప్రకారం తమ, తమ ప్రయాణాలు సాగించవలసిన సమయం దగ్గర పడుతున్నది కాబట్టి యింకా మిగిలిన కొన్ని శక్తులను ధారపోయుట కొరకు గబ గబా యిద్దరు స్నానం చేస్తారు. దగ్గరలోనే వున్ననల్ల ఆవుపాలను పితికి సూర్యుని ఎర్రని కిరణాల మధ్యగా అతి ముఖ్యమైన తన వద్ద మిగిలిన శక్తులనన్నిటినీ బాలునికి ధారపోసి, వెంటనే శాపగ్రస్తుడై చనిపోయి పడివున్న వాడిని బ్రతికించమని ఆదేశిస్తాడు. ఆ బాలుడు

గురువుగారి కుడి పాదం బొటన వ్రేలును కడిగిన నీటిని మంత్రించి చల్లటం వలన చనిపోయిన మనిషి బ్రతుకుతాడు. అతను తాను చేసిన హత్యా ప్రయత్నానికి సిగ్గుపడి క్షమించమని కోరతాడు.

తన వద్దగల కొన్ని విలువైన అభరణాలను బహుమతిగా శిష్యునికి యివ్వబోతాడు వెంకూసా అవి తనకు వద్దని, నా ప్రాణాన్ని కాపాడి నాకు బదులుగా ఏ యిటుక రాయి దెబ్బను మీరు తిన్నారో ఆ రాయిని మీ ప్రసాదంగా ఆశీర్వదించి యివ్వమని పిల్లవాడు గురువును అర్థిస్తాడు. శరీరం అంతా పులకించిపోగా, శిష్యవాత్సల్యం పెల్లుబికి రాగా ఆనందభాష్పాలు కళ్ళ నుంచి జల జలా రాలుతూ వుండగా గురివు శిష్యుణ్ణి ఆశీర్వదించి యిటిక రాయిని చేతులలో వుంచుతూ నావలెనే యిది కూడ నీకు తోడుగా, నీడగా నీ జీవిత భాగస్వామిగా వుంటుందని అనుగ్రహిస్తాడు. బాలుడు మళ్ళీ గురువుకు చేతులు జోడించి, మీరనుగ్రహిస్తే మీరక్తంతో తడిసిన ఆ గుడ్డముక్కను కూడ మీ ఆశీర్వాదాలతో నాకు యివ్వండి. దానిని మీ గుర్తుగా నేను దాచుకుంటాను అంటాడు. శిష్యుని ప్రేమకు చలించిపోయిన వెంకూసా వెంటనే ఆ గుడ్డ పీలికను తలపై కట్టి యిది నీకు సర్వత్రా సర్వకాల సర్వావస్థలయందు రక్షగా వుంటుందని ఆశీర్వదిస్తాడు. గోదావరి నది వడ్డునే నడచుకుంటూ కొద్దిగా ముందుకు వెళ్ళమని. ఎక్కడ నీ మనస్సుకు ప్రశాంతత కనిపిస్తే అక్కడ స్థిర నివాస మేర్పరచుకోమని, స్త్రీకి, ధనానికి దూరంగా వుండమని ఆదేశించి చనిపోయి బ్రతికిని తనరక్త సంబంధీకునితో కలసి వెంకూసా సేలుకు ప్రయాణమౌతాడు.

1854వ సంవత్సరంలోని మార్గశిర పౌర్ణమి నాటి ఉదయాన్నుంచి 3 రోజులపాటు గోదావరి నది ఒడ్డునే ప్రయాణించిన తరువాత ఆ బాలుడు కోపరగాం అనే గ్రామానికి చేరుకున్నాడు. ఒక్కరోజు అక్కడ విశ్రమించి తిరిగి తన ప్రయాణాన్ని షిరిడి గ్రామం వైపు సాగించి సాయంత్రానికి షిరిడికి చేరుకున్నాడు. ఎవరి దగ్గరకు వెళ్ళి ఆశ్రయించటం యిష్టంలేక పూరి వెలుపలగల పెద్ద వేపచెట్టు నీడన వుండటం మొదలు పెట్టాడు.

ఓం శాంతి శాంతి శాంతిః

మూడవ అధ్యాయం సంపూర్ణం.

నాలుగవ అధ్యాయము

1835వ సంవత్సరం సెప్టెంబరు నెల 28వ తేదినాడు కారణ జన్ముడైన కుమారునికి జన్మనిచ్చిన తరువాత గంగా భవాజ్యాడు, దేవగిరియమ్మల ప్రయాణం ముందుకు సాగుతూనే వుంది. ఎంత వైరాగ్య భావాలతో ముందుకు నడుస్తున్నా భార్య యొక్క బలహీనతను, నిస్సహాయ స్థితిని గమనించిన గంగా భవాజ్యానిలో మానవత పెల్లుబికి వచ్చింది. ఒక్కసారి ఈ బలహీనతకు లొంగిపోతే అది తన లక్ష్యాన్నుంచి మనసును మళ్ళిస్తుందనే భయంతో మనసులో వడే జాలిని, దయా గుణాన్ని గుండె లోతులలోనే అణచుకుంటూ మౌనంగా ముందుకు సాగుతున్నాడు. దేవగిరియమ్మకు మాత్రం అడుగులు ఎలా వేస్తున్నదో ఆమెకే తెలియదు. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. కాళ్ళు తడబడుతున్నాయి. దాహంతో నాలుక పిడచ కట్టుకుపోతున్నది. శరీరంలో ఏ మాత్రం శక్తిలేదు. తడబడే అడుగులు వేస్తూ పతిని అనుసరిస్తున్నది. అతి కష్టంమీద వారి ప్రయాణం సాయంత్రం వరకు ముందుకు సాగింది. ఒక చక్కని మంచి నీటి కొలను దగ్గర గంగా భవాజ్యాడు ఆగిపోయాడు. అలాంటి నిస్సహాయ స్థితిలో కూడ తననే అనుసరిస్తున్న తన భార్యను వదిలి ఒక్క అడుగు కూడ ముందుకు వేయలేక పోయాడు. మానవతా మమకారపు పొంగు ఎంత అణచుకున్నా గుండెలలో దాగలేదు. సర్వకాల సర్వావస్థలలోను తననే త్రికరణశుద్ధిగా నమ్మి చరిస్తున్న భార్యను వదలి పెటితే కైలాసవాసుడు తనకు దర్శనం కూడ యివ్వడని అయన మనసుకు అనిపించింది. వెంటనే భార్యను ప్రేమతో దగ్గరకు తీసుకుని ఆమెకు సపర్యలు చేస్తాడు. ఆమె సేదదీరి కొద్ది సేపట్లోనే గాఢనిద్రలోకి వెళ్ళి ఆదమరచి నిద్రపోతుంది. యింతలో ఒక బంజారి అటువైపుగా వెళుతూ వీరిని చూసి అది నిర్జన ప్రదేశమని చీకటి పడక ముందే అక్కడి నుంచి వెళ్ళక పోతే పులులు, తోడేళ్ళులాటి క్రూర జంతువుల బారిపడతారని హెచ్చరించి తన వెంట కొంతదూరం తీసుకువెళ్ళి ఆ నిర్జనారణ్యంలో వున్న ఒకే కుటీరం తనదేనని అందులో విశ్రమించమని చెప్పి లోపలికి పంపుతాడు. మరి కొంత సేపటిలో బంజారి భార్య బాలింతరాలికి కావలసిన భోజనాది తినుబండారాలతో లోపలికి వచ్చి దేవగిరియమ్మకు కొంతసేపు సపర్యలు చేసిన తరువాత బంజారి దంపతు లిద్దరూ ఈ దంపతుల కథను శ్రద్ధగా వింటారు. ఆ తరువాత బంజారి గంగా భవాజ్యాడికి, దేవగిరియమ్మకు ఈ విధంగా బోధిస్తాడు.

"సాధారణ మానవ జీవితానికి లక్ష్యాలను వేద ప్రయాణంగా నిర్ణయించారు. అవి ధర్మ, అర్ధ, కామ, మోక్షాలు. ఈ చతుర్విధ పురుషార్ధాలు ప్రతి మగవాడు తన జీవితంలో సాధించవలసినవి. స్త్రీ అలాంటి పురుషునికి సహ ధర్మచారిణిగా వుండి ఈ పురుషార్ధాలను సాధించేందుకు సహకరించాలి. యిది హైందవ సాంప్రదాయంలోని విసిష్టత. ముగ్గురు బిడ్డలను కన్న మీరు వారందరినీ నిర్దాక్షిణ్యంగా వదిలి వేసి యిట్లా అడవులపాలౌతున్నారు. మీరు చేస్తున్న ఈ పని మొదటి పురుషార్ధమైన ధర్మానికి వ్యతిరేకంగా వున్నది. పరమేశ్వర సాక్షాత్కారం కోరటం మంచిదే! అదే లక్ష్యమైనప్పుడు సంసారులుగా కాక సన్యాసిగా వుండాలి. సంసార జీవితంలోకి వచ్చిన తరువాత బాధ్యతలను వదిలి వేసి దైవంకోసం తపించటం సరైన పద్ధతి కాదు. చేయవలసిన బాధ్యతలను వదిలి వేసి దైవంకోసం తపించటం సరైన పద్ధతి కాదు. చేయవలసిన బాధ్యతలను పూర్తి చేసిన తరువాత వానప్రస్తం స్వీకరించి దైవాన్ని పొందవచ్చు. అదే ధర్మమార్గం. అయినా ఇప్పుడు మీరు విలక్షణమైన రీతిలో ముగ్గురు పిల్లలను వదిలి యిలా బయలుదేరారు కాబట్టి - సరే ముందుకు సాగండి. మీరు భార్య భర్తలే అయినా యిక ముందు శారీరక బంధంలేని విధంగా తపో దీక్షలో యిద్దరూ వుండి ఆత్మసాక్షాత్కారాన్ని పొంది, ఈస్వరదర్శనం చేసుకోండి, యిక్కడికి 150 మైళ్ళ దూరంలో "నివాస" అనే గ్రామం వుంది అక్కడ నుంచి 20 మైళ్ళ ముందుకు వెళ్ళి మీరు తపోదీక్ష సాగించండి".

బంజారా యొక్క మాటలు గంగా భవాజ్యానికి వేద ఘోషవలె వినిపించి ఈస్వర సాక్షాత్కారానికి చేసే తపోనిష్ట భార్యా సమేతంగా చేయాలని నిర్ణయించుకుంటాడు. యింతలో బంజారి రెండు విచిత్రమైన అడవిలో దొరికే పళ్ళను తెచ్చి యిద్దరి చేత తినిపిస్తాడు. ఆ పళ్ళు తినటంవలన శారీరిక బాధలన్నీ తొలగి దివ్యశక్తులు వస్తాయని. ఆత్మ దర్శనానికి వారు చేయబోయే తపస్సుకు అలాంటి దివ్యశక్తులు అవసరమని చెబుతాడు. రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత నలుగురు పడుకుని విశ్రమిస్తారు. గంగా భవాజ్యుడు ఉదయాన్నే లేచి చూసేసరికి ఆ రాత్రి వున్న కుటీరంగాని, బంజారి దంపతులుగాని కనిపించరు. రాత్రి యదార్ధంగా జరిగిన విషయాలన్నీ ఒక కలలాగ వారికి అనిపిస్తుంది.

దేవగిరియమ్మకు శారీరక అలసట పూర్తిగా పోయి నూతనోత్సాహం కలుగుతుంది. అనాటి వుదయాన్నుంచి సాగిన వారి ప్రయాణం అంచెలంచెలుగా

పదకొండు రోజులుగా సాగిన తరువాత తమ గమ్యాన్ని చేరుకుని గోదావరినది ఒడ్డున దంపతులిద్దరూ తపోదీక్షలో వుంటారు. అలా సంవత్సరాలపాటు సాగిన వారి తపోదీక్షా కాలంలో ఎందరెందరో వచ్చి వారినుండి అనేక ఆధ్యాత్మిక విషయాలు నేర్చుకుంటూ వుండేవారు. దేవగిరియమ్మకు ద్వారకామాయి అవే మారు పేరును అక్కడి భక్తులు పెట్టారు. దేవగిరి అంటే దేముడైన శ్రీకృష్ణుడు ఎత్తిన గోవర్ధనగిరి అని, ఆ పర్వతంవున్న ద్వారక ప్రాంతం పుణ్యస్థలం అని, ఆయి అంటే తల్లికాబట్టి ద్వారకలాంటి. చల్లని తల్లి అనే పేరుతో ఆమెను ద్వారకామాయి అని పిలిచేవారు. అదే విధంగా గంగా భవాజ్యుడు ఎంతోమందికి గురుబోధచేస్తూ జ్ఞానాన్ని కోరిన వారికి ప్రసాదిస్తూ వుండేవాడు కాబట్టి, ఒక గురువుకు వుండవలసిన జ్ఞానధనం ఆయనకు వున్నదనే భావనతో "గురుధన్" అనే మారు పేరుతో ఎక్కువగా పిలిచేవారు. అంటే బాబా యొక్క తల్లిదండ్రులకు జ్ఞాన మార్గంలో గల పేర్లు గురుధన్, ద్వారకామాయి. తరచు వీరి దగ్గరకు పరిసర ప్రాంతాలలో గల భక్తులు రావటం వారి ఏకాంత ధ్యానానికి చాలా యిబ్బందిగా వుండేది. అందువలన వారు తమ నివాసాన్ని సమీప అడివి ప్రాంతంలోని నిర్జన ప్రదేశానికి మారుస్తారు. ఆ ప్రశాంత, పవిత్ర నిర్జనారణ్యంలో వారి ధ్యానం బాగా సాగేది. యిద్దరూ ఒక్కొక్క సారి కొన్ని రోజులపాటు సమాధి స్థితిలోనే వుండేవారు. గురుధన్‌తో పాటుగా ద్వారకామాయి కూడ తపో దీక్షలో వున్నత స్థానాన్ని చేరుకోగలిగింది. అలా ఆ ప్రాంతంలో వారి తపోదీక్ష చక్కగా సాగుతున్నది.

షిరిడికి చేరుకున్న తరువాత కధానాయకుడైన మన యువకుడు కొన్నాళ్ళుపాటు వూరి వెలుపల గల వేపచెట్టు క్రింద వుండసాగాడు. వాచాలురైన కొందరు గ్రామస్తులు అనవసరమైన మాటలతో ధ్యానభంగం కలిగించేవారు. చాలా కాలంపాటు పగలంతా దగ్గరలో గల అడవి ప్రాంతంలోకి వెళ్ళి కందమూలాలు, చెట్ల కాయలు తింటూ వుండేవాడు. యిలా కొంతకాలం గడచిన తరువాత షిరిడి గ్రామంలోని కొందరు ఈ బాలుడు ఎవరు? ఎప్పుడూ యిక్కడే కూర్చుని తపోనిష్టలో వున్నట్లుగా కళ్ళు మూసుకునే వుంటాడు తీక్షణమైన ఎండ వేసినా, ఈదరుగాలులతో కూడిన భయంకరమైన వర్షం కురిసినా, ఎముకలను కొరికే చలి రాత్రులలోను, తానొక్కడే కూర్చుని వుంటాడే! ఎవరితను? అనే ఆలోచన చేయసాగారు. మరి కొందరు అవే విషయాలను స్వయంగా ప్రశ్నించేవారు. వాళ్ళు దగ్గరకు వచ్చి ప్రశ్నించటం వలన ఆ బాలుని ధ్యానానికి భంగ కలిగి తిరిగి చేతనా స్థితిలోకిరావలసి వస్తూ

వుండేది. ఈ విషయాలను జాగ్రత్తగ గమనిస్తున్న కొందరు దివ్యశక్తులు గల అద్వితీయ బాలునిగా గుర్తించగలిగారు. కాని చాలా మంది విమర్శనాత్మకంగాను, వింతగాను భావించి హేళనలతో విసిగిస్తూ వుండేవారు.

ఒక రోజున వేపచెట్టు దగ్గరగల నీడలోకి ఒక పుట్టు గుడ్డివాడు వచ్చి కూర్చుంటాడు. దారేపోయే పొగరుబోతు మనుషులు కొందరు అతనిని దారికి అడ్డంగా కూర్చున్నందుకు గాను దుర్భాషలాడి, కొట్టి ప్రక్కన పడవేసి వెళ్ళిపోతారు. ఈ గందరగోళంవలన బాలునికి ధ్యానభంగం కలుగుతుంది. జరిగిన విషయం చూచి జాలిపడి తన దివ్యహస్తంతో గుడ్డివాడి కళ్ళుతుడిచి రెండు కళ్ళ కనురెప్పలను తన రెండు చేతివేళ్ళతో గట్టిగా పట్టుకుని గుడ్డివాడి కంటి పాపలలోకి తన దివ్య దృష్టిని గాఢంగా ప్రసరింపచేస్తాడు. గుడ్డివాడి కళ్ళు మండిపోయి బాధ భరించలేక పెద్ద పెద్ద కేకలు వేసి మూర్ఛపోతాడు. అతనిని అంతకు ముందే కొట్టి వెళ్ళిన పోకిరీలతోపాటుగా యింకా చాలా మంది పోగవుతారు. కొంతసేపటికి గుడ్డివాడు తేరుకుని లేవగా అతనికి కంటి చూపువస్తుంది. ఈ విషయం తెలుసుకుని అందరూ ఆశ్చర్యపోతారు. అప్పటి నుంచి వూళ్ళో వాళ్ళేకాక చుట్టు ప్రక్కల వాళ్ళు కూడ అనారోగ్యాలను బాగు చేయించుకోవటం కోసం ఆ బాలుని దగ్గరకు వస్తూ వుండేవారు. ఈ విధంగా షుమారు ఒక సంవత్సర కాలం గడుస్తుంది.

ఒక్కొక్కసారి దగ్గరలో ఏ ఆకు కనిపిస్తే దానినే మందుగా యిచ్చే వాడు, పసరు తీసి యిచ్చేవాడు. ఏ గింజ కనిపిస్తే దానినే అరగదీసి మందుగా వాడమనే వాడు. రోగంగల శరీర భాగాన్ని చేతితో గాని తాకాడా యిక రోగం పోవలసినదే. క్రమ క్రమంలా గొప్ప వైద్యుడు అనే పేరు కొన్ని నెలలలోనే వచ్చింది. పగలంతా రోగులతో సమయం గడిచిపోయేది. రాత్రి పూట కూడ కొంత మంది వ్యక్తులు పని లేక పోయినా వచ్చి అనవసరమైన ప్రశ్నలతో విసిగిస్తూ వుండేవారు. మనస్సును, బుద్ధిని, ఏకంచేసి ఆలోచనలను అంతం చేసినప్పుడు మాత్రమే ఆత్మను దర్శించటం జరుగుతుంది. దీనికి ఏకాంతం అవసరం. అలాంటి ఆత్మావలోకనానికి అక్కడి వాతావరణం కుదరక పోవటంచేత ఒకనాటి అర్ధరాత్రి బయలు దేరి మళ్ళీ గోదావరి తీరంచేరి తూర్పుదిశగా ప్రయాణం చేసి త్రయంబకేశ్వరుని దర్శించి ఎత్తైన ఆ పర్వత ప్రాంతాలలోని నిర్జన ప్రదేశాలలో కఠోర దీక్షలతో తపస్సు చేస్తాడు ఆ బాలుడు.

గురువుగారిచ్చిన యిటుకరాయే తన సహచరుడు. గురువుగారి రక్తంతో తడిసి తన తలనున్న ఆగుడ్డ పీలికే తనకు శ్రీరామరక్షగా తపోదీక్ష ఒక సంవత్సరకాలం సాగుతుంది. అక్కడ నుంచి తిరిగి గోదావరి నది ఒడ్డుగానే వెనక్కు తిరిగి ప్రాయాణం చేసుకుంటూ కోపరగాం మీదుగా మళ్ళీ మార్గశిర దశమి నాటికి గురువు వెంకూసాను ఆఖరిసారిగా వదిలివచ్చిన చోటుకు చేరుకుంటాడు. రెండు సంవత్సరాలు గడచిపోవటం వలన ఆ ప్రాంతమంతా చెట్లు పెరిగి దట్టంగా వ్యాపించి వుంటాయి. సామాన్య దృష్టికి రెండు సంవత్సరాల క్రితం తాను తన గురువు కొంతకాలం నివసించిన ప్రదేశాన్ని గుర్తించటం కూడ కష్టమౌతుంది. జోలెలో నుంచి యిటుకరాయిని తీసి తలపై వున్న గుడ్డముక్కలో కట్టి మనస్ఫూర్తిగా గురువైన వెంకూసాను ప్రార్థిస్తాడు. ఒక్క క్షణంలో అక్కడి వాతావరణం అంతా రెండు సంవత్సరాల క్రితం వారున్నప్పటివలె మారిపోతుంది. వెంటనే తన కోసం గురువు రక్తాన్ని చిందించిన స్థలాన్ని గుర్తిస్తాడు. అక్కడికి చేరుకుని గురువును ప్రార్థిస్తాడు. నా ప్రాణాన్ని రక్షించటం కోసం నీ రక్తాన్ని చిందించిన గురుదేవా! నీ దర్శనం నాకు కావాలని మౌనంగా ప్రార్థిస్తాడు. "నేను సేలులో సమాధి అయిపోయాను. సమాధి నుంచి బయటకు వచ్చి నీకు దర్శనం యివ్వలేను! కాని నాశక్తి ఎప్పుడూ నీ వెంటనే వుండి నిన్ను రక్షిస్తూనే వుంటుంది." అనే వెంకూసా మాటలు వినపడతాయి.

తల్లిదండ్రులు, అన్నదమ్ములు, బంధు జనులెవ్వరూ లేని వాడిని. నాకున్నది మీరొక్కరే! నా ప్రాణాలను రక్షించిన ఈ రోజు మిమ్మల్ని నేను తప్పక దర్శించి తీరాలి. అలా మీ దర్శనం యివ్వనిచో నాకు ఈ జీవితమే అనవసరం. రెండు సంవత్సరాల క్రితం నాప్రాణాన్ని మీరు ఏ స్థలంలో ఏ యిటుక రాయి నుండి కాపాడారో అదే స్థలంలో అదే యిటుక రాయితో నా ప్రాణాలను మీకు అర్పిస్తానని యిటుక రాతిని ఎత్తి నుదుటిపై బలంగా కొట్టుకుంటాడు. యిటుక రాయికి నుదుటికి మధ్యగా వెంకూసా చెయ్యి వుంటుంది. ప్రక్కనే వెంకూసా నిలబడి దర్శనం యిచ్చి ఆశీర్వదిస్తాడు. యింకా ఇలా అంటాడు ఆ గురువుగారు. నా యందు నీకు గల శ్రద్ధ, విశ్వాసం, పట్టుదల వలన సమాధిలో నుంచి లేచి నీ వద్దకు రావలసివచ్చింది నాయనా! ఈనాటి నీ గురుభక్తికి నేను మెచ్చాను. నీవు జగద్గురువౌతావు. ప్రాణం వదిలిన తరువాత నీవు కూడ సమాధిలో నుంచి భక్తులను సమాధాన పరుస్తూ వుంటావు. యిదే నీకు నేనిస్తున్న వరం. నీవు శివాంశ సంభూతుడవు. యిప్పుడు

నేనిచ్చిన ఈ వరం నిమిత్త మాత్రం! సమాధి అనంతరం కూడ నీవు సచేతనుడవై కలి మాయ నుంచి భక్తులను రక్షిస్తూ వుండాలనే దేవతల ఆశయంతో ముడిపడినటు వంటిది నా ఈ వరం. కాలకూట విషాన్ని కంఠంలో వుంచుకున్న శివుడికి తప్ప ఈ కార్యం యితరులవలన సాధ్యంకాదు. సమాధి నుంచి ఎలాగూ లేచి వచ్చాను కాబట్టి యింకా రెండు సంవత్సరాలు అదృశ్య రూపంలో నీ వెంటవుంటాను. తపో నిష్ఠ సాగించు" అని మాయమౌతాడు వెంకూసా. అదే ప్రాంతంలో రెండు సంవత్సరాలు తపోనిష్ఠలో వుంటాడు. అవసరమైన సలహాలను అప్పుడప్పుడు అదృశ్య రూపంలో వుండి గురువు వెంకూసా యిస్తూనే వుంటాడు. 1858 వ సంవత్సరంలో మళ్ళీ మార్గశిర పౌర్ణమినాడు వెంకూసా దర్శనమిచ్చి యిక ఈ నీ దీక్షచాలు తిరిగి నీవు షిరిడీకి వెళ్ళు అక్కడ నీవు లోగడ వున్న వేపచెట్టు క్రింద నేను కూడ వచ్చి భూగృహంలో జ్యోతి స్వరూపంగా వుంటాను అని చెపుతాడు.

అక్కడ గురుధన్, ద్వారకామాయిల దపోదీక్ష పూర్ణ స్థితికి చేరుకుంది. వారి తపస్సుకు సంతసించిన పరమేశ్వరుడు పార్వతీదేవితో కలసి ప్రత్యక్షమౌతాడు పరమేశ్వర సాక్షాత్కారానికి సంతసించిన వారిద్దరు తమకు మోక్షన్ని ప్రసాదించమని అర్థిస్తారు. అందుకు పరమ శివుడు అనుగ్రహించి "మీ కోరిక ప్రకారమే మీకు మోక్షం వస్తుంది. కాని మీరిద్దరూ జ్యోతి స్వరూపంలో షిరిడి గ్రామంలో నా అవతారానికి నిలయమైన వేపచెట్టు క్రింద స్థిరనివాస మేర్పరచుకుని వుండండి. మీతోపాటుగా వెంకూసా అనే యింకో మహాత్ముడు కూడ అక్కడ జ్యోతిస్వరూపంగా నివాసముంటాడు. గురుధన్ మాత్రం అదే స్థానంలో శాశ్వతంగా వుంటాడు. ముందు రోజులలో ద్వారకామాయిని అ ప్రక్కనే ఒక అగ్నిహోత్రం రూపంలో వుంచుతాను. అలాగే మరి కొంతదూరంలో వెంకూసా అనే మహాత్మునికి కూడ ఒకస్థానం ఏర్పాటు చేస్తాను. ఈ నా అవతారంలోని నా లీలా శరీరం అంతమైన తరువాత మీ యిద్దరి మధ్యనే నా భౌతిక శరీరాన్ని స్థాపితం చేయిస్తాను. ఈ విధంగా ఈ నాలుగు విధాలైన దివ్య శక్తులకు నిలయమైన షిరిడి గ్రామం రాగల 500 సంవత్సరములపై వరకు దిన దిన ప్రవర్ధమాన మౌతూ ఆశ్రితులపాలిట కైలాసమై ప్రజలకు భక్తిజ్ఞాన వైరాగ్యాలను ప్రసాదిస్తూ ప్రసిద్ధి చెందుతుందని చెప్పి పరమ శివుడు తన అభయహస్తాన్ని వారి వైపు వుంచగా అందులో నుంచి దేదీప్యమానమైన కాంతి కిరణాలు రెండు వెలువడి గురుధన్, ద్వారకామాయిల శరీరాలలో ప్రవేశించి లోపల

గల ప్రాణశక్తిని జ్యోతి రూపంలో శిరస్సుపై గల సహస్రారం నుంచి బయటకు తీసుకువస్తాయి. ఆ జ్ఞాన జీవజ్యోతులు అదృశ్య రూపంలో షిరిడి గ్రామం చేరుకుని వేపచెట్టు క్రిందభాగంలో భూగృహం సృష్టించుకుని మరల తపోదీక్షలోనే వుంటాయి. అదే విధంగా సేలు సమాధి నుంచి లేచి వచ్చిన వెంకూసా కూడ దైవ నిర్ణయం ప్రకారం షిరిడి చేరుకుని అదే వేపచెట్టు క్రింద యింకొక జ్యోతి స్వరూపంగా అదే భూగృహంలో వుంటాడు.

అక్కడ కథా నాయకుడైన మన యువకుడు కాలినడకన తన ప్రయాణాన్ని ముందుకు సాగిస్తూ ఔరంగాబాదు సమీపంలో గల ధూప్ గ్రామ ప్రాంతంలో సాయం సంధ్యా సమయంలో ఒక పెద్ద కొండ రాతికి దగ్గరలో విశ్రమించి వుండగా ధూప్ గ్రామానికి మునసబు అయిన చాంద్‌భాయి తన గుర్రాన్ని పోగొట్టుకుని, దాని జాడ తెలియక విసిగి వేసారిపోయి ఆఖరికి తానే స్వయంగా దానిని వెతికి తీసుకురావాలనే ఉద్దేశంతో గుర్రపు జీనును భుజంపై వేసుకుని తిరిగి తిరిగి అలసి పోయి అదే ప్రాంతంలో చితికిలపడతాడు.

అతనిని గమనించిన మన యువకుడు "ఏం చాందుభాయి గుర్రం కోసం వెతికి అలసిపోయావా?" అని ప్రశ్నిస్తాడు. తనను పేరు పెట్టి పిలిచి, పోయిన తన గుర్రం విషయాన్ని అడిగిన ఈ అపరిచితుడు ఎవరా? అనే కుతూహలంతో అతను మరింత దగ్గర కొచ్చి నా పేరు, వివరాలు నీకెలా తెలుసు? అని ప్రశ్నిస్తాడు. నాకు అన్నీ తెలుసు, తెలియని విషయమంటూ ఏదీ వుండదు అని సమాధనమిస్తాడు. అయితే తప్పిపోయిన నా గుర్రం బిజిలీ ఎక్కడ వుంది. ఎప్పుడు దొరకుతుందో చెప్పమంటాడు. కుడి వైపుగా కొంతదూరం వెళితే ఒక చిన్న నీటి కయ్య వుంటుంది. అక్కడ నీ గుర్రం పచ్చిక మేస్తూ వున్నది. వెళ్ళితెచ్చుకో మంటాడు. యిప్పుడు నేను అటు నుంచే అంతా వెతుక్కుంటూ వచ్చాను. కనుచూపు మేరలో గుర్రం జాడ ఎక్కడా కనిపించలేదు. మళ్ళీ అటు వెళ్ళటం అనవసరం అంటాడు. నా మాటలు వృధాపోయే పొల్లు మాటలు కావు. విశ్వాసం వుంచితేనే ఫలితం లభిస్తుంది. సంశయాత్మకమైన మనస్సుతో ఫలితం సాధించలేరు. వెళ్ళి గుర్రాన్ని తెచ్చుకోమం టాడు. కాని చాంద్ భాయికి అది నమ్మలేని నిజంగానే అనిపిస్తుంది. యిలా మాటలు మాట్లాడుకునేటప్పుడు, ఆ యువకుడు తన జోలిలో నుంచి చిలుంగొట్టంను, పుగాకు పొడిని బయటకు తీస్తాడు. చిలుం గొట్టంలో పుగాకు పొడిని నింపటానికి గాను నీరు

కావాలి. ఆ తరువాత దానిని వెలిగించుకోటానికి నిప్పుకావాలి. తన చేతిలోని సటకాతో ఎదురుగుండా వున్న నేలమీద ఒక దెబ్బవేస్తాడు గంగా దేవి, నీటిధారగా బయటకు వస్తుంది, ఆ నీటితో పుగాకు పొడిన తడిచేసి చిలుంగొట్టంలో నింపుకున్న తరువాత మళ్ళీ సటకాతో అదే స్థలంలో కొడతాడు. ఈ సారి అగ్ని జ్వాల భూమి నుంచి పైకి లేస్తుంది. దానితో హుక్కాను వెలిగించి తాను పీల్చి చాందు పాటిల్ను కూడ పీల్చమంటాడు. మానవాతీతమైన ఈ రెండు విచిత్ర దృశ్యాలను చూసి యిది కలా లేక నిజమా అనే ఆశ్చర్యంలో మునిగిపోయిన చాందుభాయి మారు మాట్లాడకుండా చిలుం పొగను పీల్చి యిది నిజంగా కలకాదు నిజమేనని ధృవపరచుకుని వెంటనే కుడి వైపుగా పరుగుతీస్తాడు. అంత దూరంలో తప్పిపోయిన తన గుర్రం బిజిలీమేత మేస్తూ కనిపిస్తుంది. దానిని కౌగిలించుకుని తిరిగి ఆ యువకుని దగ్గరకు వచ్చి పాదాభివందనం చేస్తాడు. ఆ మానవాతీత శక్తుః గల మహనీయుని తనయింటికి రమ్మని ఆహ్వానిస్తాడు. భక్తి శ్రద్ధలతో తన గుర్రంపై అయనను కూర్చుండబెట్టి తాను నడచుకుంటూ తీసుకు వెళతాడు.

అలాంటి మహాశక్తివంతుడైన ఆ మహనీయుని పాదం తన యింటిలో పెడితే ఏడు ఏడు జన్మలనుంచి వస్తున్న జన్మ దోషాలు, కర్మ దోషాలు పోయి శాంతి సౌఖ్యాలు లభిస్తాయనే గట్టి నమ్మకం చాందుభాయికి ఆనాడే కలిగింది. ఆ విధంగా 35 రోజులు తన యింటిలోనే అతిధిగా వుంచుకుని సకల విధమర్యాదలతో సేవా భావంతో సేవించి ఆ గ్రామస్తులందరికీ దర్శనభాగ్యం కలిగిస్తాడు. ఆ తరువాత అతని బావమరదికి పెండ్లి నిశ్చయము కాగా ఆ పెళ్ళికి ఈ మహనీయుని తీసుకువెళితే ఏ విధమైన అడ్డంకులు లేకుండా జయప్రదంగా పెళ్ళి జరుగుతుందనే ఆశతో పెళ్ళి వారితోపాటుగా పెళ్లి కుమార్తె వూరైన షిరిడికి రమ్మని అర్ధిస్తాడు. అందుకు అంగీకరించగా గ్రామములోని మంచి ఎడ్ల బండ్లనన్నింటినీ పెళ్ళికి ముస్తాబు చేయించి మొట్ట మొదటిగా ఆ ఫకీరు మహనీయుడిని బండి ఎక్కించి ప్రయాణాన్ని సాగిస్తారు.

సాయం సంధ్యా సమయంలో చల్లని పైరు గాలులు వీస్తూ వుండగా ఎద్దుల మెడలలో కట్టబడిన చిరుగంటల చప్పళ్ళు లయిబద్ధంగా వినిపిస్తూ వుంటే పక్షుల కిలకిలా రావాలు సహజ స్రుతిలో సంగీతాలాపనగా అనిపిస్తున్నది. నీలి ఆకాశంలో తూర్పు వైపున గల తెల్లని మేఘాలపై పడమర వైపున అస్తమించే

సూర్యుని ఎర్రని కిరణాలు సోకి ఆకాశం సుందర రూపంలో కనువిందు చేస్తూ వుంది. మొదటి బండిలో ముందు భాగంలో కూర్చున్న ఆ మహాత్మునికి స్వాగతం పలుకుతున్నట్లుగా పశుపక్ష్యాదులు బండికి అడ్డంగా అటూ యిటూ కిలకిలా రావాలు చేస్తూ ఎగురుతున్నాయి. ఎక్కడో దూరం నుంచి వినిపించే కోకిల స్వరం భగవంతుడు స్వయంగా షిరిడిలో స్థిర నివాసమేర్పరచుకోటానికి వస్తున్నాడు. మానవులారా మీరంతా త్వరగా ఈ దైవాన్ని గుర్తించండి. మాయలోపడి సామాన్య మానవుడని మోసపోకండి అని హెచ్చరిక చేస్తున్నట్లుగా వుంది. తెల్లని చంద్ర బింబం తూర్పు దిక్కును చీల్చుకుని బండిలో ప్రయాణం చేస్తున్న ఈ దేవాధి దేవునికి వెలుగు నివ్వాలనే ఆదుర్దాతో సూర్యుడు పూర్తిగా నిష్క్రమించకుండానే వచ్చేశాడు. పెళ్ళి బృందం అందరిలోను ఏదో తెలియని ఆనందం నిండి పొంగి పొర్లుతున్నట్లుగా వుంది. మనస్సులలో శాంతి, శరీరంలో విశ్రాంతి అందరూ అనుభవిస్తున్నారు.

ప్రకృతి యావత్తూ పులకించి కైలాసాన్నుంచి దిగివచ్చిన ఈ ఆది దేవునికి స్వాగతం పలుకుతూ వున్న ఆ దృశ్యాన్ని స్వయంగా అనుభవించిన ఆనందించిన ఆనాటి ఆ పెళ్ళి బృందంలోని మనుషుల జీవితం ధన్యం. అదే విధంగా ఆయన తోపాటు సహ జీవనాన్ని కొద్ది క్షణాలైనా సరే ఈ జన్మలోనైనా లేక మరుజన్మలోనైనా మనకు కూడ కలిగించమని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని, ఈ మొదటి రోజు పారాయణను యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

నాలుగవ అధ్యాయం సంపూర్ణం.

మొదటి రోజు పారాయణ పూర్తి అయినది

రెండవరోజు పారాయణ - శుక్రవారం

అయిదవ అధ్యాయము

ఏ విధమైన యిబ్బందులు లేకుండా హాయిగా సుఖంగా పెళ్ళి బృందం షిరిడికి చేరుకున్నది. ఏ ఒక్కరిలోను ప్రయాణపు అలసటగాని మరే విధమైన కష్టంగాని లేదు. ఆ ఫకీరును ముందుగా కూర్చో పెట్టినందువల్లనే ఆ ప్రయాణం నిర్విఘ్నంగా, నిరాటకంగా, జయప్రదంగా జరిగిందని చాందుపాటీలు గట్టిగా నమ్మాడు. ఊరికి వెలుపలగా వున్న ఖండోబా (శివుడు) మందిరాన్ని ఆనుకుని వున్న పెద్ద మర్రిచెట్ల తోపులో బళ్ళను ఆపగానే ఆనందంతో అందరూ బళ్ళుదిగి చకా చకా వియ్యాలవారి విడిది యింటికి పరుగులు తీసారు. ఏదో లోకంలో విహరిస్తున్నట్లుగా వున్న ఆ బాల ఫకీరు మాత్రం ఆఖరికి అందరూ వెళ్ళిపోయిని తరువాత బండి నుంచి దిగి ధీర గంభీరంగా అడుగులు వేసుకుంటూ భూగోళపు అంచులను తాకుతున్నాయా అన్నట్లుగా చూపులను అనంత దూరాలకు కేంద్రీకరించి దివ్య తేజస్సుతో ముందుకు సాగుతున్నాడు. ఆ యువఫకీరును చూసిన మహల్సాపతికి ఆయన సాక్షాత్తు దైవస్వరూపుడనే భావన స్ఫురించింది. మహల్సాపతి ఎక్కువగా కబీరు (దోహా) పద్యాలను చదువుతూ వుండేవాడు. కబీరు భగవంతుడిని "సాయి" అని సంబోధించాడు తన సాహిత్యంలో. అందువలన మహల్సాపతి ఆ ఫకీరును చూడగానే తనకు తెలియకుండానే తాను పూజారిగా వుంటున్న ఖండోబా మందిరంలోనుంచి బయటకు వచ్చి అప్రయత్నంగానే రెండు చేతులను చాచి "దయచేయుము సాయి" అని సాదరంగా ఆహ్వానించాడు. ఈ విధంగా యువకుడైన ఆ ఫకీరునకు మహల్సాపతిచేత మొదటిసారిగా "సాయి" అనే పేరు పెట్టబడింది. ఆ తరువాత సాయిబాబాగా వారు ప్రసిద్ధి చెందారు. బాబా అంటే తండ్రి అని అర్థం.

లోగడ తాను కొన్ని రోజులు వున్న వూరి వెలుపలగల వేపచెట్టు దగ్గరకే మళ్ళీ వెళ్ళాడు. ఆ వేపచెట్టు క్రిందవున్న గురుధన్, ద్వారకామాయి, వెంకుసాల దివ్యశక్తులు సాయి దేవునితో ఒకసారి సంభాషించాయి. అవి భాషకందని మాటలు. ఆ స్థితిలోని వారికే అవి అర్థమౌతాయి. సామాన్యులకు కనిపించవు వినిపించవు. ఈ

విధంగా రెండవసారి షిరిడికి 1858లో సాయి చేరుకున్నాడు. అప్పటినుంచి షుమారు రెండు సంవత్సరములు సాయి ప్రతిరోజు 5 యిళ్ళవద్ద భిక్ష తీసుకొనుచూ ఆ వేపచెట్టు క్రిందే వున్నాడు. పగటి వేళలలో అప్పుడప్పుడు దగ్గరలోగల అడవి ప్రాంతానికివెళ్ళి ఏకాంతంగా వుంటూ వుండేవాడు. ఒకొక్కసారి నాలుగైదు రోజులకు పైగా అడవిలోనే వుండేవాడు. ఆహారంగాని, చివరకు నీళ్ళుకూడ దొరకని ప్రాంతంలో వుండేవాడు. దేవీదాస్ జానకీదాస్ అనే సాత్వికులైన భక్తులు సాయిబాబాను ఒక గొప్పశక్తిగల వానినిగా గుర్తించి తరచు ఆయనతో సంభాషిస్తూ వుండేవారు. మహల్సాపతి కూడ అప్పుడప్పుడు వచ్చి బాబా దగ్గర వేపచెట్టువద్ద కొంతసేపు కూర్చుని వెళ్ళేవాడు. గ్రామస్తులలో చాలామంది లోగడ కొన్నాళ్ళు ఆ షిరిడి గ్రామంలో వుండి అనేక మందికి వ్యాధులను నయంచేసిన యోగిగా ఆయనను గుర్తించటంవలన తిరిగి ఆయన నుంచి రోగాలకు మూలికలు, ఆకులు, పసరులను మందులుగా పొంది రోగ విముక్తి పొందుతూ వుండేవారు. ఈయనకు గొప్ప వైద్యుడనే పేరు వచ్చింది. అదేవిధంగా ఈయనను గొప్ప ఆధ్యాత్మిక శక్తులుగల మహాపురుషునిగా గుర్తించారు. అందువలన క్రమంగా ఈయన యందు కొందరు ఆకర్షితులైయ్యారు. అలా దగ్గర కాబడిన భక్తులలో కొందరు సాయి నివాసాన్ని వేపచెట్టు క్రింది నుంచి ప్రక్కనే గల పాడుపడి శిధిలావస్తలో వున్న మసీదులోనికి మార్చే ప్రయత్నం చేస్తారు. భక్తులకోరిక కాదనలేని సాయి వారి కోరిక ప్రకారం పాడుపడిన మసీదులోనికి తన నివాసం మారుస్తాడు. ఆ తరువాత భక్తులు క్రమక్రమంగా దానిని బాగుచేసి పైన కప్పు కూడ వేస్తారు. యిలా సుమారు 1860లో ఆ మసీదు సాధారణ నివాస యోగ్యంగా తయారవుతుంది. సాధారణంగా ప్రతిరోజు సాయిభిక్షకు వెళ్ళే అయిదు యిళ్ళు. 1. గణపతిరావు కుమారుడు తాత్యాపటేల్. 2. వామన్ సఖారామ్, 3. నందూ సవాయి రామవాణి. 4. మాధవరావు దేశ్‌పాండే (శ్యామా) 5. అప్పాజీపాటిల్.

మసీదు ముందు గోడను ఆనుకుని చిన్న ప్రాథమిక పాఠశాల వుండేది. అందులో మాష్టారుగా పనిచేశాడు శ్యామా. అందువలన అతను సాయికి దగ్గరౌతూ వచ్చాడు. మహల్సాపతి కూడ తరచుగా సాయి దగ్గరకు వచ్చి రాత్రి చాలా పొద్దుపోయే వరకు కూడ అప్పుడప్పుడూ ఏవో విషయాలు చర్చిస్తూ వుండేవాడు. అది చూసిన శ్యామా కూడ వారితో జతకలిసేవాడు. గణపతిరావు కోటే భార్య బయజాబాయికి, అతని కుమారుడు తాత్యాకు సాయి మీద ఎనలేని ప్రేమ, గౌరవాలు ఏర్పడ్డాయి.

ప్రతిరోజు సాయి తమ యింటికి వచ్చి భిక్ష తీసుకోనిదే వాళ్ళు భోజనం చేసే వాళ్ళు కాదు. గ్రామ మనసబు భాటేకు మాత్రం ఫకీరు బాలుడైన సాయి ఒక మోసగాడని. తాను కష్టపడి పని చేయకపోవటమే కాకుండా యితరుల కాలాన్ని కూడ దుర్వినియోగం చేస్తూ అనవసరపు ఉపన్యాసాలు యిస్తూ వుంటాడనే అపోహవుండేది. అదే విషయాన్ని బాహాటంగా అంటూ విమర్శిస్తూ వుండేవాడు. 1861వ సంవత్సరంలోని వర్షాకాలం. భయంకరమైన తుఫాను ప్రారంభమైనది. భాగోజీషిండే అనే కుష్టురోగి వంటరిగా నివసించే చిన్న పూరిగుడిసె తుఫాను గాలికి కొట్టుకొని పోతుంది. నిలువనీడ లేని అతను వర్షానికి తడిసిపోయి చలి గాలికి ఒణుకుతూ భరించలేని చలి బాధతో తెలిసిన వారి యిళ్ళ దగ్గరకు వెళతాడు. అతను యింటి లోపలికి వస్తే అతని కుష్టువ్యాధి తమకు అంటుకుంటుందన్న భయంతో ఎవరూ లోపలికి రానీయరు. ఏం చేయాలో దిక్కుతోచని భాగోజీ అతి కష్టంమీద దయాళుడైన సాయి అయినా ఆశ్రయమిస్తాడేమోనని మసీదు వైపుకు నడుస్తూ వుండగానే చలి బాధకు నరాలు కొంకరలు తిరిగి అడుగులు వేయలేక పడిపోయి "సాయీ" అని పెద్దగా కేకవేస్తాడు. అంతటి పెను తుఫానులోను సాయి పరుగు పరుగున వెళ్ళి భాగోజీని రెండు చేతులతో ఎత్తి భుజంపై వేసుకుని మసీదుకు వస్తాడు. పూర్తిగా తడిసి చలి బాధతో స్పృహకోల్పోయిన భాగోజీకి వేడిని ప్రసాదించాలంటే నిప్పు వెలిగే స్థితిలో వాతావరణం లేదు. వరుణ దేవుడు విజృంభించినప్పుడు అగ్నిదేవుడు పరాజితుడు కాక తప్పదు. అగ్నిని ఆజ్ఞాపించటంవలన ఆ పరిస్థితులలో ఉపయోగం పెద్దగా వుండదనే భావనతో, వేపచెట్టు కింద భూగృహంలో జ్ఞానజ్యోతి రూపంలో వున్న తల్లి ద్వారకామాయిని పిలుస్తాడు సాయి. దీనులను హీనులను రక్షించి, తగిన జ్ఞానాన్ని అందించటానికి ఏర్పడిన సాయి అవతారానికి సహకరించటం కోసం వెంటనే ద్వారకామాయి అదృశ్య జ్యోతిరూపంలో వచ్చి మసీదు లోపల వున్న కట్టెలపై జ్వలించి, ప్రజ్వలించి, వెచ్చని వేడిని అందించటంవలన వెంటనే భాగోజీ తెలివిని పొందుతాడు. పవిత్రురాలైన ఆ జ్యోతి వేడి తొలిసారిగా తాకటంవలన, దైవ స్వరూపుడైన సాయి స్పర్శవలన భాగోజీ కుష్టువ్యాధి వెంటనే నయమౌతుంది.

క్షణాలలో ఈ వార్త షిరిడి గ్రామమంతా పాకుతుంది. అంత వరకు సాయిని వైద్యుడు, జ్ఞాని అని మాత్రమే గ్రహించిన షిరిడి గ్రామ ప్రజలు ఆయనను సాక్షాత్తు భగవంతునిగా ప్రార్థించసాగారు. సాయి ఆనాటి నుంచి ఆ మసీదుకు

"ద్వారకామాయి" అని పేరు పెట్టాడు. మొట్ట మొదట తాను నివసించిన వేపచెట్టు క్రింద గురుధన్ మరియు తన గురువైన వెంకూసాలు జ్యోతిరూపంలో వున్నారు కాబట్టి "గురుస్థాన్" అని దానికి పేరు పెట్టాడు. ద్వారకామాయిలో ఆనాడు వెలిగిన అగ్నిని నిరంతరం అలా వెలిగిస్తూనే వున్నాడు సాయిబాబా. కాలక్రమేణా ఆ అగ్ని హోత్రంలో కాలిని విభూదినే మందులకు బదులుగా యిస్తూ వుండేవాడు. ఆనాటి నుంచి ఈనాటి వరకు నిర్విఘ్నంగా ద్వారకామాయిలో వెలుగుతున్న ఆ హోమగుండాన్నే నేడు మనం ధుని అనిపిలుస్తున్నాం. అందులో కాలిన భూడిదనే విభూదిగా వాడుతున్నాము.

ఒకనాడు నానావళి షిరిడికి చేరుకుని బాబా దగ్గరకు వస్తాడు. తన పాత పరిచయంతో "మామా" అని పిలవవబోతాడు. చుప్ (మాట్లాడవద్దు) అని సైగ చేస్తాడు సాయి. మన పాత పరిచయాలు బంధాలకు తావు లేదిక్కడ, కేవలం మనిద్దరి మధ్య ఆధ్యాత్మిక బంధం ఒక్కటే వుండాలి అనే సాయి భావనను చక్కగా అర్థం చేసుకున్న నానావళి ఆనాటి నుంచి బాబాతోపాటుగా షిరిడిలోనే వేరేచోట స్థిర నివాసమేర్పాటు చేసుకుని వుంటాడు. సాయికి బహిప్రాణంగా, మారు రూపమా అన్నట్లుగా వ్యవహరిస్తూ బాబాను ఎవరు ఏమన్నా సహించకుండా వెంటనే ఖండిస్తూ వుండేవాడు. యితను బాబా కన్నా వయసులో చిన్నవాడైనా ప్రాపంచిక అవధులు దాటిని అవధూత.

బాబాకు క్రమంగా గ్రామంలోని ప్రజలంతా దగ్గరకాజొచ్చారు. ఎవరు ఏ పని ప్రారంభించాలన్నా ముందు సాయి దగ్గరకు వచ్చి చెప్పనిదే మొదలు పెట్టే వారుకాదు. అంతటి స్థితిలో వున్నాకూడ బాబా అప్పుడప్పుడు చిన్న పిల్లలతో కలిసి వీధులలో గోలీలు ఆడుతూ పిల్లలలో పిల్లవాడుగా కేరింతలు కొతుడూ వుండేవాడు. కాని ఒక్కొక్కప్పుడు అడవిలోకి వెళ్ళి ఎక్కడెక్కడో తిరుగుతూ వుండేవాడు. ప్రతిరోజు బాబాకు భోజనం పెట్టకుండా తాను భుజించని బయజాబాయి, ఆయనను వెతుక్కుంటూ భోజనం బుట్టలో పెట్టుకుని, దానిని తలపై పెట్టుకుని ఎంతదూరమైనా నడుచుకుంటూ వెళ్ళి ఆయనకు భోజనం పెట్టిన తరువాత యింటికి వచ్చి మరీ తాను భుజించేది. ఆమె కుమారుడు తాత్యా కూడ ఆమె వెంట వచ్చేవాడు. అతను బాబా భుజాలపై ఎక్కి ఆడుకుంటూ మామా అని పిలుస్తూవుండేవాడు. ఆ బాలునిపై బాబా కూడ ఎంతో ప్రేమానురాగాలు కురిపించేవాడు.

సాయిబాబా వలన షిరిడి గ్రామం ప్రసిద్ధి చెందింది. వారు సంసార బంధాలను జయించారు. జ్ఞానమూర్తి, వుదార స్వభావంగల వారు. నశించే వస్తులపై ప్రేమలేని వారు. ఎప్పుడూ ఆత్మావలోకనంలో వుండేవారు. వారి మనసు అద్దము వలె స్వచ్ఛమైనది. ఆశ పాశాలకు, లొంగనివారు, మానావమానాలను లెక్కించని వారు గొప్ప, బీద అనే తేడాలు లేనివారు. ఒకేచోట నివసిస్తూ వున్నా దూర ప్రాంతాలలో ఎక్కడ ఏమి జరుగుతున్నదీ అన్నీ ఆయనకు తెలుసు. సమస్తసిద్ధులు ఆయన పాదాల చెంత వున్నా ఏనాడు ఆ శక్తులను ఉపయోగించనివారు.

యిలాంటి మహాశక్తివంతుడు, మహిమాన్వితుడైన సాయి స్పర్శ సంసార బంధముల నుంచి విముక్తిని కలిగించి ఆత్మ సాక్షాత్కారాన్ని కలిగించగలదు. వారి పాదోదకము పాపములను నశింపచేసి పవిత్ర పరచగల శక్తి కలది. వారి వూది (విభూది) సర్వరోగ నివారిణి, సర్వ శుభ ప్రదాయని. వారి ఆజ్ఞ వేదవాక్కు. వారు అలసటను గాని, నిరుత్సాహాన్ని గాని అమిత ఆనందాన్ని గాని ఎరుగని సచ్చిదానంద స్వరూపులు. సాయి యొక్క ఈ నిజ స్థితిని త్వరలోనే అందరూ గ్రహించారు.

ఆ తొలి రోజులలోనే "వీరు అనాథుల కొరకు దీనులకొరకు వెలసిన కారుణ్యమూర్తి" అని విఠలుని వృద్ధ భక్తుడైన గౌలిబువా తన అభిప్రాయాన్ని చెబుతాడు. ఒకసారి మొహియుద్దీన్ తంబోలీ అనే వానితో కుస్తీ పట్టి సాయి ఓడిపోయినట్లు నటిస్తాడు. కాని ఆనాటి నుంచి మొహీయుద్దీన్‌లోని అహంకారం తొలగిపోయి కుస్తీలు పట్టటంమానేసి క్రమంగా ఆత్మ సాక్షాత్కారం కోసం పాటుపడతాడు. జౌహర్ అలి అనే ఒక కపట గురువు అహమ్మదునగర్ నుంచి వచ్చి సాయిబాబా తనకు శిష్యుడని చెప్పుకుని ఆయనను వెంట తీసుకొని రహాటా అనే గ్రామానికి వెళతాడు. బాబా ఏ విధమైన అడ్డంకు చెప్పకుండా ఆయన వెంట శిష్యుడుగానే వెళ్ళి సుమారు ఆరు నెలల కాలం శిష్యునివలె సేవ చేస్తాడు. అతనిలో ఎన్ని లోపాలున్నా వాటిని ఎత్తి చూపకుండా ఆదర్శ శిష్యునిగా ఎలా ప్రవర్తించాలో అక్కడి వారందరికీ ఆచరించి చూపించాడు బాబా. ఆ తరువాత షిరిడి గ్రామస్తులు ఆ కపట గురువు గుట్టురట్టు చేసి సాయిని తిరిగి షిరిడికి తీసుకువస్తారు.

బాబా ప్రేమను కొంతకాలం అనుభవించి, ఆ తరువాత కొంతకాలం వారు దూరంగా రహాటాలో వున్నప్పుడు ఆ ప్రేమ అందనిలోటును షిరిడి ప్రజలు తెలుసుకున్నారు. సాయి మాతృ స్వరూపుడని ప్రేమ పూరితమైన వారి మాటలే తమకు అమృతతుల్యములని ఆ గ్రామ ప్రజలు గ్రహించగలిగారు. సాయిని తిరిగి

షిరిడికి తీసుకువచ్చిన ఆనందం కొందరిలో ఆనంద భాష్పాల రూపంలో జల జలాకన్నీరుగా కారుతుంది. అప్పుడు వారికి సాయి ఈ విధంగా తన సందేశాన్ని అందిస్తాడు.

నేను మీకు దూరంగా వున్నానా దగ్గరగా వున్నానా అని మీరు ఆలోచించవలసిన పనిలేదు. మీరు ఎంత దూరంలో వుండి ఏమి చేస్తున్నా అన్నీ నాకు తెలుస్తూనే వుంటాయి. మీ అందరి హృదయములను పాలించే వాడనునేనే. ప్రపంచ మందు గల చరా చర జీవికోటినంతటిని ఆవరించియున్నాను. ఈ జగత్తును నడిపించు సూత్రధారి అయిన జగన్నాతనునేనే. యింద్రియ చాలకుడను,. సృష్టి స్థితిలయ కారకుడనూనేనే. ఎవరు తమ దృష్టిని నాపై కేంద్రీకరించెదరో వారికి ఏ హాని బాధ వుండవు. నన్ను మరచు వారిని మాయ శిక్షించును.

తొలిసారిగా బాబా నుంచి అధికారయుతమైన తన నిజ స్థితిని గురించిన అమృత సమానమైన ఈ మాటలను విన్న భక్తులు సాయికి పాదాభివందనం చేసి తరించి ఆనందించారు. ఈ విధంగా క్రమ క్రమంగా గ్రామంలోని చాలా మంది పెద్దలు, పిన్నలు స్త్రీలు, పురుషులు, ఆడ మగ అనే భేదం లేకుండా ప్రతిరోజు బాబా దగ్గరకు వచ్చి దర్శనం చేసుకుని, నమస్కరించిన తరువాత తమ నిత్యకృత్యాలలోకి ప్రవేశించే వారు. అలా వచ్చే భక్తులందరికీ బాబా తన చేతితో స్వయంగా వూదీ ప్రసాదం యిస్తూ వుండేవారు. అజానుబాహుడైన బాబా పైనుంచి క్రింది వరకు ఒకే బారులాల్చీని తొడుక్కుని తలపై గురువు వెంకుసా యిచ్చిన తల గుడ్డను ఎప్పుడూ కట్టుకుని వుండేవారు. ఎడమవైపు భుజానికి జోలె తగిలించుకుని తిరిగేవారు. బట్టలు కఫ్నీ బాగా మాసిపోయి చిరిగిపోయినా పట్టించుకునే వారు కాదు. భక్తులు ఎవరైనా పట్టుబడితే వాటిని వుతకటానికి యిచ్చేవారు. భిక్ష చేసుకొచ్చిన ఆహారంలో కొంతభాగం తనకు దగ్గరగా వచ్చిన పశు పక్ష్యాదులకు పెట్టి మరికొంత తల్లికి ధునిలో సమర్పించి ఆ తరువాత మిగిలినది తాను భుజించే వారు. ఒక్కొక్కసారి పశువులు పక్షులు ముక్కులతో ముట్టెలతో ఆహారాన్ని కెలికేవి. బాబా వాటిని తరిమి వేయుటగాని అసహ్యాపడటం గాని చేసేవాడు కాదు.

అప్పుడప్పుడు కాళ్ళకు గజ్జెలు కట్టుకుని తకియా అనుచోట తరుచుగా నృత్యం చేస్తూ భక్తి గీతాలాపనలు చేసేవాడు సాయి. ఆయన కంఠం ఎంతో

మధురంగా వుండేది. ఒక్కొక్కప్పుడు పారవశ్యంలో ఆయన పాటలు పాడుతున్నప్పుడు చుట్టు ప్రక్కల గల జనులతోపాటు జంతుజాలం కూడ పొగై ఆ వైభవాన్ని తనివితీరా చూసి, విని ఆనందించేవి.

అప్పట్లో దేశం నలుమూలలా హిందూ ముస్లిం మత విభేదాలు బాగా వుండేవి. ఆంగ్లేయులు కావాలని ఈ అశాంతిని సృష్టించేవారు. షిరిడి గ్రామంలో కూడ ఈ భేదం కొట్టొచ్చినట్లుగా కనపడుతూ వుండేది. ఆనాటి దేశకాల పరిస్థితులను బట్టి తన జన్మవృత్తాంతంగాని, తల్లిదండ్రుల వివరాలు గాని ఎవరికీ తెలియ చేయలేదు. ముస్లిం మసీదుకు ద్వారకామాయి అని పేరు పెట్టారు. స్వయంగా వారి వేషం ముస్లిం ఫకీరులను పోలివుండేది. మసీదులో హిందువులకు పవిత్రమైన అగ్నిహోత్రాన్ని నిరంతరం వెలిగిస్తూ వుండేవారు. మసీదు ముందు భాగంలో ఎడమ వైపుగా తులసి కోటను పెట్టించారు. ఈ విధంగా హిందూ ముస్లిం ఆచారాలు రెండింటిని కలగాపులగంగా ఏర్పాటుచేసి రెండు మతస్థుల వారిని తన వైపు లాక్కుని యదార్ధ జ్ఞానాన్ని యిరు మతాల వారికి బోధిస్తూ మతసామరస్యాన్ని, సహజీవనానికి కృషిచేస్తూ వుండేవారు.

క్రమంగా సాయిబాబా పేరు షిరిడి పరిసరాలను దాటి బొంబాయి లాంటి దూరప్రాంతాల వరకు వ్యాపించటం ప్రారంభమైనది. డాక్టర్లకు అసాధ్యమైన జబ్బులు సాయి విభూదితో నయమౌతూవుండేవి. వారి పాదతీర్థం అమృతతుల్యమై సంజీవినిలా పని చేసేది. అసాధ్యమైన పనులు కూడ సాయిబాబాకు మొక్కి తిరిగి యింటికి వెళ్ళేలోపుగానే పూర్తి అవుతూ వుండేవి. వారి వద్దకు వచ్చే భక్తులలో అప్పట్లో ఎక్కువగా ఆర్తులు, అర్ధార్తులే వుండేవారు. హిందూ ముస్లింలే కాకుండా, సిక్కులు పారశీకులు, క్రైస్తవులు కూడ వారి వద్దకు వస్తూ వుండేవారు.

మహల్సాపతి ప్రతిరోజు బాబాకు నిత్యపూజ స్వయంగా చేసేవాడు. శ్యామా వచ్చే భక్తుల అవసరాలను చూస్తూ వుండేవాడు. వచ్చిన భక్తులలో కొందిరని బాబా దక్షణ అడిగేవారు. కొందరు వారంతట వారుగా యిస్తామన్నా తీసుకునే వారు కాదు. అలా తీసుకున్న ధనాన్ని తనను ఆశ్రయించి బ్రతికే పేదలకు యిస్తూ వుండేవాడు సాయి.

గ్రామ మునసబు భాటేకు బాబా చేసే ఈ అనవసరపు అట్టహాసాలు వ్యర్ధమైనవని, ఏవో కనుకట్టు లాంటి క్షుద్ర విద్యలతో ఈ పనులు చేస్తున్నాడనే

భావన మనసులో బాగా పాతుకుపోతుంది. బాబా చేసే పనులలో ఏదో లోపం చూపించి అసమర్ధుడని భక్తులందరికీ నిరూపించాలనే ప్రయత్నంలో వుంటాడు.

సాయికి దీపాలు వెలిగించటమంటే చాలా యిష్టం. గ్రామంలో గల దుకాణదారుల నుంచి నూనెను యాచించి దానితో ప్రతిరోజు మసీదులో రాత్రిపూట దీపాలను వెలిగిస్తూ వుంటాడు కాబట్టి దుకాణదారులను కట్టడిచేసి నూనెను యివ్వకుండా చేయించి మసీదులో దీపాలు వెలగకుండా చేయిస్తే బాబా యొక్క అసమర్ధత అందరికీ తెలిసిపోతుందనే ఆలోచన చేసి తన శక్తి యుక్తులను ఉపయోగించి ఒక రోజున ఎవరూ ఆయనకు నూనెను యివ్వకుండా చేస్తాడు.

సాయి కలత చెందకుండా తిరిగి మసీదుకు వచ్చి భాగోజీతో మంచి నీటిని తెప్పించి దానిని త్రాగుతాడు. అలా త్రాగిన నీటిని తిరిగి లోటాలోకి వాంతి చేసుకుని కక్కుతాడు. కడుపులో నుంచి తిరిగి వచ్చేటప్పుడు నీరు నూనెగా మారిపోతుంది. ఆ నీటితో భాగోజీ దీపాలు వెలిగించగా తెల్లవార్లు మసీదులో దీపాలు వెలగటం చూసి నూనెను యివ్వటం నిరాకరించిన వారంతా పరుగెత్తుకొని వచ్చి బాబా పాదాలపైబడి క్షమాపణ కోరతారు.

భక్తులు తమ ప్రేమ కొద్దీ బాబాకు ప్రతిరోజు పాదపూజ చేస్తూ కుంకుమ పెట్టి చందనం పూస్తూ, మంగళ ఆరతులు యిస్తూ వుండేవారు. బాబాకు వీటి యందు ఆ శక్తి లేకపోయినా భక్తుల ప్రేమను కాదనలేక వూరుకునే వారు. రోహిల్లా అనే ఒక ముస్లిం భక్తుడు మత-ఛాందసంతో మహమ్మదీయ ఆచారాలకు విరుద్ధంగా గంట కొట్టటం ఆరతి యివ్వటం చేస్తున్నారు, చేసేది భక్తులైనా దీనికి మూలకారకుడు సాయి బాబాయే కాబట్టి అతనిని అంతం చేయాలనే ఆలోచనతో ఒకనాడు రాత్రి పూట బాబా మసీదు బయట తిరిగే సమయం చూసి కర్రతో తలపై కొట్టి చంపాలనే ఉద్దేశంతో పొంచి వుంటాడు. సాయి బయటకు వచ్చినప్పుడు వెనుక నుంచి తలపై కొట్టబోయే సమయంలో బాబా వెనక్కు తిరిగి తన కళ్ళను పెద్దవి చేసి దృష్టిని అతనిపై కేంద్రీకరిస్తాడు. రెండు కళ్ళలో నుంచి బలమైన రెండు వెలుగు కిరణాలు వెలువడి రోహిల్లా రెండు చేతులను తాకుతాయి అతనిలోని జీవసత్వాలు క్రుంగిపోతాయి. చేతులలో నుంచి కర్ర క్రింద పడిపోతుంది. వెంటనే సాయి ప్రసన్నుడై తన చేతిని ఎత్తి అభయహస్తం చూపగా అందులో మక్కా, మదీనాలు, పవిత్ర ఖురాను గ్రంధాలు కనిపిస్తాయి. అప్పుడు రోహిల్లా యాఅల్లా అంటూ బాబా పాదాలపై పడుతాడు.

హిందూ మహమ్మదీయ మతముల మధ్య స్నేహభావన పెంచటానికి బాబా చాలా ప్రయత్నించారు. బాబా బోధనల సారాంశం - "హిందూవుల దేముడైన రాముడు, మహమ్మదీయుల దేముడైన రహీమ్ యిద్దరూ ఒక్కరే. వారిద్దరికీ భేదం లేదు. అలాంటప్పుడు వారి భక్తులు అజ్ఞానంతో పోట్లాడుకుంటారెందుకు. అన్ని మతాలు, జాతులు సోదరభావంతో కలిసిమెలసి వుండి జాతీయ సమైక్యత సాధించాలి. వివాదములు, ఘర్షణలు, అల్లర్ల వల్ల ప్రయోజనం వుండదు. ఎవరితోను పోటీ పడవద్దు. మీ అభివృద్ధిని మీరు చూసుకోండి. యోగము, త్యాగము, తపస్సు, జ్ఞానము మోక్షానికి దారులు. వీటిలో ఎవరికి వీలైన వాటిని వారు పాటించి మోక్షం పొందవచ్చును. ఎవరైనా నీకు అపకారం చేసిన తిరిగి వారికి నీవు అపకారం చేయవద్దు. వీలైనంత మంచిని యితరులకు చేస్తూనే వుండాలి."

సాయి తన గొప్పతాన్ని బాహాటంగా ఎప్పూడూ ప్రదర్శించే వారు కాదు. వారికి శరీర అభిమానం లేదు. తన భక్తుల యందు వారికి అంతులేని ప్రేమ. వారి దర్శనానికి వచ్చే భక్తుల యొక్క భూత, భవిష్యత్,వర్తమానములు చెబుతూ వుండేవారు, స్నేహితులు, విరోధులు కూడ వారికి సమానులే. షిరిడి ప్రజలు అజ్ఞానులైనప్పటికి బాబాయందు అంతులేని ప్రేమను, భక్తిని కలిగియుండేవారు. భగవంతునికి గల ఆరు సహజ లక్షణములు బాబాలో వుండేవి. 1. కీర్తి 2. ధనము 3. అభిమానము లేకుండుట 4. జ్ఞానము 5. మహిమ 6. ఔదార్యము

భక్తులకు బాబా యిచ్చు అభయ వాక్యములు వర్ణనాతీతములు. "భానిసలలో బానిసనగు నేను మీకు ఋణస్థుడను. మీ దర్శనముచే నేను తృప్తుడనైతిని. నీ పాద దర్శనము నాకు భాగ్యము. మీ అశుద్ధములో నేను ఒక పురుగు వంటివాడను." బాబా యొక్క ఈ వాక్కులను బట్టి భక్తుల యందు ఆయనకు ఎంతటి ప్రేమాభిమానాలో ఎవరికి వారు నిర్ణయించుకోవచ్చును.

మనవలె సాధారణ మానవాకారంలో బాబా కనిపిస్తూ వున్నా ఆయన పరబ్రహ్మ రూపులు. అందరి మనస్సులలో వుండెడివాడు. వారి మనసులో ఎవరి యందును, దేని యందును అభిమానము వుండేది కాదు. కాని బయటకు కోరికల పుట్టవలె కన్పించే వాడు, వారి మనస్సు ఎప్పుడు ప్రశాంతంగా వుండేది. కాని తరచుగా తిడుతూ, కేకలేస్తూ పిచ్చివానివలె అరుస్తూ వుండేవాడు. ఎప్పుడూ

ఆత్మావలోకనం చేస్తూ వుండేవాడు. అల్లామాలిక్ అంటూ వుండేవారు. మసీదు గోడకు ఆనుకుని ఊదీ ప్రసాదం భక్తుల క్షేమముల కొరకు పంచిపెడుతూ వుండేవాడు.

మొట్ట మొదట మహల్సాపతి కూడ బాబా ఒక మహమ్మదీయ ఫకీరని భావించాడు. కాని క్రమ క్రమంగా బాబాతో పరిచయం పెరగటంవలన,, నీళ్ళను నూనెగా మార్చి మసీదులో దీపములు వెలిగించిన నాటినుంచి బాబాసాక్షాత్తు భగవత్ స్వరూపుడేనని నమ్మి ప్రతిరోజు గంధాక్షతలతో బాబాను దైవంవలె పూజ చేసెడివాడు, ఆరతి యిచ్చేవాడు. భక్తి పారవశ్యంలో అప్పుడప్పుడు పాటలు కూడ పాడేవాడు. యిది మహల్సాపతికి ప్రతిరోజు ప్రారంభంలోని దినచర్య. రోహిల్లా, 'రంగారి' మొదలైన మహమ్మదీయ భక్తులు బాబా పూజా విధానాలను చూసి సరిపెట్టుకున్నా కొందరు మహమ్మదీయ మత ఛాందసులు సంగమనేరులోని తమ మతగురువు సలహాపై బలిష్టులైన పది మంది మహమ్మదీయులను తీసుకొని ఒకనాడు ఉదయం మసీదు చుట్టూ పెద్ద పెద్ద కర్రలతో కాపు కాచి వుంటారు. బాబాను పూజించే వారిలో ప్రధానుడైన మహల్సాపతి పిరికివాడు. మామూలుగానే పూజా ద్రవ్యాల పళ్ళెం తీసుకుని మసీదుకు వస్తాడు. అప్పుడు వారిలోని ప్రముఖుడైన తంబులి మహల్సాపతిని పిలిచి ఎవరైనా సరే బాబాను గంధాక్షతలతో పూజ చేస్తే వాళ్ళను చావకొడతామని హెచ్చరిస్తాడు. భయపడిపోయిన మహల్సాపతి మసీదుకు బయట నుంచే చాలా దూరంనుంచి, బాబాకు రోజూ తాను పూజచేసే విధంగా షోడశోపచార, ధ్యాన, ఆవాహనాది పూజలు చేస్తూ వుంటాడు.

పరిస్థితి గమనించిన బాబా 'రమ్ము, లోనికి రమ్ము, ఎప్పటివలె గంధ పుష్పాలతో నీ పూజ చేసుకొనుము. నిన్ను ఎవరు కొట్టెదరో నేను చూసెదను' అంటూ సటకాతో నేలపై కొడతాడు. మేఘ గర్జనలాంటి బాబా యొక్క ఆ కంఠ ధ్వనికే మహమ్మదీయులంతా భయపడిపోయి వెళ్ళిపోతారు. కాని మహల్సాపతికి భయం పూర్తిగాపోదు. యింటికి వెళ్ళేటప్పుడు వాళ్ళు తనను చావకొట్టెదరేమోనని భయపడి ఆ విషయం బాబాతో అంటాడు. అప్పుడు బాబా కరుణాసముద్రుడై మహల్సాపతికి యిచ్చిన అభయం. 'వీరు కాని, యింకెవ్వరైనా కాని, యిక్కడ గాని యింకెక్కడైనా గాని, ఈ జన్మలో కాని యింకే జన్మలో గాని నీకు అపాయము కలిగించువారు ఎవ్వరూ వుండరు. నిన్ను వేయికళ్ళతో నేను రక్షిస్తూ వుంటాను. నిర్భయంగా యింటికి తిరిగి వెళ్ళు". బాబా పలికే ఈ అభయం ఏ దేముడు, తన భక్తులకు యింతవరకు ప్రసాదించి యుండలేదు.

దయామయుడైన సాయి ఆనాడు మహల్సాపతికి యిచ్చిన అభయం ఈనాడు భక్తి శ్రద్ధలతో దీనిని పారాయణ చేయు భక్తులందిరకీ లభించుగాక! భక్తి శ్రద్ధలతో ఈ అధ్యాయాన్ని పారాయణ చేసిన వారికి విరోధులు కూడ ఆప్తమిత్రులుగా మారుగాక! వారికి గల ఈతిబాధలు తొలగి శాంతి, సౌఖ్యములు సాయిపేరున లభించుగాక.

ఓం శాంతి శాంతి శాంతిః

అయిదవ అధ్యాయం సంపూర్ణం.

ఆరవ అధ్యాయము

ద్వారకామాయిలో ధునిని ప్రారంభించిన తరువాత బాబా ఎక్కువగా పగలంతా ధునికెదురుగా మసీదు గోడకు అనుకుని కూర్చుని వుండేవారు.భౌతికమైన తన శరీరానికి జన్మనిచ్చిన తల్లి ఎదురుగుండా అలా కూర్చుని మనోభవాలను ఆమెతో లయం చేస్తూ వుండేవాడు. బాబా తరచుగా 'మసీదుమాయి' అని సంబోధిస్తూ వుండేవాడు. మసీదు తల్లి అని అర్థం. అప్పుడప్పుడు భాషకందిన భావాలను ఆ తల్లికి తెలియపరుస్తూ వుండేవాడు.

ఈ శరీరం వున్నప్పుడే నాది నావారు అనే బంధాలు, శరీరం నుంచి ప్రాణం బయటపడితే, దానికి ఏ విధమైన బంధాలతోను సంబంధంలేదు. యోగులకు త్యాగులకు, ముముక్షువులకు అలాంటి స్థితిలో దేనిమీద ఆశలేక, కోరిక లేక నిశ్చలమైన ఆత్మానంద స్థితి కలుగుతుందట. సాధారణ మానవులు మరణించగానే ప్రాపంచిక వ్యవహారాలు ఆశ, పాశాలనుంచి బయటపడలేక పునర్జన్మను ఆశిస్తారట. అలా జన్మించటం పునర్జన్మ. ప్రపంచం, శరీరం మీద కోరికలు ఆశలు నశిస్తే ఆ ప్రాణం మళ్ళీ భూమిమీదకు రావాలని అనుకోదు. అదే మోక్షం, ముక్తి.

అత్యంత వైరాగ్య భావాలతో ముముక్షువులైన, గురుధన్, ద్వారకామాయి, వెంకూసాలు జ్యోతి రూపాలలో షిరిడిలో వున్నది కేవలం లోక కళ్యాణానికిగాని వారి కోసం కాదు. అలాంటి స్థితిలో తల్లి కొడుకు అనే భావన వుండదు. అందరూ సమానులే. అలాంటి సమాన స్థితిలోనే యిప్పుడు వారు అందరూ షిరిడిలో వున్నారు సాయి శరీరంతో, కనిపిస్తున్నాడు. వారు కనిపించటంలేదు. అంతే తేడా.

ఉదయం మహల్సాపతి మొదలైన భక్తులు పూజాది కార్యక్రమాలను ముగించుకోగానే ద్వారకామాయిలో ధుని ఎదురుగా కూర్చుని ఆత్మావలోకనం చేస్తున్నట్లుగా వుండేవారు సాయి. అలా చాలాసేపు నిశ్చలంగా కూర్చున్న తరువాత మధ్యాన్నం పన్నెండు గంటలకు భిక్ష కోసం వూరిలోనికి వెళ్ళేవారు. రొట్టెలాంటి ఘన పదార్థాలను జోలెలోని ఆకులలో వేసుకునే వారు. పులుసు లాంటి ద్రవ పదార్థాలను ఫకీరులు వాడే లోటాలాంటి పాత్రలో వేసుకునే వారు. ఎవరైనా వారిని గమనించకపోతే "ఫకీరొచ్చాడమ్మా" అంటూ ఒక్కసారి మృధు మధురంగా పలికేవాడు. వారి కళ్ళలోకి కళ్ళు కలిపి భిక్ష వేస్తున్నప్పుడు ఎవరైనా చూస్తే ఆ చూపులలోని ప్రేమ కోసం, అప్పుడు కలిగే ఆనందం కోసం ఎన్ని జన్మలైనా ఎదురు చూడాలనిపించేదట. యిలాంటి అనుభూతులు సాయి శక్తిని గ్రహించిన వారికి మాత్రమే కలుగుతూ వుండేవి. సాయితో దర్శన, స్పర్శన, సంభాషణలు చేయకుండా దూరాన్నుంచే విమర్శిస్తూ వుండే భాటేలాంటి వారు చాలా కొద్దిమంది సాయిని ఆనాడు కూడ పరోక్షంగా విమర్శిస్తూ, దూషిస్తూ వుండేవారు. మానావమానాలను సమంగా భావించే బాబా ఆ విషయాలను పట్టించుకునే వాడు కాదు.

మధ్యాన్న సమయంలో కొంచెం సేపు విశ్రాంతి తీసుకునే వారు. సాయంత్రం పూట మసీదుకు వెనుకభాగంలో గల ఖాళీస్థలంలోను, గురుస్థాన్‌కు పడమర వైపున గల ఖాళీప్రదేశం "లెండీబాగ్"లోను పూల మొక్కలను పెంచుతూ వుండేవారు. బాబా వడిలో కూర్చుని భుజాలపై ఆడుకుని, పంతంపట్టి, మారాంచేసి మరీ బాబాకు రొట్టె ముక్కలు తినిపించిన తాత్యా పెరిగి పెద్దవాడై బాబా దగ్గరే ఎక్కువగా వుంటూ వుండేవాడు. ఏ జన్మ బంధమో మనకు తెలియదు, బాబా అంటే తాత్యాకు ప్రాణం. ఆయనకు కావలసిన పనులన్నీ తానే చూస్తూ వుండేవాడు. మసీదు బాగుచేయటం, ధునిలోకి కట్టెలు తేవటం. బాబాకు బట్టలు మార్పించటం, లెండీబాగ్‌లో బాబాతోపాటుగా పూల మొక్కలకు నీళ్ళు పోయటం లాంటివి స్వయంగా చేసేవాడు. మహల్సాపతి కూడ అదేవిధంగా బాబాకు అత్యంత సన్నిహితుడయ్యాడు.

అప్పుడప్పుడు దక్షణ ద్వారా వచ్చిన డబ్బుతో బాబా పేదలకు అన్నదానం చేసేవాడు. అలా అన్నదానం చేయాలనుకున్నప్పుడు తానే స్వయంగా దుకాణమునకు వెళ్ళి కావలసిన వస్తువులను ఖరీదు చేసేవాడు బాబా. సాధారణంగా తాత్యా ఆ వస్తువులను మసీదుకు తేవటంలోను, వంటలోను, పేదలకు వడ్డించటంలోను కూడ

సహాయపడే వాడు. వండుతున్నప్పుడు వుప్పు, కారం సరిగా పడినది లేనిది, పదార్థాలు వుడికినది లేనిది స్వయంగా చూసేవాడు సాయి. ఒక్కొక్కప్పుడు మాంసాహారాన్ని కూడ వండి పెట్టేవాడు. పొగలు కక్కుతూ సల సలా కాగుతున్న పెద్ద పాత్రలో తన చేతిని పెట్టి లోపల వుడుకుతున్న పదార్థాలను కలియ తిప్పేవారు. అలాంటప్పుడు వారి చేయి కాలటం గాని, కనీసం కందినట్లుగా కూడ వుండేది కాదు.

ఒకనాడు అలా బాబా స్వయంగా వండి వడ్డించి చాలా మందికి అన్నదానం చేశారు. రెండు మూడుసార్లు వండవలసి వచ్చింది. ఉదయం ప్రారంభించిన కార్యక్రమం సూర్యాస్తమయ సమయంవరకు జరుగుతూనే వుంది. వందల కొద్దీ పేదలు కడుపార భుజించి సంతృప్తి చెందారు. ఆ రోజు ఎందువల్లనో తాత్యా మసీదుకు పగలంతా రాలేకపోయాడు. బాబా ఒక్కడే ఈ పని చూసుకోవలసి వచ్చింది. తాత్యా సాయంత్రం వచ్చి విషయం తెలుసుకున్నాడు. బాబా ఇంతకష్టపడుతూ వుండగా తాను రానందుకు ఆ పనిని తాను చేసి సాయికి సహాయపడనందుకు తనను తాను నిందించుకున్నాడు. బాబా ముఖ కవళికలు అలసినట్లుగా తాత్యాకు కనిపించాయి. తాత్యా ఆదుర్దాపడ్డాడు, ఆందోళన చెందాడు. యింతలో మహల్సాపతి వచ్చాడు. బాబా బాగా అలసిపోయారు. వారికి వెంటనే విశ్రాంతి లభించాలి. మనం ఏం చేస్తే బాగుంటుందని సలహా అడిగాడు మహల్సాపతిని. యింత అలసిపోయినా బాబా వెళ్ళి మళ్ళీ ధుని దగ్గరే ఆ వేడిలో కూర్చుంటారు. మనం ఒకచక్కని రాతిని బాబా కూర్చునేందుకు వీలుగ మసీదు ముందు ఆరుబయట వెన్నెలలో వేసి వుంచితే చల్లని గాలిలో బాబా సేదదీరి శారీరకంగా విశ్రాంతి పొందుతారు అని చెబుతాడు.

అప్పటికి భోజనాది కార్యక్రమాలు పూర్తి అయి అంతా సర్దుమణుగుతుంది. రాత్రి తొలి ఝాము పూర్తి అవుతూ వుంటుంది. వెంటనే దగ్గరలో వున్న పర్వతప్రాంతానికి వెళ్ళి రాతిని తీసుకు రావాలని తాత్యా ప్రయత్నిస్తాడు. ప్రక్కనే వుండి వారి సంభాషణను వింటున్న బాబా వద్దని వారిస్తాడు. తాత్యా వినడు. ఉదయం నుంచి మసీదుకు రానందుకు బాబా యొక్క పనిని పంచుకుని చేయనందుకూ శిక్షగా ఈ పనిని యిప్పుడే తాను చేయాలని పట్టుపడతాడు. బాబాతోపాటు మహల్సాపతి కూడ వారించాలని ప్రయత్నిస్తాడు. ఉదయాన్నే వెళ్ళి రేపు తీసుకురా వచ్చును లే అని సముదాయిస్తాడు బాబా. అయినా తాత్యా వినడు.

నేను సుఖంగా ఆరు బయట కూర్చోటానికి సరిపడే రాయి వస్తుందిలే నీవువెళ్ళవద్దు అంటాడు బాబా. ఎప్పుడో వస్తుందిలే! కాని నా అశ్రద్ధకు పరిహారంగా నేను యిప్పుడే తీసుకురావాలని అంటాడు తాత్యా. యిప్పుడే వస్తుందిలే అంటాడు బాబా. నీవు నా ప్రయత్నాన్ని విరమింప చేస్తున్నావు బాబా. రాయి ఇప్పుడే ఇక్కడకు నేనే స్వయంగా వెళ్ళితేవాలి. ఎవరో తెచ్చి పెడితే నాకేం తృప్తి అని తాత్యా తిరిగి వాదిస్తాడు. యింకెవరూ రాతిని తీసుకురారులే తాత్యా, నీవు శాంతించి కూర్చోమని బాబా వారించినా వూరుకోడు, ఈ క్షణంలోనే రాయి యిక్కడ వుండి తీరాలి అంటూ బాబా మాటలు వినకుండా మసీదు బయటకు వెళుతూ వుంటాడు. అప్పటికే రాత్రి రెండవ ఝాము ప్రవేశిస్తున్నది. ఆ రాత్రి వేళ తాత్యాను కష్టపెట్టటం యిష్టంలేని బాబా రెండు చేతులనుపై కెత్తి ఏవో సైగలు చేసి ఏవో లోలోపలే మాట్లాడతాడు. తళుక్కున పెద్ద మెరుపు మెరుస్తుంది. ఆ మెరుపును చూడలేక ముందు వెళుతున్న తాత్యా, మసీదులోగల మహల్సాపతి కూడ, కళ్ళు మూసుకుంటారు. మరుక్షణంలో కళ్ళు తెరిసేటప్పటికి మసీదు వాకిట్లో నలుచదరంగా వున్న ఎరుపు తెలుపు రంగులు కలిసిన కొండరాయి వచ్చివుంటుంది. వారిద్దరూ ఆశ్చర్యపోతారు. అప్పుడు బాబా ఆ వెన్నెలరాత్రి ఆ రాతిపై కాలుమీద కాలు వేసుకుని కుడిచేతిని పైకిఎత్తి వారిద్దరికీ అభయమిస్తాడు. అప్పుడు మహల్సాపతికి తన ఆరాధ్య దైవమైన శివుని గాను, తాత్యాకు మారుతి రూపంలోను ఏకకాలంలో యిద్దరికీవేర్వేరు రూపాలలో దర్శనం యిస్తాడు. ఆనందం పట్టలేని మహల్సాపతి కళ్ళ నుంచి ఆనందభాష్పాలు రాలగా నోటి నుంచి ఏవేవో శివశ్లోకాలు ఆశువుగా వినపడతాయి. కొంతసేపటికి వారు మామూలు స్థితికి రాగా సాయి వారిని కూర్చోపెట్టి వారికోసం వుంచిన భోజనాన్ని తానే స్వయంగా వారికి వడ్డించి భోజనం చేయిస్తాడు.

ఆ తరువాత తాము చూసిన ఆ రెండు విచిత్ర లీలలను ఎవరికీ చెప్పవద్దని బాబా హెచ్చరిస్తాడు. బాబా ఎప్పుడూ దృష్టినంతా తన గురుదేవుని మీదే లయం చేసి ఆ గురువును ప్రేమించుట యందే పరాకాష్ట స్థితి పొందెను. ఈ విధంగా గురుదేవుని సంపూర్ణ కృపను పొందెను. అలాంటి ఐక్యానంద స్థితిని గురువుతో పొందినప్పుడే గురుబ్రహ్మా, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరః, గురుసాక్షాత్ పరబ్రహ్మా, అనే స్థితి వస్తుంది. అలా కాకుండా మాటలతో మాత్రమే "గురువుగారు" అని అంటూ చేతులలో, ఆచరణలో, లక్ష్య సిద్ధిలో గురువుకు దూరంగా వెళితే అది

కేవలం మర్యాదకోసం వాడే "గురు" పదంగా మిగిలిపోతుంది. కాని, శిష్యుడు ఏ విధమైన ఉపయోగాన్ని గురువు నుంచి పొందలేడు.

బాబా యొక్క ఈ ఏకాగ్రత స్థితివలన సకల యోగైశ్వర్యములు సర్వ సిద్ధులు బాబాను ఆశ్రయించి ఆయన పాదముల వద్ద పడియున్నవి. ఈ సిద్ధులు కొమ్ములు తిరిగిన మహాయోగులను కూడ సర్వనాశనము చేసి బుద్ధిని పెడద్రోవ పట్టించును. అందువలనే బాబా వాటిని నిరాదరించాడు, కన్నెత్తి అయినా వాటి వంక చూడలేదు. ఆ సర్వసిద్ధ శక్తూలూ సుమారు 30 సంవత్సరములు బాబా పాదాల చెంతపడివున్నాయి. 1886 వరకు బాబా తన అద్భుతశక్తులను ప్రదర్శించలేదు.

ఈ మా పాఠకులకు కూడ భక్తి జ్ఞాన వైరాగ్యాలను కలిగించమని, ఈ అధ్యాయాన్ని భక్తి శ్రద్ధలతో పఠించు వారికి బుద్ధిని ఏకాగ్రత చేసి, మనస్సును లయం చేయగల శక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

ఆరవ అధ్యాయం సంపూర్ణం

ఏడవ అధ్యాయము

కాలచక్రం వేగంగా తిరుగుతున్నది. వేగంగా తిరిగే కాలచక్రంతోపాటుగా సాయి యొక్క పేరు మహరాష్ట్ర ప్రాంతంలో నలుదిశలా వ్యాప్తి చెందింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు సాయి దగ్గరకు వచ్చి వారి వారి సమస్యలకు పరిష్కారాలు పొంది ఆనందిస్తున్నారు.

రాత్రిపూట మహాల్సాపతి, తాత్యా బాబాతో కలిసి మసీదులోనే పడుకునే వారు. ముగ్గురు తలలు మసీదు మధ్య భాగంలోకి వచ్చేటట్లుగా ఒకచోట పెట్టుకుని కాళ్ళు దూరంగా చాచుకుని పడుకుని ఏవేవో మాటలు మాట్లాడుకుంటూ వుండేవారు. ఎక్కువగా వారి ప్రశ్నలకు బాబా సమాధానాలుయిస్తూ వుండేవారు. ఒక్కొక్కప్పుడు బాబా తానే కొన్ని ఆధ్యాత్మిక విషయాలను తనంతట తానుగా బోధిస్తూ వుండేవాడు. అప్పుడప్పుడు శ్యామా కూడ వారితో జత కలుస్తూ వుండేవాడు. ఒక్కొక్కప్పుడు బాబా మహల్సాపతి చేతిని తన గుండె మీద వేసి వుంచి చెవిని దగ్గరగా పెట్టి గుండెలో నుంచి వచ్చే శబ్దాన్ని వినమని చెబుతూ వుండేవాడు. మామూలు గుండె కొట్టుకునే శబ్దంకాక అందులో నుంచి భగవన్నామం వినిపించేదట. అలాగే చేయి వుంచి మహల్సా నిద్రపోతే అరే భగత్ అని పిలిచి బాబా ఆయనను తట్టిలేపి సరిగ్గా పడుకోమని చెప్పేవాడు. రాత్రి సమయంలో ఎవరు ఎప్పుడు లేచినా బాబా వారిని పలకిరించే వారట. దీనిని బట్టి బాబా నిద్రపోయే వారుకాదని, కన్నులు మూసినట్లు పైకి కనిపించినా అది యోగనిద్ర మాత్రమేనని మహల్సాపతి నిర్ధారించుకున్నాడు.

అది 1886వ సంవత్సరం మార్గశిర పౌర్ణమి నాటి రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో బాబా మహల్సాపతి మామూలుగానే ఏవో మాటలు మాట్లాడుకుంటున్నారు. అప్పుడు బాబా వుబ్బసం వ్యాధితో బాధపడుతూ వున్నాడు. బాబా మహల్సాపతితో యిలా అన్నాడు. "యిప్పుడు నేను ఈ శరీరాన్ని వదిలి పైకి వెళతున్నాను. తిరిగి మూడు రోజుల తరువాత మళ్ళీ ఈ శరీరంలోకి వస్తాను. ఈ మూడు రోజులు ఈ నా శరీరాన్ని జాగ్రత్తగా కాపాడు. ఒకవేళ మూడు రోజుల తరువాత తిరిగిరాకపోతే మసీదు ఎదురుగా శరీరాన్ని సమాధి చేసి గుర్తుగా రెండు

జెండాలనుపాతు" అని చెప్పి తన తలను మహల్సా తొడపై వుంచి పడుకోగానే బాబా ప్రాణం శరీరంలో నుంచి బయటకు వెళ్ళిపోతుంది. ఈలోగానే వచ్చిన తాత్యా కూడ ఆ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యం పొందుతాడు. బాబా మరణించాడనే వార్త షిరిడి గ్రామమంతా వ్యాపించింది. రాత్రికి రాత్రే చాలమంది మసీదు దగ్గర పోగైనారు. మహల్సాపతి చెప్పిన మాటలను తాత్యా, శ్యామాలు మాత్రమే నమ్మగలిగారు. మిగిలిన వారంతా బాబా నిజంగానే మరణించాడనే నమ్మారు. గ్రామ మునసబు భాటే యిది మంచి అదనుగా తీసుకుని, మహిమలు శక్తులు గలవాడు మరణించవలసిన అవసరం ఏముందంటూ రాద్ధాంతం చేయసాగాడు.

తెల్లవారేసరికి గ్రామంలోని ప్రజలంతా మసీదు ముందు పోగైయ్యారు. భాటే తన అనుచరులతో శవాన్ని తొలగించబోయాడు. మహల్సాపతి అడ్డుకున్నాడు. మూడు రోజుల తరువాత తిరిగి వస్తానని సాయి చెప్పాడు కాబట్టి మూడు రోజులు ఆ శరీరాన్ని కదపటానికి వీలులేదని గట్టిగా పట్టు పట్టాడు. గ్రామస్తులలో కొందరు మూడు రోజులు చూసిన తరువాతే శవ సంస్కారం చేయవచ్చునన్న భావనతో ఏకీభవించటంతో భాటే ఏమీ చేయలేకపోయాడు. అయినా చనిపోయిన మనిషి తిరిగి బ్రతకటం అసంభవమని అతని నమ్మకం. మూర్ఖత్వంతో తిరిగి బ్రతికి వస్తాడని మహల్సాపతి నమ్ముతున్నాడని, డాక్టరును పిలిపించి పరీక్ష చేయిస్తే విషయం అంగరికీ కూడ తెలుస్తుందని ఆలోచించి రెండవ రోజు డాక్టరు కోసం అహమ్మదునగరు పంపుతాడు. మూడవరోజు ఉదయానికి ఆంగ్లేయ డాక్టరు వచ్చి పూర్తి పరీక్షలు చేసిన తరువాత, నిజానికి మూడు రోజులక్రితమే ఈ మనిషి చనిపోయినాడని, అయితే అప్పటి వరకు కూడ ఆ శరీరానికి శవ లక్షణాలు రాలేదని మాత్రం చెబుతాడు. ఏది ఏమైనా చుట్టు పక్కల ప్లేగు వ్యాధి బాగా వ్యాపించివుండటంచేత శవాన్ని యిలా వుంచటం మంచిది కాదని హెచ్చరిస్తాడు. ఎలాగూ మూడవ రోజు పూర్తి కావస్తుంది కాబట్టి నాలుగవ రోజు ప్రాణం రాకపోతే శవసంస్కారం చేద్దామనే నిర్ణయానికి గ్రామస్థులంతా వస్తారు. మూడవ రోజు గడచిని తరువాత తెల్లవారు ఝామున నాలుగు గంటల ప్రాంతంలో బాబా శరీరంలో వూపిరి ప్రవేశించి గాలి పీల్చుకోవటం ప్రారంభమౌతుంది. కాళ్ళు చేతులు కదులుతాయి. క్రమంగా కొద్ది నిముషాలలోనే సాయి లేచి కూర్చుంటాడు. మహల్సా ఆనందాతిరేకంతో, శ్రీ సాయినాథ్‌కీ జై ! అని పెద్దగా అరుస్తాడు. కునికిపాట్లు పడుతున్న తాత్యా, శ్యామాలు ఉలిక్కి పడిలేస్తారు. వారు కూడ ఆనందాన్ని అణచుకోలేక శ్రీ సాయినాథ్ మహరాజ్‌కీ జై అని పదే పదే బిగ్గరగా జై జై ధ్వానాలు చేస్తూ బాబా పాదాల చెంతకు చేరతారు. ఈ హడావుడిని విన్న వూళ్ళో వాళ్ళు కూడ చకచకా ద్వారకామాయి దగ్గరకు చేరుకుని బాబాకు సాష్టాంగ ప్రణామాలుచేసి బాబాను చూసి విస్మయం చెందుతారు.

స్వయంగా తానే పిలిపించిన ఆంగ్లేయ డాక్టరు పరీక్షించి శవము అని తేల్చిన బాబా శరీరం తిరిగి బ్రతికి తిరుగుతూ వుండటం చూసిన భాటే కూడ బాబా సాక్షాత్తు దైవ స్వరూపుడని నమ్ముతాడు. ఆనాటి నుంచి బాబా ప్రచారకుడిగా మారి తనకు తెలిసిన వారినందరినీ బాబా దగ్గరకు పోయి ఆయనకు మ్రొక్కి జన్మధన్యత చేసుకోండని సూచిస్తూ వుంటాడు.

1886లో జరిగిన ఈ సంఘటన తరువాత బాబా కూడ అనేక చిత్రాతి చిత్రమైన లీలలను చూపుతూ ఎక్కడెక్కడి నుంచో ఎందరెందరినో భక్తులను షిరిడి లాగుతూ వారికి అనేక మహిమలు చూపుతూ, విశ్వాసం కలిగిస్తూ అనేక విధాలుగా వారిలో పరివర్తన తీసుకొచ్చిన విధానాలు లీలల రూపంలో తెలుసుకుందాం.

నిజానికి సాయి చూపిన లీలలు, మహిమలు యిప్పటి నుంచే అధికంగా వున్నాయి. 1890 నుంచి 1918 వరకు 28 సంవత్సరాలపాటు జరిగిన సాయి జీవితచరిత్రే యదార్థానికి మనకు కావలిసిన అవసరమైన చరిత్ర. బాబా బోధలు లీలలు, మహిమలు ఈ కాలంలోనే జరిగాయి. యిది సాయి సంకల్పించిన సంపూర్ణ జీవితచరిత్ర కాబట్టి దీనిని యింత వరకు ఒక కథలాగానే తెలుసుకున్నాము. యిక ముందు రాబోయే జీవితచరిత్రను భక్తి శ్రద్ధలతోను, నియమ నిష్టలతోను హృదయానికి హత్తుకుని, విషయ జ్ఞానాన్ని సరైన విధంగా బుద్ధి గ్రహించే విధంగా పారాయణను సాగించమని సాయిని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

ఏడవ అధ్యాయం సంపూర్ణం.

ఎనిమిదవ అధ్యాయము

షిరిడి గ్రామంలోని ప్రజలతోపాటుగా చుట్టు పక్కల, దూర ప్రాంతాలలో గల ప్రజలలో కూడ బాబా సాక్షాత్తు భగవంతుడేనన్న భక్తి భావన పెరిగింది. మూడు రోజులు సమాధి స్థితిలో నుండి తిరిగి బ్రతికి లేచిన తరువాత, అంతకు ముందు విమర్శనాత్మకంగా బాబాను చూసే వారు కూడ భక్తులయ్యారు. పిచ్చివాడని రాళ్ళు విసిరిన పోకిరీలు కూడ పుష్పగుచ్ఛాలతో పూజించటానికి సిద్ధమైయ్యారు. సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై అంటూ భక్తులు పారవశ్యంతో జయ జయ ధ్వానాలు చేస్తూ వుండేవారు. మహల్సాపతి బాబాకు ముఖ్య పూజారిలా వుంటూ వుండేవాడు. శ్యామా కూడ బాబాకు రకరకాలైన సపర్యలు చేస్తూ వుండేవాడు. కుష్టురోగం నయమైన భాగోజీ షిండే జీవితాంతం బాబాకు సేవలు చేస్తూ మసీదులోనే వుండేవాడు. అందరి కంటే బాబాతో సర్వకాల సర్వావస్థలయందు సహచర్యాన్ని గడిపింది భాగోజీ. మొదట కుష్టురోగంతో బాధపడినా ఆ తరువాత సంసార బంధాలలో చిక్కుకోకుండా సాయి సేవకే జీవితాన్ని అంకితం చేసిన ఈ మహనీయుడు ఏ జన్మలో ఏపుణ్యం చేసుకున్నాడో మనకేం తెలుసు.

బాబా యోగాభ్యాసములు

మసీదుకు ఉత్తరపు దిశలో చాలా దూరములో ఒక మఱ్ఱిచెట్టు వుండేది. దాని సమీపంలో గల బావి దగ్గరకు రెండు మూడు రోజులకు ఒకసారి బాబా వెళ్ళి ముఖ ప్రక్షాళనము, స్నానము చేసేవారు. ఒకనాడు బాబా తన వూపిరితిత్తులను బయటకు కక్కి వాటిని నీటితో శుభ్రపరచి సూర్యరశ్మికి అరబెట్టిన దృశ్యాన్ని షిరిడి గ్రామ ప్రజలు కొందరు కళ్ళారా చూశారు. తరుచుగా "ధౌతి" అను కడుపులోని పేగులను శుభ్రపరిచే పద్ధతి ఆచరిస్తూ వుండేవారు. 3 అంగుళముల వెడల్పు 22 1/2 అడుగల పొడవుగల గుడ్డను మ్రింగి కడుపులో అరగంటకు పైగా వుంచిన తరువాత అది కడుపులోని పేగుల లోపలికంటూ ప్రవేశిస్తుంది. ఆ తరువాత మళ్ళీ దానిని మెల్లగా నోటి నుంచి తీసివేస్తే పేగులను పరిశుభ్రపరుస్తూ అది బయటకు వస్తుంది.

అదే విధంగా సాయి తన శరీర అవయవాలన్నిటినీ వేరుగాచేసి మసీదునందు వేర్వేరు స్థలములలో విడిచి పెట్టేవారు. ఒకనాటి రాత్రి ఒక భక్తుడు

మసీదులోకి రాగా బాబా శరీర అవయవాలన్నీ మసీదులో అక్కడక్కడ పడివుండటం చూసి భయపడి బాబాను ఎవరో ఖూనీ చేసి వుంటారని గ్రామ మునసబు దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేయాలని నిశ్చయించుకుంటాడు. కాని మొదట ఫిర్యాదు చేసిన వారికి ఈ విషయం గురించి పూర్తి వివరాలు తెలుస్తాయని సహజంగా అనుమానిస్తారనే భయంతో వూరుకుంటాడు. కుతుహలం ఆపుకోలేక మరుసటిరోజు ఉదయమే మసీదునకు వెళ్ళగా బాబా మామూలుగానే హాయిగా కూర్చుని వుండటం చూసి ఆశ్చర్యపడి బాబాకు సాష్టాంగ ప్రణామం చేస్తాడు. శరీర అవయవాలనన్నిటినీ ఖండించి వేరు చేసే ఈ యోగక్రియను ఖండ యోగం అనిపిలుస్తారు. యిదే విధంగా ఒకసారి కుడి మోకాలి క్రింది భాగంలోని నరాలలో గల చిన్న దోషాన్ని బాబా స్వయంగా పైభాగపు మాంసాన్ని కోసి లోపలి నరాలను సరిచేసి మళ్ళీ మామూలుగానే పైమాంసాన్ని అతికారు. యిలాంటి అనేక యోగాలకు ఆలవాలమైన తన శరీరభాగాలను ఎవరికీ కనిపించకుండా వుండేందుకు సాయి బహుశా పైనుంచి క్రింది వరకు వుండే పొడుగాటి బారులాల్చిని తొడిగే వారేమో!

బాబాకు బాల్యము నుంచి యోగాభ్యాసములన్నీ తెలుసు. అయినా వాటిని జనం మధ్యలో బాహాటంగా ఎప్పుడూ ప్రదర్శించలేదు. అప్పుడప్పుడు వారి కళ్ళ నుంచి అభయ హస్తం నుంచి తీక్షణమైన, అతి శక్తివంతమైన కాంతి కిరణాలు వెలువడేవి. అవి సర్వశక్తివంతం గాను సర్వరోగ నివారిణిగాను, సర్వసమర్ధత కలిగివుండేవి.

1886 నుంచి 1900 వరకు జరిగిన 14 సంవత్సరముల కాలములో సాయి ఎందరెందరినో పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లుగా షిరిడి గ్రామానికి లాగి వారికి భక్తి, జ్ఞాన వైరాగ్య మార్గాలు నేర్పుతూ వుండేవారు. కోపర్‌గాం తహసిల్‌దారు "భార్వా" అనుసతడు తరచుగా బాబా దర్శనానికి వచ్చి అనేక బాధలకు, కష్టాలకు నివారణ పొందుతూ వుండేవాడు. ఈ విధంగా వున్నతోద్యోగుల నుంచి సాధారణ నిరుపేదల వరకు, అన్ని మతాల వారికి, జాతుల వారికి షిరిడి ఒక పవిత్రయాత్రా స్థలంగా మారింది. బాబాను దర్శించాలని అనుకోగానే కొంత మందికి పనులు పూర్తి అవుతూ వుండేయట. అప్పట్లో భక్తులకు వసతి ఏర్పాట్లు ఏవి లేవు. ఎవరైనా ఒకటి రెండు రోజులు బాబా సన్నిధిలో వుండాలంటే రాత్రికి ద్వారకామాయి ముందుగా గాని లేక గురుస్థాన్ వేపచెట్టు క్రిందగాని వుండేవారట.

సాఠేవాడ నిర్మాణము

అది 1904వ సంవత్సరం హరి వినాయక సాఠే అనునాతడు అహమ్మదునగర్‌లో డిప్యూటీ కలెక్టరుగా వుండేవాడు. ఆయన ఒకసారి డ్యూటీమీద కోపర్‌గాం వచ్చి బాబా పేరు ప్రఖ్యాతులు విని షిరిడికి వెళ్ళి బాబా యందు ఆకర్షితుడౌతాడు. 1906లో మొట్ట మొదటిసారిగా గురుస్థాన్ సమీపంలో కొంతస్థలాన్ని కొని తరువాత భక్తులు వుండటానికి వీలుగా ఒక వసతి నిర్మిస్తాడు. దీనిని సాఠేవాడ అని పిలిచేవారు. ఈ నాటికీ సమాధి మందిరానికి, గురుస్థాన్‌కు మధ్యలో బంగళా పెంకులతో కప్పబడి కాల గమనంలో కొన్ని మార్పులు సంతరించుకొని యున్నది. ఈ సాఠేవాడ.

1904 నుంచే బాబాకు ద్వారకామాయిలో త్రికాల హారతులను భక్తులు ప్రారంభించారు. ఈ ఆరతులను సరిచేసి ఏ పాటలు పాడాలి అనే విషయం నానా చందోర్కరు నిర్ణయించాడు. మధ్యాహ్నం ఆరతి సమయానికి గ్రామస్తులంతా కూడ మసీదుకు చేరుకునే వారు. ఒక్కొక్కసారి మసీదు భక్తులతో కిక్కిరిసిపోయి వుండేది. భక్తులు వేల సంఖ్యలో వచ్చినా కూడ అందులోని ప్రతివ్యక్తి బాధను, అవసరాన్ని బాబా గమనించి అనుగ్రహిస్తూనే వుండేవాడు. షిరిడికి వచ్చిన ఏ నిజభక్తుడు వట్టి చేతులతో తిరిగిపోయిన సందర్భం వుండేదికాదు. సాయి కరుణాసముద్రుడని, ప్రేమకు మారు పేరని, దయాళుడని భక్తులు భావిస్తూ వుండేవారు. కొందరు భక్తులు సంశయంతో నన్ను బాబా చూడలేదు. నా బాధ వినలేదు కదా, మరి ఈ నా కష్టం ఎలా తీరుతుంది. అనే అనుమానాన్ని మనసులో పొందేవారు. సాయి వెంటనే గ్రహించి అందరూ వినేటట్లుగా "ఓ నా భక్తులారా, మీరు నా మీద వుంచిన భక్తికి విశ్వాసానికి ప్రతిఫలం తప్పక లభిస్తుంది. ఈ షిరిడి గ్రామ ప్రవేశమే సర్వదుఃఖం పరిహారం. ఈ ద్వారకామాయి ప్రాంగణంలో అడుగుపెట్టగానే అర్తులైనా, నిరుపేదలైన సుఖసం పదలను పొందగలరు. ఈ తల్లి కరుణామయురాలు." అని చెబుతూ వుండేవారు.

పాము విషం నుంచి శ్యామాను రక్షించుట

ఒకసారిశ్యామా గ్రామపుపొలిమేరలలో తిరుగుచుండగా విష సర్పము కాలి చిటికెనవేలుపై కరచెను. వెంటనే శరీరంలోనికి విషం వ్యాపించుట మొదలయ్యెను.

శ్యామాకు ప్రాణ భయము కలిగెను. బాలా సాహెబ్ మొదలగు శ్యామా స్నేహితులు అతనిని విఠోబా గుడికి తీసుకువెళ్ళాలనుకున్నారు. అక్కడ పాము కాట్లు నయమవుతూ వుండేవి. కాని శ్యామాకు బాబాయే సర్వస్వం కనుక వారితో సంప్రదించి కాలం వృధా చేయటం యిష్టంలేక సరాసరి ద్వారకామాయి మసీదుకు వెళ్ళి బాబా పాదాలపై పడాలనే ఆశతో మసీదుకు చేరగానే బాబా కోపోద్దీపితుడై కళ్ళెర్రచేసి తీవ్ర స్వరంతో "ఎక్కవద్దు, ఎక్కినచో ఏమౌనో చూడుము" అంటూ "పో, పొమ్ము, దిగిపొమ్ము" అని మళ్ళీ గద్దిస్తాడు. తన సర్వస్వం బాబాగా భావించి వస్తే బాబానే మసీదు మెట్లు ఎక్కవద్దంటున్నాడే అని నిరాశ చెంది శ్యామా దిగులుపడతాడు. కాని యదార్థానికి ఎక్కవద్దని, దిగిపొమ్మని ఆజ్ఞాపించినది పాము విషాన్ని గాని శ్యామాను కాదు. విఠలుని గుడికి వెళ్ళమని స్నేహితులు సలహా యిచ్చినా వినకుండా తన వద్దకే రావాలని మనో నిశ్చయం శ్యామా చేసినప్పుడే బాబాకు విషయం అర్థమైపోయింది. శ్యామా మసీదులోనికి వచ్చి తనను పాము కరిచిందని, విషం పైకి ఎక్కుతుందని చెప్పక ముందే కాలాన్ని వృధా చేయకుండా విషాన్ని దిగిపొమ్మని బాబా ఆదేశించాడు. వేరే మంత్రమే లేక కేవలం వాక్కుతోనే పాము విషాన్ని తొలగించిన తరువాత మామూలు స్థితికి వచ్చి శ్యామా దగ్గరకు వెళ్ళి కూర్చుని బాబా యిలా అంటాడు. "భయపడవద్దు. ఈ దయార్ద్ర ఫకీరు నిన్ను రక్షించి తీరుతాడు. యింటికి వెళ్ళి అటూ యిటూ తిరుగకుండా యింటిలోనే వుండుము. పడుకోవద్దు." బాబా ఈ మాటలు అన్న కొద్ది నిమిషములకే శ్యామా బాగు పడతాడు. ఈ సంఘటన ద్వారా మనం తెలుసుకోవలసిన ముఖ్య విషయం. బాబా వాక్కు మంత్ర, యంత్రాల కన్నా శక్తివంతమైనది. ఆయన వాక్కే ఒక మహామంత్రము. కాబట్టి సాయి భక్తులు మంత్రాలని, జాతకాలని, ప్రశ్నలని ఎవరి దగ్గరకు పరుగు తీయవలసిన అవసరం లేదు. జాతకాలు చెప్పేవారు రాగల కష్టాలను చెప్పగలరు. కాని సాయి ఆశీర్వదిస్తే అలాంటి కష్టాలన్నీ తొలగిపోయి సుఖశాంతులు లభిస్తాయి.

కలరా వ్యాధి

1905లో షిరిడి గ్రామంలో కలరా వ్యాపించింది. ఇతర వూళ్ళవాళ్ళతో గ్రామ ప్రజలంతా రాకపోకలను తగ్గించారు. కలరాను నిర్మూలించటానికి గ్రామ పెద్దలు రెండు నియమములను నిర్ణయించారు. 1. కట్టెల బండ్లను గ్రామములోనికి రానీయకూడదు. 2. మేకను గ్రామంలో కోయరాదు.

యివి వట్టి పనికి మాలిన చాదస్తపు నియమాలని బాబాకు తెలుసు. మొదటి నియమం వలన గ్రామంలో కట్టెలకు కొరత ఏర్పడింది. బాబా మాత్రం ఆ చట్టాలను నిర్లక్ష్యం చేశాడు. ఒకనాడు గ్రామంలోకి కట్టె పుల్లల బండి రాబోతున్నది. అవి అందరికీ ఎంతో అవసరం కూడ. అయినా గ్రామస్థులంతా ఆ బండిని తిరస్కరించనారంభించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాబా ఆ ప్రదేశానికి వచ్చి కట్టెలబండిని మసీదులోనికి తీసుకుని పొమ్మని చెప్పెను. బాబా లౌకికమైన ఆచార వ్యవహారాలతో పట్టింపులేనివాడు. ఆయన కెదురు చెప్పుటకు ఆనాడు ఎవరు ధైర్యం చేయలేదు.

గురుభక్తికి పరీక్ష

యిదే విధముగా రెండవ కలరా నిబంధనను కూడ బాబా ఉల్లఘించెను. బలహీనముగావుండి చావుకు సిద్ధముగా వున్న ఒక ముసలి మేకను ఎవరో మసీదుకు తెచ్చిరి. ఆ సమయంలో బడే బాబా అక్కడనే ఉంటాడు. ఆ మేకను ఒక్క వేటుతో నరికి బలి చేయమని బడే బాబాను సాయిబాబా ఆదేశిస్తాడు. ఈ బడే బాబా అంటేసాయికి ఎంతో అభిమానం. దక్షణగా వచ్చిన ధనంలో నుంచి ప్రతిరోజు కొంతభాగం ఆయనకు యిచ్చేవాడు. చిలుం పీల్చేటప్పుడు భోజనాల సమయంలోను కూడ సాయి బడే బాబాను తన ప్రక్కనే కూర్చోపెట్టుకునే వాడు. ఏదైనా పని మీద బడే బాబా యితర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు బాబా ఆయనతోపాటు 100కు పైగా అడుగులు కలిసి వేసి తిరిగి మసీదుకు వచ్చేవాడు. బడే బాబా అసలు పేరు మహమ్మద్. అలాంటి దగ్గర సంబంధం గల ఆయనే అనవసరంగా మేకను చంపనేల అని నిరాకరిస్తాడు. అప్పుడు శ్యామాను పిలిచి మేకను బలి చేయమని కోరతాడు. శ్యామా కత్తికోసం వాడాలోకి పోయి త్వరగా తిరిగిరాడు. అందువలన కాకా సాహెబ్ దీక్షిత్తును ఆదేశిస్తాడు సాయి. అతను సదాచార బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి చంపుట అంటే తెలియని వాడు. అయినా సరే బాబా ఆజ్ఞకు తలవొగ్గి చంపుటకు సిద్ధమై చేతిలో వున్న కత్తి మేక మీద పడుటకు సిద్ధంగా వుండగా బాబా ఆగమని ఆజ్ఞాపించి "ఎంతటి కఠినాత్ముడైన బ్రాహ్మణుడవు. నీవు మేకను చంపటానికి సిద్ధమౌతున్నావు" అంటాడు. బాబా మాటలు విని కత్తిని ప్రక్కన పెట్టి దీక్షిత్ యిలా అంటాడు.

"అమృతతుల్యమైన నీ వాక్కులే మాకు వేదం. అదే మాకు చట్టం. ఆ మాటలే మాకు దైవ ఆజ్ఞ. నిన్ను ఎప్పుడూ జ్ఞాపక ముంచుకుంటాము. నీ రూపాన్నే ధ్యానిస్తూ, పూజిస్తూ రాత్రింపగళ్ళు నీ ఆజ్ఞలనే పాటిస్తాము. నీవు ఆజ్ఞాపిస్తే అది మంచిదా కాదా అనే ఆలోచన మాకు వుండదు. దానిని పాటించాలా వద్దా అనే వాదనలు గాని, తర్కాలను గాని మేము చేయము. మా గురుదేవులైన మీ ఆజ్ఞను అక్షరాలా తప్పకుండా పాటించటమే మా విధి. అదే మా ధర్మం. మీ కోసం మా మనసు, బుద్ధి, అహంకారములతోపాటుగా ఈ శరీరాన్ని, ధనాన్ని కూడ ధారపోస్తాము."

గురుభక్తిని పరీక్షించుటకే బాబా ఈ పరీక్షను నిర్వహించారు. శిష్యులు ఎన్ని రకాలుగా వుంటారో కూడ ఈ విషయం ద్వారా బాబా అందరికీ నిరూపించి చూపించారు.

గురువుకు ఏమీ కావాలో గుర్తించి వారు ఆదేశించక ముందుగానే దానిని నెరవేర్చు వారు ఉత్తములు. గురువు ఆజ్ఞాపించగానే ఆలశించక ఆజ్ఞాపాలన చేయువారు మధ్యములు. మాటి మాటికి తప్పులు చేయుచూ గురువు ఆజ్ఞాపించినా కూడ ఆ పని చేయవచ్చునా లేదా అని అనుమానిస్తూ, తరువాత చేద్దాములే అని వాయిదా వేస్తూ వుండే వారు సాధారణులు. మొదటి రెండు తరగతుల వారు మాత్రమే గురువు నుంచి లాభాన్ని పొందగలరు. ఈనాడు చాలా మంది మేము ఫలానా వారి శిష్యులమని చెప్పుకుంటూ వుంటారు. కాని వారు సాధారణ శిష్యులుగానే వుంటూ కాలక్షేపం చేస్తూ వుంటారు. సాయి దగ్గరకు వచ్చి వారిని ఆశ్రయించిన తరువాత సర్వస్వాన్ని వారికి అర్పించి సరస్వ శరణాగతిని పొందాలి. అప్పుడే కైలాసం దిగి వచ్చిన ఈ పరమ శివుని అద్భుతశక్తి ఏమిటో తెలుసుకోగలం. యిలాంటి గట్టి విశ్వాసాన్ని కొన్ని రోజుల వరకు వుంచగలుగుతాం. కాని కాలగమనంలో ఆ నమ్మకం, విశ్వాసం అప్పుడప్పుడు చెదిరిపోతూ వుంటాయి. అందువలనే "సాబూరి" అవసరం అన్నాడు సాయి. సాబూరి అంటే ఓర్పుతో వేచి వుండటం. యిది కూడ భక్తునికి చాలా అవసరం. శ్రద్ధలేని పూజలు, ఓర్పులేని భక్తి ఎందుకూ పనికిరావు. అలాంటి వాటివలన సాధకులు గాని భక్తులు గాని ఉపయోగాన్ని పొందలేరు.

ఈ మా పాఠకుల హృదయాలలో సాయి స్థిరనివాసియై వుండుగాక. వారి యింటిలో సాయి ఒక కుటుంబ సభ్యుడుగా మారుగాక. శ్రద్ధ, సాబురి అనే ఈ రెండు మణిదీపాలు సాయి భక్తులందరినీ విడవకుండు గాక. సాయి రక్ష సర్వజగత్తుకు

రక్షగా మారుగాక. ఈ అధ్యాయాన్ని భక్తి శ్రద్దలతో పారాయణ చేయుభక్తుల హృదయాలలో సాయి భక్తి అనే మహావృక్షం పెరిగి పెద్దదై హీనులకు, దీనులకు ఆశ్రయాన్నిచ్చే వటవృక్షంగామారాలని ఆశిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః
ఎనిదవ అధ్యాయం సంపూర్ణం.

తొమ్మిదవ అధ్యాయము

అది 1903వ సంవత్సరం ధూలియా మేజిస్ట్రేటు కోర్టులో ఒక వ్యక్తిపై కొన్ని వస్తువులను దొంగలించినాడనే నేరారోపణపై కేసు పెట్టబడెను. ఆ ముద్దాయి షిరిడిలోని సాయిబాబా తనకు వస్తువులను యిచ్చాడని కోర్టులో చెప్పటంవలన సాక్ష్యమిచ్చుటకు బాబాను కోర్టునకు రమ్మనమని కోర్టు సమన్లు జారీ అవుతాయి. నానాచందోర్కరు సలహాపై భక్తులందరు ఒక అప్పీలును తయారుచేసి సాయిబాబా గొప్ప మహత్ముడని, దైవ సమానంగా తామంతా భావిస్తామని, అలాంటి అవతార పురుషుడిని ఒకసామాన్య మానవునివలె కోర్టుకు రప్పించుట అసమంజసమే కాక అనర్ధదాయకమని, ఒకవేళ కోర్టు వారికి సాయిబాబా సాక్ష్యమే కావలెనన్నచో ఒక కమీషనరును నియమించి షిరిడికి పంపి బాబా వారి సాక్ష్యమును పొందవచ్చునని నివేదిక సమర్పిస్తారు. కోర్టు వారు దానిని అంగీకరించి 1వ తరగతి మేజిస్ట్రేటు, అసిస్టెంటు కలెక్టరు అయిన "నానా జోషి"ని కమీషనరుగా నియమించి ఆ పనిపై పంపుతారు. ఈ విషయం షిరిడిలోని వారికి తెలియదు. కాని బాబా వారి రాకకు మూడు గంటలు ముందుగా కుర్చీలు బల్లలు తెప్పించి ద్వారకామాయి మసీదు ముందు ఒక కోర్టువలె తయారు చేయిస్తాడు. అప్పుడు కోర్టు వారు అడిగిన ప్రశ్నలకు బాబా యిచ్చిన సమాదానాలలో గల కొన్ని మనకు బాబా యొక్క నిజస్థితిని తెలియచేస్తాయి.

కమీషనర్ : మీ పేరు

సాయిబాబా : నన్ను అందరూ సాయిబాబా అని పిలుస్తారు.

కమీ : మీ తండ్రి పేరు

సాయి : ఆయన పేరును సాయి బాబాయే

కమీ : మీ గురువు పేరు

సాయి : వేంకుశుడు

కమీ : మీ మతము

సాయి : కబీరు మతము

కమీ : మీ కులము

సాయి : (పర్వర్దిగర్) దైవకులం

కమీ : మీ వయస్సు

సాయి : లక్షల సంవత్సరాలు

కమీ: మీరు సత్యమే చెబుతానని ప్రమాణం చేయండి

సాయి : నేను యింతకు ముందెప్పుడు అసత్యమును చెప్పలేదు. యిక ముందెప్పుడూచెప్పబోను.

కమీ : ముద్దాయిని మీరెరుగుదురా?

సాయి : నాకు తెలియని వారెవ్వరూ లేరు.

కమీ : అతను మీ భక్తుడని, మీరు తెలుసునని చెపుతున్నాడు?

సాయి : నేను అందరి దగ్గరా వుంటాను, అందరూ నావారే.

కమీ : ముద్దాయికి ఆ సొమ్ములను మీరిచ్చారా?

సాయి : ఈ ప్రపంచంలో ఎవరికి ఏమి కావాలన్నా నేనే యిస్తాను.

కమీ : మీరు అతనికి యిచ్చిన వస్తువులపై మీకు ఎలాంటి అధికారం వుంది.

సాయి : ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువు నాదే. నాది కానిదేది లేదు.

కమీ : యిది తీవ్రమైన దొంగతనమునకు సంబంధించిన నేరము. ముద్దాయి మీరు వస్తువుల నిచ్చినట్లుగా చెబుతున్నాడు.

సాయి : ఏమిటీ అనవసరపు గొడవ ఈ వ్యవహారముతో నాకే విధమైన సంబంధంలేదు.

మొదటి సమాధానాలన్నిటికీ కమీషనరు ఆశ్చర్యపడగా, ఆఖరి సమాధానానికి కంగారుపడి ఏవిధంగా ఈ కేసును నిర్ణయించాలో తెలియక కొంతసేపు ఆలోచించి గ్రామ డైరీ ఆధారంగా ఆ ముద్దాయి ఆ గ్రామానికి ఎప్పుడూ రాలేదు, సాయిబాబా ఎప్పుడూ గ్రామం విడిచి బయటకు వెళ్ళలేదు కాబట్టి దొంగ చెప్పిన విషయంలో నిజంలేదని నిర్ధారించి అతనికి శిక్షను విధిస్తాడు.

ఈ సాక్ష్యం విషయంలో బాబా పలికిన పలుకులను బట్టి ఈ సృష్టిలో బాబాకు తెలియని ప్రాణిగాని, వస్తువులుగాని లేవని, సృష్టి అంతటిపై బాబాకు అధికారం కలదని అర్థమౌతున్నది. బాబా ఏ స్థితిలోను అసత్యం చెప్పియుండలేదనే విషయము అర్థమౌతున్నది. సత్య వాక్పరిపాలన బాబా నుంచి మనం నేర్చుకోవలసిన ముఖ్యవిషయం. సత్యమే దేముడు. రామాయణ గాథలో సాధారణ రాజైన రాముడిని దేముడిగా మార్చిన దీసత్యవాక్కే! అందువలనే "సత్యం వద, ధర్మంచర" అనే వేదవాక్కులు వెలిశాయి.

నందాదీపం

లెండీబాగ్‌లో ఈశాన్యం వైపుగా బాబా నందాదీపం అనే దీపాన్ని ప్రమిదలలో నూనె పోసి వెలిగిస్తూ వుండేవాడు. దీనిని బాబా 1890లోనే ప్రారంభించారు. భూమిలో చిన్న గుట్టలాంటి భాగాన్ని తయారుచేసి అందులో దీపాన్ని వెలిగించి బుట్టలను కప్పి వుంచేవాడు. కాల క్రమేణా ఆనాటి నందా దీపాన్ని అలాగే వెలిగిస్తూ దానికి అటు యిటు ఒక వేపచెట్టును, రావిచెట్టును పెంచారు. ఈ నాటికీ భక్తులు ఆ రెండు చెట్లను చుట్టి నందా దీపానికి ప్రదక్షిణలు చేస్తూ వుంటారు. దీని చుట్టూ ప్రదక్షిణచేసే భార్యాభర్తలు ఎలాంటి అరమరికలు, పొట్లాటలు లేని దాంపత్య జీవితాన్ని అనుభవించేటట్లుగా సాయి ఆశీర్వదిస్తారని చాలా మంది విశ్వాసం.

నానా చందోర్కర్ షిరిడికి వచ్చుట

అది 1892వ సంవత్సరం. గ్రామం వదలి వెళ్ళేటప్పుడు అందరూ విధిగా బాబా వద్దకు వచ్చి పాదాలకు మొక్కి అనుమతి తీసుకుని మరీ వెళ్ళేవారు. అదే

విధంగా గ్రామ మునసబు అప్పా ఒకనాడు బాబాకు నమస్కరించి కోపర్‌గాంలో డిప్యూటీ కలెక్టరుగారు క్యాంపుచేసి జమాబంది జరుపుతున్నాడని వెళ్ళటానికి అనుమతి నిమ్మని ప్రార్థించగా బాబా ఆ డిప్యూటీ కలెక్టర్ నానా సాహెబ్ చందోర్కరును నేను రమ్మనమని చెప్పినట్లుగా చెప్పమని చెపుతాడు. కుగ్రామమైన షిరిడిలో గల ఈ ఫకీరెక్కడ, డిప్యూటీ కలెక్టరెక్కడ, ఆశ్చర్యపోతాడు అప్పా.

భయం భయంగానే ఆ వార్త అందిస్తాడు జమాబందిలో. మొదటి రెండు మూడుసార్లు నానా చందోర్కరు పిచ్చి ఫకీరును చూసేదేమిటిలే అని నిరాకరించినా కొంతకాలం తరువాత ఒకనాడు షిరిడికి వస్తాడు. మొదటి పరిచయంలోనే తనకు జన్మ జన్మల నుంచి బాబాతో వస్తున్న సంబంధాన్ని గ్రహించి ఆనందాన్ని విశ్వాసాన్ని పొందుతాడు. అలా ప్రారంభమైన తొలి పరిచయం క్రమేపీ అభివృద్ధి చెంది తాను స్వయంగా అనుభవించిన అనేక సాయి లీలలు, మహిమలు చూసి బాబా సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపుడని నిర్ణయించుకుంటాడు.

గణపతిరావు సహస్రబుద్ధే అనునతడు నానా చందోర్కరు దగ్గర కాపలా వుంటే పోలీసు హవల్దార్. అతనికి యిష్టం లేకపోయినా బలవంతంగా 1893లో నానా తనతోపాటుగా బాబా దగ్గరకు తీసుకువస్తాడు. అలా కొన్నిసార్లు బలవంతంగానే వచ్చిన గణపతిరావు క్రమంగా బాబా యొక్క దివ్య మహిమలు, శక్తులను గ్రహించగలుగుతాడు. గణపతిరావు తరువాత దాస్‌గణుగా ప్రసిద్ధి చెందుతాడు.

నానా చందోర్కరు షిరిడి రావటానికి పూర్వం జరిగిన బాబా లీలలు ఎక్కువగా ఎక్కడా గ్రంథస్తం కాలేదు. కాని ఆలోటును గమనించిన చందోర్కరు బాబాతో సన్నిహితులుగా వుండే భక్తులందరికీ తాను స్వయంగా డైరీలు తెచ్చి యిచ్చి మీరు ఎప్పుడు ఏం విశేషం బాబా వద్ద గమనించినా వెంటనే డైరీలో వ్రాయమని చెప్పేవాడు. అలా ఆనాడు ఆయన చేసిన ప్రయత్నమే ఈనాడు మనకు గల బాబా చరిత్ర. హేమాద్రిపంతు వ్రాసిన జీవిత చరిత్రకు కూడ ముఖ్యమైన కొన్ని ఆధారాలు ఈ డైరీలే. బాబాకు జరుగవలసిన నిత్య కార్యక్రమాలు, పూజలు ఆరతులను కూడ నియమబద్ధం చేసినది ఈ నానా చందోర్కరే. ఈయన కూడ బాబా గురించి ఎక్కువగా ఉపన్యాసాలిస్తూ ప్రజలకు బాబా లీలలను తెలియపరుస్తూ వుండేవాడు.

సహజంగానే నటుడు, గాయకుడు అయిన దాస్ గణూ కూడూ విశేషంగా బాబా కథలను మహారాష్ట్రమంతటా హరికథల ద్వారా ప్రచారం చేశాడు. ఈయన

జీవితంలో బాబా తీసుకువచ్చిన మార్పును ముందు రాబోయే అధ్యాయాలలో తెలుసుకుందాం.

దాసుగణువలె మన జీవితాన్ని కూడ సాయితత్వ ప్రచారంలో ఉపయోగపడే ఒక చిరుదీపంగా ఉపయోగించమని, అందుకు అవసరమైన విధంగా మనలోగల అన్ని ఈతిబాధలను సక్రమముగా తొలగించమని, మనలో గల మోహాన్ని నిర్మూలించమని సమర్థుడైన సాయిని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

పదవ అధ్యాయం

1898వ సంవత్సరంలో **దాసుగణు** పోలీసు వృత్తి రీత్యా కానాభిల్లుడనే గజ దొంగను పట్టుకునేందుకు ప్రభుత్వం నియమిస్తుంది. ఒకటి రెండుసార్లు **దాసుగణు** కానా భిల్లుని అనుచరులకు దొరికినా దయతలచి వదిలేస్తారు. ఈ మధ్యకాలంలో జరిగిన అనేక సంఘటనల ద్వారా దాసుగణు ఉద్యోగాన్ని వదిలి బాబా సేవలో స్థిరపడాలని ఆలోచిస్తూ వుంటాడు. బాబా కూడ అదేవిధంగా ఆదేశిస్తాడు. కాని ఎలాగైనా గజదొంగను పట్టుకుని ప్రభుత్వానికి అప్పగిస్తే తనకు ఉద్యోగంలో ప్రమోషన్ వస్తుందని, ఆ అధికారాన్ని కొంతకాలం అనుభవించిన తరువాత రాజీనామా చేసి బాబా సేవకు అంకితం కావాలని అతని అభిప్రాయం. అందువలన అదే ప్రయత్నంలో వుండగా మూడవసారి కానా భిల్లుడికి దొరికిపోగా ఈసారి ఖచ్చితంగా దాసుగణును చంపాలనే వాళ్ళు నిర్ణయిస్తారు. ఈసారి తన మరణం తప్పదని దాసుగణు కూడా భయపడి బాబాను ప్రార్థిస్తాడు. ఈ ప్రాణగండం నుంచి బ్రతికి బయటపడితే ఉద్యోగాన్ని వదిలి తప్పక నీ సేవలో అంకితమౌతానని మరీ మొక్కుకుంటాడు. అనుహ్యామైన రీతిలో ఈసారి కూడ కానా భిల్లుడు దయతలచి అతనిని వదిలేస్తాడు. ఆ తరువాత కొంతకాలం ఉద్యోగంలో వుండి చివరకు 1903లో ఉద్యోగ విరమణ చేస్తాడు.

1893 నుంచి క్రమంగా బలపడుతూ వచ్చిన బాబా యందు భక్తి 1903లో ఉద్యోగవిరమణ చేసే నాటికి బలపడుతుంది. ఈ పది సంవత్సరాల కాలంలో వీలున్నప్పుడల్లా బాబా దగ్గరకు వస్తూ పోతూ వుంటాడు. మానసికంగాను, వుద్యోగంలోను అనేక మార్పులను తెస్తాడు బాబా. నావాడిని సప్త సముద్రాలకు అవతలవున్నా పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు షిరిడికి లాగుతాను అనే బాబా మాటలు దాసుగణు జీవితంలో నిజమౌతాయి. 1903 తరువాత దాసుగణు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలలో తన హరికథల ద్వారా బాబా యొక్క లీలలను ప్రచారం చేస్తాడు. తాను ఎక్కడికి వెళ్ళినా బాబా యొక్క పెద్ద ఫోటోను దగ్గర పెట్టుకుని వుండేవాడు. నాలుగైదు గంటలకు పైగా సాగే ఈయన హరికథలు వినటానికి గాను రెండు వేల వరకు జనం గుమికూడుతూ వుండేవారు. అదేవిధంగా నానా చందోర్కరు తన ఉపన్యాసాల ద్వారా బాబా భక్తిని ప్రచారం చేస్తూ వుండేవాడు.

మైనతాయి కథ

అది 1904వ సంవత్సరం నానా చందోర్కరు షిరిడికి 100 మైళ్ళ దూరంలో గల జామ్నేరు అనే వూరిలో ఉద్యోగము చేయుచుండెను. ఆయన కుమార్తె మైనతాయి ప్రసవవేదన పొందుచుండెను. అది సామాన్యమైన కాన్పుగా లేదు. ఆమె రెండు రోజులు ప్రసవవేదనపడెను. నానా ఉద్యోగహోదాలో వున్నందువలన ఘన వైద్యులు యింటి వద్దకే వచ్చి వైద్య సహాయాన్ని అందించారు. అయినను లాభంలేక పోయెను. మైనతాయి యొక్క ప్రసవవేదనకు అందరూ నిస్సహాయులై చూచుచుండిరి. అప్పుడు నానా కూడా నిస్సహాయుడై బాబాను ప్రార్థించెను. అదే సమయంలో షిరిడిలో గల బాపుగిరి బావు అనే సన్యాసి బాబాకు నమస్కరించి యింటికి వెళ్ళుటకు అనుమతిని కోరతాడు. బాబా అతనికి అనుమతిని యిచ్చి ఆశీర్వదిస్తూ దారిలో జామ్నేరుకు వెళ్ళి తానిచ్చే విభూదిని, ఆరతి పాటను నానా చందోర్కరుకు యిచ్చి వెళ్ళమని చెపుతాడు. అందుకు బాపుగిరి సందేహిస్తూ తన వద్ద తగినంత సొమ్ము లేదని చెపుతాడు. అన్ని ఏర్పాట్లు జరుగుతాయి వెంటనే బయలుదేరమని బాబా ఆదేశిస్తాడు. యితనిని బాబామాత్రమే. "రాంగిరి భావు" అని పిలిచేవారు.

సాయి యందు పూర్తి విశ్వాసం కలవాడు గనుక వెంటనే బయలుదేరతాడు. "బాపుగిరి". రాత్రి ఒంటిగంట ప్రాంతంలో జల్‌గాం అనే స్టేషన్‌లో రైలు దిగుతాడు.

తన వద్దగల డబ్బులు అక్కడి వరకే సరిపోతాయి. అక్కడి నుంచి టాంగాపై 30 మైళ్ళు ప్రయాణం. రైలు దిగిన ప్రయాణీకులు చక చకా వారి వారి వూళ్ళకు టాంగాలలో వెళ్ళిపోతూ వుంటారు. చేతిలో సొమ్ములేక ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో చతికిలపడి కూర్చుని సాయిని ప్రార్థిస్తూ వుండగా షిరిడి నుంచి వచ్చిన "రాంగిరి భాపు" ఎవరూ అని విచారిస్తూ వస్తూ వుంటాడు ఒక ఆజానుబాహుడైన వ్యక్తి. ఆ మాటలు విని ఆనందంతో ఆ వ్యక్తిని కలిసి అతను తెచ్చిన సరికొత్త టాంగాలో ఎక్కుతాడు. ఆ టాంగాను మీ కొరకు నానా చందోర్కరు గారు పంపించారని టాంగా వాలా చెపుతాడు. టాంగా వేగంగా నడుస్తూ ముందు వెళ్ళిన వాటినన్నిటినీ దాటి వెళుతూ వుండగా దారిలో ఒక కాలువ గట్టున టాంగా ఆపి శ్రీవారు తమకని ఫలహారములు కూడ పంపినారు అని ఫలహారపు పొట్లాన్ని బాపుగిరికి యిస్తాడు. ఫలహారము తిని కాలువలో నీరు త్రాగిన తరువాత మళ్ళీ ప్రయాణం సాగుతుంది. తెల్లవారు ఝామున టాంగా జామ్నేరుకు చేరుకోబోతుండగా బాపుగిరి బండి దిగి లఘుశంకకు ప్రక్కగా వెళతాడు. తిరిగి వచ్చేటప్పటికి బండి కనిపించదు. కనుచూపు మేరలో ఎటు చూసినా బండి కనిపించదు. కొద్ది క్షణాల ముందు వరకు యిక్కడే వున్న బండి ఏమైనదా అని ఆశ్చర్యపడతాడు. వూరిలోకి వెళ్ళి విచారించి నానా చందోర్కరు యిల్లు తెలుసుకుని వెళ్ళి బాబా యిచ్చిన విభూదిని, ఆరతి పాటను యిస్తాడు. తెల్లవార్లు నిద్రలేక అలసిపోయి వున్న వారంతా ఆశతో బాబా విభూదిని నీటిలో వేసి త్రాగించి ఆరతిపాడుతూ వుండగానే మైనతాయి మగ బిడ్డను ప్రసవిస్తుంది.

బాబా యొక్క కరుణా పూరితమైన ఈ లీల యొక్క ఆనందాన్ని స్వయంగా అనుభవించిన వారంతా భగవాన్ శ్రీ సాయినాథ్‌కీ జై అంటూ హర్షాతిరేకంతో జై జై ధ్వానాలు చేస్తారు. అప్పుడు నానా బాపుగిరి దగ్గరకు వచ్చి జరిగిన విషయమంతా తెలుసుకుని తనకు టాంగాలేదని, ఎవరినీ జలగాం స్టేషన్‌కు పంపలేదని, మీరు వస్తున్నట్లు కూడ నాకు తెలియదని చెపుతాడు. అప్పుడు బాపుగిరి బాబా తప్ప తనను యింకెవరు "రాంగిరి భావు" అని పిలవరు. టాంగావాలా నన్ను అదే పేరుతో పిలిచాడు. బయలుదేరేటప్పుడు అన్ని ఏర్పాట్లు జరుగుతాయని బాబా చెప్పారు. కాబట్టి ఈ లీలలో బాబానే స్వయంగా తానే గుర్రమై, బండిగా అయి, టాంగా తోలేవానిగా మారి నన్ను జలగాం నుంచి యిక్కడికి చేర్చారని బాబా ప్రేమను తలచుకుని

పరవశించగా ఆ ఆనందాతిశయంలో పులకాంకితుడౌతాడు. నా బిడ్డను రక్షించటం కోసం యిన్ని కష్టాలుపడి యిన్ని రూపాలుగా మారిన సాయి ప్రేమను వూహించున్న నానా చందోర్కరుతోపాటుగా ఆ చమత్కారాన్ని తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల వాళ్ళు కూడ సాయి యందు మనసు లగ్నం చేసి సాయి యొక్క పరిపూర్ణ భక్తులైయ్యారు.

"నేను ఈ ప్రపంచమంతా వ్యాపించి వున్నాను. నేను రావటానికి టాంగాగాని, బండిగాని, మరి ఏ యితరమైన సాధనాలు గాని అవసరంలేదు. నా భక్తుడు, ఎప్పుడు తలచి, పిలచినా అప్పుడే ఆ ప్రక్కనే వుండగలను" అన్న బాబా సూక్తులకు పైచమత్కారం చక్కగా సరిపోతున్నది.

బాబాయే అక్కల్ కోట మహారాజ్

సమర్థ అక్కల్ కోట మహారాజ్ 1876లో అక్కల్ కోట అనే గ్రామంలో సమాధి అయ్యెను. ఈ స్వామి భక్తుడొకరు 1904లో అక్కల్ కోటకు పోవాలని నిర్ణయించుకొని ప్రయాణ ఏర్పాట్లకు సిద్ధమౌతూ వుండగా ఒకనాటి రాత్రి కలలో అక్కల్‌కోట స్వామి దర్శనం యిచ్చి నీవు అక్కల్ కోటకు రావలసిన అవసరం లేదు. ప్రస్తుతం నా అవతారం షిరిడిలోనే వున్నది. అక్కడి సాయిబాబా నేనే అని చెపుతారు. ఆ తరువాత ఆ భక్తుడు షిరిడికి వచ్చి బాబాను దర్శించినప్పుడు సాయి వానిని ఆశీర్వదించి అక్కల్ కోటలోనున్నవాడే యిక్కడ వున్నాడు అంటాడు.

సాయి ఒక్క అక్కల్ కోట మహారాజ్ మాత్రమే కాదు. ఆయన సర్వదేవతా స్వరూపుడు, రాముడుగా, కృష్ణుడుగా, మారుతిగా, దత్తునిగా గణపతిగా ఎందరెందరికో దర్శనమిచ్చి ఆశీర్వదించారు.

సకలా దేవతా స్వరూపుడు. సర్వజన రక్షకుడు సర్వ సమర్థుడు అయిన సాయికి సాష్టాంగ ప్రణామములాచరిస్తూ ఈ పారాయణ పూర్తి అయ్యేలోపుగా మనకు కూడ ఒకసారి దర్శనమిచ్చి కరుణించమని, తనపై భక్తిని పెంచమని, ప్రపంచ వ్యామోహములను తగ్గించమని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

పదవ అధ్యాయం సంపూర్ణం

పదకొండవ అధ్యాయము

1896లో కొపర్గాం సర్కిల్ రెవెన్యూ యిన్స్పెక్టరుగా "గోపాలరావు గుండు" అనునతడుండెను. అతను సంతానము కొరకు ముగ్గురు భార్యలను వివాహమాడెను. కాని పాపం సంతానం కలగలేదు. సాయినాధుని ఆశీస్సులు పొందిన తరువాత సంతాన ప్రాప్తి కలిగెను. సాయికి కృతజ్ఞతగా ప్రతి ఏటా బాబాకు ఉర్సు వుత్సవము జరిపించిన బాగుండునని సంకల్పించెను. బాబా అందుకు అనుమతించి ఆశీర్వదించుటచే బాబా ఉర్సు శ్రీ రామనవమినాడు జరుపుటకు నిశ్చయించబడెను.

ఉర్సు - శ్రీరామనవమి ఉత్సవములు

1897లో మొదటిసారి శ్రీ రామనవమినాడు ఉర్సు-ఉత్సవము షిరిడిలో ప్రారంభించబడినది. ఈ ఉత్సవముతోపాటుగా మహమ్మదీయుల చందనపు ఉత్సవం కూడ ప్రారంభించబడినది. 'కొరాహ' అను వూరిలో గల బాబా యొక్క ముస్లిం భక్తుడు అమీర్‌షక్కర్ అనునాతడు ఈ చందనము ఉత్సవము చేయించేవాడు. పెద్ద పళ్ళెములో మంచి గంధపుపొడిని నింపి అగరువత్తుల ధూపములతో మేళతాళములతో వూరేగించుకొని వచ్చి ద్వారకామాయి గోడలపై ఈ గంధమును చేతులతో అద్దుతారు.

ఈ చందనోత్సవముతో పాటే శ్రీ రామనవమి ఉత్సవములో పెద్ద జరీ అంచుగల పట్టు బట్టలతో నిర్మించబడిన రెండు జెండాలను ఊరేగింపులో తీసుకుని వచ్చి మసీదుకి యిరుప్రక్కల ప్రతిష్టించేవారు. అలా ప్రారంభమైన ఆ ఉత్సవము 1912లో శ్రీ కృష్ణారావు జగేశ్వర్ భీష్మ యొక్క ప్రేరణతో సంపూర్ణ శ్రీరామనవమి ఉత్సవముగా రూపు దిద్దుకొనెను. హరి కథాగానాలు, ఊయల కట్టుట, గులాల్ పొడి చల్లు కొనుట మొదలగు కార్యక్రమాలు జరిగెడివి. మరుసటి రోజు ఉట్టి కొట్టుట కూడ వుండెడిది. సూదంటు రాయివలె బాబా ప్రతి మనిషిని ఆకర్షిస్తూ ఆశీర్వదిస్తూ సాయిరామునివలె భక్తుల మధ్య కదులుతూ వుంటే ఆనాటి శ్రీ రాముడే ఈ రూపంలో మళ్ళీ భూమిపై ధర్మస్థాపన అవతారంగా వెలిశాడా అన్నట్లుగా వుండేదట. గులాల్ పొడి కళ్ళల్లో పడినప్పుడు బాబా బిగ్గరగా కోపంతో అరచేవాడు. ఆ కోపపు అరుపులు మానవజాతిని అవరించియున్న దుష్ట రావణ స్వభావాలపై గాని వేరుకాదు.

ఆ తరువాత గోపాలరావు గుండు మసీదును మరమ్మతులు చేయించి ద్వారకామాయిలో బండరాళ్ళను వేయించాలని నిర్ణయించెను. కాని బాబా ఆ రాళ్ళను గ్రామములో హిందూ దేవాలయ మరమ్మతుల కిప్పించెను.

వాసు దేవానంద సరస్వతి

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సమీపమున గల ఒక తపోవనములో మహా మహిమాన్వితుడైన సిద్ధ పురుషుడగు వాసు దేవానంద యోగేంద్రుడుండెడి వాడు. ఈయన దర్శనమునకు వేలకొలది భక్తులు వెళుతూ వుండేవారు. నాందేడ్ నివాసియైన దాసుగణు మరి నలుగురితో కలిసి వీరి వద్దకు వెళతాడు. అప్పుడు ఆ యోగీంద్రుడు షిరిడి పేరు, సాయిబాబా పేరు వినగానే పులకాంకితుడై, ధ్యానమగ్నుడై "బిడ్డలారా షిరిడి యందు నా పెద్ద అన్న కలడు కదా ! ఆ మహాత్ముని దర్శింపక నన్నేల చూడవచ్చితిరి. సాయినాధుడు ముసల్మానుడని ప్రజలు అనుకొనుచున్నను వారు నాకు అగ్రజులు. నా నమస్కారములతో ఈ నారికేళమును వారికి సమర్పింపుడు" అని కొబ్బరికాయను యిస్తాడు. వారు తిరిగి నాందేడ్ చేరి పదిహేను రోజుల తరువాత షిరిడికి ప్రయాణమై మన్మాడు చేరిన తరువాత కోపరగాం వైపు పోవు రైలు ఆలశ్యమగుటచే ప్రక్కనేగల వాగు దగ్గరకు చేరి వారి దగ్గరగల వేఇంచిన అటుకులలో కారము ఎక్కువగా వుండటచే వాసుదేవానంద సరస్వతి యిచ్చిన కొబ్బరికాయను కొట్టుకుని కొబ్బరిని తురిమి అటుకులతో కలిపితింటారు. పూర్తిగా తిన్న తరువాత ఆ కాయను బాబా కొరకు వారిచ్చారని గుర్తుకు వస్తుంది. భయపడతారు.

షిరిడికి చేరగానే బాబా గుణూను పిలిచి ప్రేమతో నా తమ్ముడిచ్చిన నారికేళమేది ? అని అడుగుతాడు. ఆశ్చర్యాన్ని పొందిన దాసుగణూ జరిగిన పొరపాటును చెప్పి క్షమించమని ప్రార్థిస్తూ యింకో కొబ్బరికాయను తెచ్చి యివ్వటానికి లేవబోతూ వుండగా సాయి వారించి "బిడ్డా పోవలదు. నీవు తెచ్చే నారికేళం నా సోదరుడు యిచ్చిన దానితో సరితూగగలదా. కానిమ్ము మీరు నా బిడ్డలే కదా ! నా ధనమంతా మీదే". మీపై నాకు ఎలాంటి కోపము లేదంటూ ఆశీర్వదిస్తారు.

దీక్షిత్ వాడా

1909లో కాకా సాహెబ్ దీక్షిత్ సాయి మహిమలు విని ప్రేరితుడై మొదటిసారిగా షిరిడి వస్తాడు. ఇంగ్లాండులో వుండగా రైలు ప్రమాదంలో కాలుపోయిన

దీక్షిత్ బాబా తన మహిమ ద్వారా కుంటితనాన్ని పోగొడతాడేమోనసే ఆశతోనే వస్తాడు. కాని షిరిడి చేరి సాయిని దర్శించగానే కాలు కుంటితనం కన్నా మనసులో గల కుంటి భావాలను తొలగించమని ప్రార్థిస్తాడు.

బాబా మహిమలను స్వయంగా చూసి షిరిడిలోనే స్థిర నివాసముండాలనే ఆలోచనతో గురుస్థాన్‌కు ఉత్తరము వైపున గల కొంతస్థలాన్ని కొని ఒక వసతి నిర్మించుకుంటాడు. పై అంతస్థు తన కొరకు వుంచుకుని క్రింది భాగాన్ని బాబా కోసం వచ్చే భక్తులకు కేటాయిస్తాడు. దీనిని దీక్షిత్ వాడా అని పిలిచేవారు. దీనిని ప్రస్తుతం చాలా వరకు కుదించి సంస్థానం వారు దీనిలో కాఫీ, టీలు విక్రయిస్తున్నారు.

బాలాసాహెబ్ మిరీకర్

బాలా సాహెబ్ మిరీకర్ ఒక సమయంలో కోపర్‌గాంకు తాహసీల్‌దారుగా వుంటాడు. ఈయన చితలీ అనే గ్రామానికి వెళుతూ దారిలో సాయిని దర్శించి వెళదామని వస్తాడు. మసీదులోకి వెళ్ళి బాబాకు నమస్కరించి ప్రక్కనే కూర్చుంటాడు. అప్పుడు బాబా "నీవు యిపుడు కూర్చున్నది ద్వారకామాయి. ఈ మసీదు తల్లి చాలా దయార్ద్ర హృదయురాలు. ఆమె నిరాడంబర భక్తులకు కన్న తల్లి కంటే మిన్న. ఆమె తొడపై కూర్చున్న నిజ భక్తులను కష్టములనుండి, ఆదుర్దాల నుండి తప్పించును. ఎవరు ఆమె నీడను ఆశ్రయిస్తారో వారి కష్టములన్నీ తొలగిపోవును. నీకు పొడుగాటి బాబా తెలియునా" అంటూ చేతిని పాము పడగవలె పెట్టి చూపి అది మిక్కలి భయంకరమైనది. కాని ద్వారకామాయి తన బిడ్డలను రక్షిస్తూ వుండగా ఆ సర్పము నిన్నేమీ చేయలేదు అంటాడు.

కొంత సేపటికి బాబాసాహెబ్ మసీదులో నుంచి లేచి బయలుదేరబోతూ వుండగా బాబా శ్యామాను పిలిచి బాలా సాహెబ్‌తో చితలీకి వెళ్ళమని ఆదేశిస్తాడు. కాని బాలాసాహెబ్ అందుకు అంగీకరించడు. బాబా యిట్లా అంటాడు "అతని మంచిని మనం కోరాము. బ్రహ్మదేవుడు నొసట వ్రాసిన దానిని ఎవరు తప్పించగలరు? ఆఖరికి శ్యామా తనతో రావటానికి మిరీకర్ అంగీకరిస్తాడు.

రాత్రి 9 గంటల ప్రాంతంలో చితలీకి దగ్గరలో గల ఆంజనేయాలయంలో బస చేస్తారు. వార్తా పత్రిక చదువుకుంటు వుండగా ఆయన అంగవస్త్రంపై ఒక పాము ఎక్కి నిలబడి వుండటాన్ని శ్యామా గమనిస్తాడు. బాలా సాహెబ్ భయపడతాడు.

కొంతసేపటికి నడుం నుంచి సర్పం క్రిందికి పాకి దిగిపోతుంది. అప్పుడు చుట్టుప్రక్కల వాళ్ళు పోగై ఆ పామును చంపుతారు. మిరీకర్‌కు జరగబోయే ఈ పాము గండాన్ని ముందుగానే వూహించి అభయమిచ్చాడు బాబా. అంతేకాకుండా తన రక్షణగా శ్యామాను కూడ వెంట పంపాడు. ఈ కథ ద్వారా మనం గ్రహించవలసిన నీతి.

మనం బాబాను ప్రార్థించి రక్షణ కోరినప్పుడు మనకు రాబోయే కష్టనష్టాలను బాధలను ముందుగానే తెలుసుకుని తగిన రక్షణను, ఆశీర్వాదాన్ని మనకు అందించి తన మహిమాన్వితమైన శక్తి ద్వారా వాటి ప్రభావాన్ని చాల వరకు తగ్గిస్తాడు. కర్మ ఫలం బలీయమైనది కాబట్టి కేవలం నామమాత్రంగానే వాటిని మనచేత అనుభవింపచేస్తాడు. ఈ కథలో బాలా సాహెబ్ మీర్‌కర్‌కు మామూలుగా పాము గండం వుండి వుండవచ్చును. అయితే బాబా యొక్క అమోఘమైన వాక్కుల ఫలితంగా ఆ పాము ఆయన పైకి ఎక్క గలిగినా ఏమి చేయలేకపోయింది. కాబట్టి సాయిని మనం నమ్ముకున్న తరువాత మనకేవో మహిమలు, ఆశ్చర్యాలు, అద్భుతాలు జరగలేదని కొందరు భావిస్తూ వుంటారు. సాయి మాకు ఏమీ చేయలేదని భావిస్తూ వుంటారు. కాని సాయి మనకు రాబోయే కష్టాలను చూడగలడు కాబట్టి వాటి నివారణకు ప్రయత్నిస్తాడు. ఎనిమిదవ అధ్యాయంలో శ్యామాను పాము కరచిన కథలో కూడ శ్యామా వచ్చి బాబాకు విషయాన్ని చెప్పేకాలాన్ని కూడ వృధా చేయకుండా పాము విషాన్ని దిగిపొమ్మని బాబా ఆదేశించారు కదా!

ఈ కథలలోని విశేషాలను బట్టి బాబా యొక్క మాతృప్రేమ తన భక్తుల రక్షణ కొరకు ఎలా ఉపయోగిస్తారో పాఠకులు వూహించుకోవచ్చును.

గురువు యొక్క అవసరం

ఏ యుగములోనైనా గురువు యొక్క అవసరం ఆధ్యాత్మికంగా చాలా ఉంటుంది. దైవ స్వరూపులైన శ్రీ రాముడు, శ్రీ కృష్ణుడు కూడ గురువుల వద్ద విద్య నార్జించక తప్పలేదు. ఎంత వున్నత కులస్థుడైనా, ధనవంతుడైనా, గుణవంతుడైనా బలవంతుడైనా, పండితుడైనా ఆధ్యాత్మికంగా గురువు లేకపోతే ముందుకు సాగలేడు. కేవలం పుస్తక జ్ఞానంవలన దైవాన్ని పొందేదారి దొరకదు. మనకు తెలియని అడవి దారిలో మార్గదర్శకునివలె సద్గురువు మనకు ఉపయోగపడతాడు. ఈ విషయాన్ని

సాయి మాటలలోనే తెలుసుకుందాము. ఒకసారి దీక్షిత్ బాబా దగ్గరకు వచ్చి షిరిడి నుంచి వెళ్ళవచ్చునా అని అడిగెను. బాబా వెళ్ళుమని జవాబిచ్చెను. ప్రక్కనే ఎవరో ఎక్కడికి అని ప్రశ్నించిరి. అప్పుడు బాబా "చాలా పైకి ప్రయాణము, అక్కడకు చేరుటకు అనేక మార్గములు కలవు. షిరిడి నుంచి కూడ ఒక మార్గం వున్నది. ఈ మార్గములో ప్రయాణము కష్టతరమైనది. దారిలోని అడవిలో పులులు, తోడేళ్ళు, కలవు. మార్గదర్శకుని వెంట తీసుకుని పోయినచో అతడు తిన్నగా గమ్యస్థానమును చేర్చును. పులుల, క్రూర జంతువుల, గోతులబారి నుంచి తప్పించును. మార్గ దర్శకుడే లేనిచో అడవిలోని క్రూర మృగములచే చంపబడవచ్చును. లేదా దారి తప్పి గుంటలలో పడిపోవచ్చును. పరమార్థము కేవలం గురుబోధవలననే చిక్కును."

బాబా యొక్క ఈ బోధనలలోని సారాంశం. సంసారమనే ఈ జీవితచక్రం దారి తెలియని కీకారణ్యంలాంటిది. ఈర్ష్య, స్వార్థం, అసూయ అనే క్రూర జంతువులు ఈ అడవిలో పొంచి వుంటాయి. ఏ క్షణాన్న వాటికి మనం బలి అవుతామో తెలియదు. ఈ దుర్గుణాలకు దూరంగా వుంటూ ప్రయాణం ముందుకు సాగాలంటే సద్గురు సహాయం చాలా అవసరం.

కేవలం భౌతిక వాదంలో పూర్తిగా యిరుక్కుపోయి ధనానికి, సుఖాలకే పరిమితమైన ఈనాటి మానవులందరినీ జ్ఞాన మార్గానికి మార్చి ముక్తి దారిని చూపించటానికి కైలాసాన్ని వదలి వచ్చిన పరమశివుని గురు రూపమే షిరిడి సాయిబాబా. ఈ సద్గురుని పొందటానికి పెద్ద కష్టపడాల్సిన పనిలేదు. నీవు నావైపు చూస్తే చాలు నేను నీ వైపు చూస్తానన్నాడు. నీవు నా వైపు ఒక అడుగువేస్తే చాలు నేను నీ వైపు పది అడుగులు నడచి నీ ముందుకు వస్తానన్నాడు. నా సలహాగాని, సహాయాన్ని గాని కోరిన తక్షణమే నీకు యిస్తానని వాగ్దానం చేశాడు. శరీరాన్ని వదిలిన తరువాత కూడ మన కోసం యింకా ఈ భూమిమీదే గురు రూపంలో నిలచిపోయాడు శ్రీ షిరిడి సాయిబాబా. అలాంటి ఆ మహనీయుని పాఠకులైన సాయి భక్తులంతా ఈ క్షణాన్నుంచే తమ సద్గురువుగా భావించండి. ఈ సద్గురువు సర్వ దేవతా స్వరూపుడు. ఈయనే సృష్టి స్థితిలయ కారకుడు. ఈ సమర్థుడైన సద్గురువు పాదాలపై మన ధన, మాన, ప్రాణాలను సమర్పించి ఈ మానవజన్మను చరితార్థం చేసుకుందాం.

దాసుగణు గంగాస్నానం

అది 1905వ సంవత్సరము. శివరాత్రినాడు దాసుగణు దగ్గరలోగల గోదావరి తీరానికి వెళ్ళి స్నానం చేయాలని నిర్ణయించుకుని. బాబాను అనుమతి కోరగా ఆయన నీవు అంత దూరము పోనేల, నా పాదాలచెంత గంగలేదా ? అని వారిస్తాడు. బాబా సాక్షాత్తు శివస్వరూపుడని గంగాదేవి వారిని ఆశ్రయించి వుంటుందని కూడ గణుకు తెలుసు. అయినా నదిలో స్నానం చేసినట్లుగా అవుతుందా అని సందేహిస్తాడు. అతని మనోభావాన్ని గ్రహించిన బాబా తన పాదాలచెంత దోసిలి పట్టమనగా దాసుగణు దోసిలి నిండా బాబా పాదాల బొటనవ్రేళ్ళ నుంచి పవిత్ర గంగాజలం సన్నని ధారగా వస్తుంది. అప్పుడు అతని ఆనందానికి అంతులేక ఆ జలాన్ని శిరస్సుపై జల్లుకుని గంగా స్నానంచేసిన సంతృప్తిని పొందుతాడు.

ఈశావాస్యోపనిషత్తు

దాసుగణు ఈశావాస్యోపనిషత్తు యొక్క సారాంశమును గ్రహించలేకపోయి ఎంతో మందిని ఆశ్రయించగా వారు కూడ ఆయనకు అర్థమయ్యే విధంగా సారాంశాన్ని సరిగా అన్వయించి చెప్పలేకపోతారు. ఈ విషయంలో బాబా యొక్క సహాయాన్ని అర్థించాలని నిర్ణయించుకుని షిరిడికి వెళ్ళి బాబాను అడుగుతాడు. సాయి అతనిని ఆశీర్వదించి. "దీనిని గురించి నీవేమీ తొందరపడ వద్దు. నీ తిరుగు ప్రయాణంలో నీవు విల్లీపార్లేలోని కాకా సాహెబ్ దీక్షిత్ యింటికి వెళ్ళినప్పుడు అతని పనిపిల్ల ఈ నీ సందేహాన్ని తీర్చును" అని చెపుతాడు. గొప్ప గొప్ప పండితులకే అసాధ్యమైన ఈ పని భాష కూడ సరిగారాని ఆ పని పిల్లవల్ల అవుతుందా ? అని అక్కడి వారంతా సందేహించినా దాసుగణు మాత్రం బాబా వాక్కులను బ్రహ్మ వాక్కులుగానే విశ్వసించెను.

తిరుగు ప్రయాణంలో అతడు కాకా దీక్షిత్ యింట్లో బస చేసెను. వారి చిన్న పనిపిల్ల మధురంగా పాడుతూ చిరిగిపోయిన గుడ్డలను కట్టుకుని పాత్రలు తోము చుండెను. ఆమె నిరుపేద అయినా సంతోష భావంతో వుండటం చూసి దాసుగణు ఎంతో ఆనందిస్తాడు. తన మిత్రుడు ప్రధాన్ ద్వారా మంచి చీరను ఆమెకు బహూకరిస్తాడు. ఆ చీరకట్టుకుని ఆమె పరవశిస్తూ తోటి పిల్లలతో ఆడుతూ నాట్యం చేస్తుంది. మరునటి రోజు ఆ కొత్త చీరను పెట్టెలో దాచుకుని మామూలు చింకి గుడ్డలు కట్టుకున్నా నిన్న కొత్త చీరకట్టుకున్న ఆనందాన్ని అలాగే అనుభవిస్తూ

వుంటుంది. చింకి బట్టలు కట్టుకున్న విచారంగాని, నిరాశగాని ఆమెలో కనిపించవు. కాబట్టి కష్ట సుఖములు మన మనోభావాలపైననే వున్నవిగాని బాహ్యంగా బయటలేవు అనే ఈశావాస్యో పనిషత్తులోని రహస్యాన్ని సూక్ష్మంగా గ్రహించగలిగాడు దాసుగణు. "ఈశావాశ్యమిదం జగత్". ఈ జగుత్తులోని ప్రతి వస్తువు ఈశ్వరుని సృష్టే. అందులో నీమనోభావాన్ని బట్టి ఒకటి నీ దగ్గర వుంటే సుఖపడుతున్నావు. అది లేకపోతే బాధపడుతున్నావు. సుఖదుఃఖాల మూలం మనసు గాని ఈశ్వరుడు కాదు.

గౌతమ బుద్ధుడు కూడ బోధివృక్షం క్రింద పొందిన జ్ఞానం యిదే. మనస్సును జయించిన వాడికి సుఖ దుఃఖాలు అంటుకోవు. అతను నిత్యతృప్తుడు, నిత్య సంతోషి. అదే బ్రహ్మానంద స్థితి.

ప్రియమైన పాఠకులారా ! సాయి ఈనాడు శరీరంతో మన మధ్యనలేదు కదా ! మనకు ఎలా ఆయన జ్ఞానబోధ చేస్తాడు. అని మీరు సందేహించవలసిన పనిలేదు. పనిపిల్ల ద్వారా అనుభవ పూర్వకంగా దాసుగణుకు బోధించినట్లుగానే మనకు కూడ మనం చేసే పనుల ద్వారా, మన చుట్టూ వున్న మనుషుల ద్వారానే జ్ఞానాన్ని మనకు హత్తుకునేలా బాబా బోధిస్తాడు. దానిని సత్యదృష్టితో తెలుసుకునే సూక్ష్మబుద్ధి మనకు వుంటే చాలు. మనం సాయికి సర్వస్వశరణాగతులమైతే ఆ సూక్ష్మదృష్టిని కూడ ఆయనే ప్రసాదిస్తాడు.

మీరు చేసే ఈ పారాయణలో ఎప్పుడు, ఏ విషయాన్ని ఎలా ఎంత వరకు మీరు శ్రద్ధగా గ్రహిస్తున్నారో సాయి మీ ఎదురుగా వుండి గ్రహిస్తూనే వుంటాడు. బాబా యందు భక్తి, పారాయణలో శ్రద్ధ కుదిరినప్పుడు విషయం మనసులో చక్కగా ప్రవేశిస్తుంది. అప్పుడు తదనుగుణంగా బాబా తన లీలలను మీకు తప్పక చూపుతారు. కాబట్టి సాయి ప్రేమామృతాన్ని రుచి చూడాలంటే పైవిధంగా భక్తి శ్రద్ధలతో ఈ పారాయణ చేసి మీకు మీరుగా సాధించవలసినదే గాని యింకెవరో చేయగలిగిన సహాయం కాదు.

ఈ అధ్యాయాన్ని భక్తి శ్రద్ధలతో పారాయణ చేయు భక్తులకు దాసుగణుకు బోధించినట్లుగా జ్ఞాన రహస్యాలను కరతలామలకం చేయమని, అలాంటి వారి హృదయాలలో సాయి స్థిరనివాసియై వుండాలని, వారి గృహాలు సాయి నిలయాలుగా మారాలని కోరుతూ ఈ అధ్యాయాన్ని ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

పదకొండవ అధ్యాయం సంపూర్ణం.

పన్నెండవ అధ్యాయము

బాబా చేసే పనులు ఒక్కొక్కసారి అసాధ్యమైనవి గాను యింకొకసారి విచిత్రమైనవి గాను వుండేవి. ఎందుకు వారు అలా చేస్తారో ఎవరికి అర్థమయ్యేవికావు.

బాబా యొక్క వింతచర్యలు

ద్వారకామాయిలో ధునిని ప్రారంభించినతొలి రోజులలో అగ్గి పుల్లలను గీసి వేసిన తరువాత వాటిని కూడ జాగ్రత్తగ దాచుకునే వారు. భక్తి పూర్వకంగా తన దగ్గరకు వచ్చిన వారివద్ద నుంచి కాని, అర్థణా దక్షిణ పుచ్చుకునే వారు. బాబా తరచుగా చిలుంగొట్టం ఉపయోగించి పొగ పీల్చేవారు.

సన్నని బలహీనమైన గుడ్డపీలికను ఉపయోగించి 5 అడుగుల పొడవు 1 1/2 అడుగుల వెడల్పు నాలుగంగుళాల మందంగల చెక్క బల్లను ద్వారకామాయి మసీదు పైకప్పు దూలాలకు వేలాడ గట్టి చెక్కకు నాలుగు ప్రక్కలా దీపాలను వుంచి దానిపై బాబా పరుండేవాడు. చిరిగిపోయిన గుడ్డ పీలికలు బల్ల బరువునే మోయుట ఆశ్చర్యకరమైన విషయం. అలాంటప్పుడు బాబా బరువు ఎలా మోసేవో గొప్ప ఆశ్చర్యంగా అందరికీ అనిపించేది.

మధ్యాన్న సమయంలో, 1-2 గంటల మధ్యకాలంలో సాధారణంగా భక్తులనెవ్వరినీ మసీదులోనికి రానిచ్చేవారు కాదు. 15,20 పాత నాణాలను సంచిలో వేసుకుని వుంచుకున్న వాటిని ఆ సమయంలో బయటకు తీసి చేతివేళ్ళతో రుద్దు తున్నట్లుగా రాసేవారు. అలా ఒక్కొక్క నాణాన్ని రుద్దుతున్నపుడు యిది నానాది యిది కాకాది అని అంటూ వుండేవారు. బహుశ యిలా చేయటంవలన వారి యిహపరమైన కోరికలను తొలగించే వారేమో.

ప్రతిరోజు లెండీబాగ్‌లో మొక్కలకు నీళ్ళు పోసి మట్టికుండలను బోర్లించి పెట్టేవారు. ఒకసారి "కొలంబి" అనే అతను బాబా యొక్క ఈ పిచ్చి చర్యలు ఏమిటో అని భావించి అదే విషయం స్వయంగా అడుగుతాడు. తన దగ్గరకు వచ్చే వారందరూ బోర్లించిన కుండలవలెనే అధోగతులై వస్తున్నారు. నేను ఏమి యిచ్చినా వారు దానిని భద్రంగా తీసుకోలేకపోతున్నారని చెబుతాడు.

బాబా యొక్క ఋతంభర ప్రజ్ఞ

బాబా తరచుగా భక్తులతో యిలా అంటూ వుండేవాడు. మీరు నా ఎదురుగా వున్నా, లేక ఎంత దూరములో వున్నా, ఏమి చేయుచున్నా, మనసులో మీరు ఏమి అనుకున్నా అన్నీ నాకు తెలియుచునే వుండును. అదే విధంగా వారు తన దగ్గరకు వచ్చిన భక్తుల యొక్క భూతభవిష్యత్ వర్తమానములన్నీ చెబుతూ వుండేవాడు. దీనిని యోగశాస్త్రంలో ఋతంభర ప్రజ్ఞ అంటారు. యిది చాలామంది యోగీశ్వరులలో పరిమితంగా వుంటుంది. కాని బాబాయొక్క ఈ శక్తి అపరిమితమైనది. అనంతమైనది, అనూహ్యమైనది.

బాబా ఒక్కోసారి కొందరు చనిపోయినవారిని బ్రతికిస్తూ వుండేవాడు. కొందరిని మాత్రం బ్రతికించేవాడు కాదు. ఒకనాడు ఒకామె యొక్క చిన్న బిడ్డ చనిపోగా బాబా దగ్గరకు వచ్చి వూధీని ప్రసాదించమని ప్రార్థిస్తుంది. ఆమె ఎంత ప్రార్థించినా బాబా విభూది యివ్వడు. కాకా దీక్షిత్ ఈ విషయంలో కల్పించుకోగా భావ్! నీవీ విషయంలో కల్పించుకో వద్దు. జరిగినది మంచికే జరిగినది. ఆ బాలుడు అప్పుడే వేరొక శరీరంలో జన్మించాడు. ఆ శరీరంలో అతడు అనేక మంచి పనులు చేస్తాడు. యిప్పుడు నేను అతనిని యిక్కడకు తీసుకువస్తే ఆ నూతన దేహం చెడిపోతుంది. ఈ శరీరం నిలబడుతుంది నీ కోసం నేనీ పనిని చేస్తే నీవు దాని బాధ్యతను వహించగలవా? అని ప్రశ్నిస్తాడు.

ఎవరైనా బాబాను ఏ విషయంపై ప్రశ్నించినా వెంటనే సమాధానం యిస్తూ వుండేవాడు. సమాధానం కాకతాళీయంగా యిచ్చినట్లుగా మనకు అనిపించినా ఆ వాక్కు నిత్య సత్యంగా మారేది. వారు కంటితో మనవలె చూస్తూ, నోటితో మనవలె మాట్లాడుతూ వున్నా ప్రతి క్షణం సమాధి స్థితిలోనే వుండేవారు. వారు హనుమంతునివలె అస్కలిత బ్రహ్మచారులు. కామము వారిదరిదాపులకు కూడ ఎప్పుడూ ప్రవేశించలేదు. వారి కళ్ళు అగ్ని దీపికలుగా వుండి ఎదుటి వారి హృదయాంతరాలాలలోకి చొచ్చుకుపోయే వెదకు దీపముల (Search Lights) వలె వుండెడివి.

బాబా నానాను రక్షించుట

బాబా తనను నమ్మిన భక్తులను ఎప్పుడూ కనిపెట్టుకుని యుండును. ఒకనాడు చంద్రోర్కరు, ఆయన స్నేహితుడు శాస్త్రి యిద్దరూ టాంగామీద పూనా నుండి ప్రయాణము చేయుచుండగా వున్నట్టుండి గుఱ్ఱము బండిని వెనుకకు త్రోయుటవలన బండి తల్లక్రిందులుగా పడినది. యిద్దరు క్రిందపడిరి. అది అతి ప్రమాదకరమైన సంఘటన. సాధారణంగా ప్రాణాపాయము కూడ జరగవలసినది. ఆ సమయంలోనే షిరిడిలో బాబా తన రెండు చేతులను శంఖంలాగా బిగపట్టి బయ్-బయ్ అని శంఖధ్వని చేసెను. అది అపాయము కలుగుచున్నదనుటకు చిహ్నము. ఆ తరువాత బాబా "అరే నానా కూలిపోబోతున్నాడు. నేను అతనిని కూలనిచ్చెదనా." అని బిగ్గరగా అరుస్తాడు. బాబా యొక్క ఈ లీల వలన పూనాలోని వారిద్దరూ ఏ విధమైన అపకారం జరుగకుండా ప్రయాణాన్ని ముగించుకుని తిరిగివస్తారు.

ఒకనాడు నానా చందోర్కరు హరిశ్చంద్ర పర్వతముపైగల ఒక దేవాలయమును చూచుటకుగాను దానిని ఎక్కుచున్నాడు. తోడుగా ఒక స్నేహితుడు యిద్దరు నౌకర్లు కూడ వున్నారు. కొంత దూరం ఎక్కేసరికి ఎండ తీవ్రతవలన బాగా దాహం వేస్తుందాయనకు. అలసిపోయి ఒకచోట విశ్రమిస్తాడు. ఆ ప్రాంతంలో త్రాగటానికి నీరుకూడ లభించదు. నీరు త్రాగటానికి క్రిందకైనా దిగి వెళ్ళాలి, లేదా పైకన్నా ఎక్కాలి. చందోర్కరుకు బాబా గుర్తుకు వస్తాడు. సాయిబాబా గాని యిక్కడవుంటే ఎలా అయినాసరే మంచినీరు త్రాగటానికి యిచ్చేవారు అని అంటాడు. సాయిబాబా యిక్కడెక్కడ వున్నాడు 80 మైళ్ళ దూరంలో షిరిడిలో వున్నాడని స్నేహితుడంటాడు. ఆ సమయంలో షిరిడిలోని ద్వారకామాయిలోగల శ్యామా మరికొందరు భక్తులతో బాబా యిలా అంటాడు. "నానా చాలా దప్పికగా వున్నాడు. ఎండ ఎక్కువగా వున్నది. అలసిపోయి వున్నాడు. యిప్పుడు అతనికి కొంచెమైన నీరు యివ్వాలి". వారికి బాబా యొక్క ఈ మాటల అర్ధం తెలియదు.

నానా కొంతసేపు మౌనంగా కూర్చుంటాడు. ఆ కొండపైకి ఒక భిల్లుడు వస్తాడు. నానా దగ్గరకు సమీపించి మీకుగాని దాహంగా వుంటే త్రాగే నీరు మీరు కూర్చున్న బండ క్రిందే వున్నదని చెబుతాడు. ఆ రాతిని తొలగించి చూడగా స్వచ్ఛమైన జలం వుంటుంది. దానిని త్రాగి నానా తన దాహం తీర్చుకుంటాడు. ఆ

తరువాత షిరిడిలో బాబా పలికిన మాటలను శ్యామా చెప్పినప్పుడు చందోర్కర్ ఆరోజు సమయాన్ని గుర్తుతెచ్చుకుని ఆ సంఘటననుకూడ వూహించుకుని ఆనాడు బాబాయే స్వయంగా భిల్లుని రూపంలో వచ్చి తన దాహం తీర్చాడని నిర్ణయించుకుంటాడు.

మనోనిగ్రహము గురించి నానాకు బోధించుట

ఒకనాడు బీజాపూరు నుంచి ఒక మహమ్మదీయ కుటుంబము బాబా దర్శనార్థమై వచ్చెను. వారిలో యిద్దరు ఘోషా స్త్రీలు కలరు. వారు మసీదులోనికి వచ్చి బాబా ఎదురుగా మోముపైగల ముసుగు తొలగించి నమస్కరించిరి. వారిలో ఒకామె చక్కదనాల చుక్కవలె అత్యంత సుందరంగా వుండెను. బాబాకు ప్రక్కనే కూర్చున్న నానా యొక్క మనసు చలించెను. ఆమెను యింకొక్కసారి చూడాలనిపించెను. అది గమనించిన బాబా నానా తొడపైచేతితో కొట్టెను. వారు వెళ్ళిపోయిన తరువాత బాబా నానాతో "నిన్నేలకొట్టితిని" అని ప్రశ్నిస్తాడు. నామనోవికారమును గుర్తించి మీరు నన్ను కొట్టారని నానా జవాబిస్తాడు. అవును నీవు చూచిన యువతి మిక్కిలి సౌదర్యవతి. ఆమెను భగవంతుడు అంత మనోహరంగా సృష్టించాడు. భగవంతుడు సృష్టించిన ఆమే అంత అందంగా వుంటే, ఆమెను సృష్టించిన భగవంతుడు ఎంత అందంగా వుంటాడో ఆలోచించావా!

మనం ఆలోచించవలసినది అందమైన ఈ సృష్టిని నిర్మించిన నిర్మాతనుగాని యిందులో గల వస్తువులను కాదు. గుడికి పోవునది దేముని కొరకుగాని గుడిపై గల శిల్పాల కొరకు కాదు. మనస్సు యింద్రియములతో ఐక్యమైనప్పుడే అది చలిస్తుంది. ఈ శరీరం ఒక రథంలాంటిది. బుద్ధి రథసారధి. యింద్రియాలు గుర్రాలు. గుర్రముల పగ్గాలను రథసారధి గట్టిగా పట్టుకున్నచో గుర్రములు సరిగా ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరగలడు. అట్లు కాక సారధికి గుర్రములపై అదుపు తప్పినచో వాటి యిష్టము వచ్చినట్లుగా ప్రయాణించును. గమ్యస్థానమును చేరలేము. బుద్ధితో యింద్రియాలను అదుపు చేయగలవారు మాత్రమే ఆధ్యాత్మికంగా ముందుకు పోగలరు. యింద్రియాలకు వశులైనవారు ఆ కోర్కెలను తీర్చుకోటానికి బుద్ధిని కూడ ఉపయోగిస్తారు. యింద్రియాలకు మనం ఏ విషయాన్నైనా చూపిస్తే అవి వాటినే కోరతాయి. అలాంటి యింద్రియ సహజ స్వభావంవల్లనే నీవు యిప్పుడు ఆ స్త్రీని మరల మరల చూడాలని కాక్షించావు. ఆ కోరికను బుద్ధితో ఆలోచించి అరికట్టు

అప్పుడే నీవు కాలాన్ని ఆధ్యాత్మికంగా ఉపయోగించుకో గలుగుతావు అలా కానిచో యింద్రియ వాంఛలను తీర్చుకోటానికే ఈ జీవితం సరిపోతుంది. యింక భగవంతుడిని గురించి ఆలోచించే దెప్పుడు".

బాబాకు పంచభూతములపై స్వాధీనము

ఈ ప్రపంచమంతా పంచభూతాలతో నిర్మితమైనదని భారతీయులు వైజ్ఞానికంగా పౌరాణిక కాలానికి ముందుగానే గ్రహించగలిగారు. ఈ నాడు పెరిగిన విజ్ఞానశాస్త్రం ప్రకారం కూడ కొన్ని మూలపదార్థాల సంయోగమే ఈ సృష్టి. ఈ మూల పదార్థాలను ఈనాడు (Elements) ఎలిమెంట్స్ అనే పేరున పిలువబడుతున్నాయి. మన సంస్కృతిలో వీటినే పంచభూతాలని పిలిచేవారు. 1. భూమి 2. నీరు 3. నిప్పు 4. గాలి 5. ఆకాశం. యావత్తు సృష్టికి మూలకారకాలైన వీటిమీద బాబాకు పూర్తి అధికారం వుండేది. అందుకు అనేక నిదర్శనాలు కలవు.

ఒకరోజు షిరిడిలో కారుమేఘాలు కమ్మి విపరీతమైన వేగంతో గాలివాన కుంభ వృష్టిగా కురుస్తుంది. కొద్ది సేపట్లోనే గుడిశెలు పూరిళ్ళు కొన్ని గాలికి ఎగిరిపోతాయి. వూరంతా మోకాళ్ళులోతు నీరు నిండిపోతుంది, ప్రజలంతా భయభ్రాంతులై పిల్లలతో సహా మసీదు దగ్గరకు వచ్చి తమను రక్షించమని సాయిని ప్రార్థిస్తారు. దయామయుడైన సాయి వారి మొర విని మసీదు బయటకు వచ్చి "ఆగు, ఆగు నెమ్మదించు నీ కోపాన్ని తగ్గించుకో అని వానను గాలిని ఆదేశిస్తాడు" కొద్దిసేపట్లోనే వర్షం తగ్గుతుంది. యిదే ప్రకారం యింకోసారి నానా చందోర్కరు తిరిగి యింటికి వెళ్ళేటప్పుడు కూడ యిలాగే ఆజ్ఞాపించి వర్షాన్ని ఆపుతాడు బాబా.

యింకొక సందర్భంలో మసీదులో గల ధునిలోని మంటలు చూస్తు వుండగానే పైపైకి లేచి మసీదు పైకప్పున గల దూలాలకు అంటుకునే విధంగ తయారవుతుంది. అప్పుడు కూడ తన సటకాతో నేలపై కొడుతూ దిగు, దిగు, శాంతించు అని ఆజ్ఞాపించగానే మంటలు క్రమంగా తగ్గుతూ మామూలు స్థితికి వస్తాయి. వేసవికాలంలో షిరిడిలోని ఒక రైతు యొక్క గడ్డివాము అంటుకుని మండుతూ వుంటుంది. గాలి బాగా వీస్తూ వుంటుంది. వూరిలో ఎక్కడా తగినంత నీరు లేదు. ప్రక్కనేగల అనేక గడ్డి వాములకు యిళ్ళకు కూడ ఆ మంటలు వ్యాపించి వూరుకు చాలా ప్రమాదం జరుగుతుందని అందరూ భయపడతారు. కొందరు

సాయి దగ్గరకు పరుగెత్తి వెళ్ళి ఈ ఆపదనుంచి తమను తమ కుటుంబాలను రక్షించమని ప్రాధేయపడగా సాయి లేచి గబ గబా వెళ్ళి చిన్న లోటాలో నీళ్ళు తీసుకుని మండుతున్న గడ్డివాము చుట్టూ చల్లి ఆ హద్దును దాటి బయటకు రాకూడదని అగ్నిని ఆజ్ఞాపించగా అది పూర్తిగా కాలిపోగానే మంటలు అదుపులోకి వచ్చి ఆరిపోతాయి.

షిరిడిలో శ్రీ రామనవమి ప్రారంభించిన తొలి సంవత్సరంలో నీటి ఎద్దడిని నివారించటానికి బాబా పాడుపడిన నూతిలో పూలను చల్లగా భూమాత చలించి తనలో గల నీటితో ఆ బావి నిండా మంచినీటిని నింపుతుంది యిలా బాబా యొక్క అధికారం పంచభూతాలపై పూర్తిగా వున్నది అనేందుకు నిదర్శనలు కోకొల్లలుగా వున్నాయి.

విరర్గాం నివాసి మేఘశ్యాముడు సాఠేగారి వంట బ్రహ్మణుడు. అతడు నిర్మల, నిశ్చలమైన పవిత్రుడు. సాఠే షిరిడికి వచ్చిన కొత్త రోజుల్లో యితనిని బాబా సేవకు గాను పూజారివలె నియమిస్తాడు. కాలగమనంలో అతను బాబా వద్ద చూసిన అనేక లీలలను బట్టి బాబా సాక్షాత్తు శివ అవతారంగా భావించేవాడు. ప్రతిరోజు వారి పాదతీర్థం త్రాగుతూ వుండేవాడు. బాబా అతని మనసులో మార్పు తీసుకు వచ్చి భక్తిని స్థిరపరచెను.

ఒక సంక్రాంతి పండగనాడు మేఘుడు బాబా శరీరానికి చందనము పూసి గంగా జలంతో అభిషేకం చేయాలని అనేకసార్లు ప్రార్థించగా ఆఖరికి యిష్టం లేకపోయినా బాబా వప్పుకుంటాడు. అతడు 18 మైళ్ళు రానుపోను నడచి వెళ్ళి గోమతీ తీర్థమును కడవలో నింపుకొని తలపై పెట్టుకుని వచ్చి మధ్యాహ్నం పన్నెండు గంటలకు బాబాను ఒక పీటపై కూర్చో బెట్టగా వారు తలను ముందుకు చాచి శరీరానికి తల ముఖ్యం కనుక తలపైనే నీళ్ళు పోయుము. శరీరమంతా పోసినట్లగును అంటారు. అయినా మేఘుడు నీళ్ళకుండను పైకెత్తి పోయునప్పుడు హరగంగేయనుచు భక్తి పారవశ్యంలో శరీరమంతా నీరు పోస్తాడు. అయినా బాబా వాక్కు ప్రకారం తల మాత్రమే తడిసి మిగిలిన శరీరం అంతా పొడిగానే వుంటుంది.

పై రెండు లీలలను, బట్టి బాబాకు నీటి మీద కూడ అధికారం వున్నదనే విషయం అర్థమౌతున్నది.

బ్రహ్మజ్ఞానము

సకలైశ్వర్య సంపదుడైన గుల్జార్ అనే ధనికుడు మాలేగాంకు సమీపంలో వుండేవాడు. సాయిబాబా పేరు ప్రతిష్టలు విన్న తరువాత ఆయన దగ్గర నుంచి బ్రహ్మజ్ఞానాన్ని సంపాదించాలని నిశ్చయించుకొని రానుపోను టాంగాను మాట్లాడుకుని షిరిడికి వచ్చి, కాలం వృథా చేయక వెంటనే బాబా దగ్గరకు వెళ్ళి త్వరగా బ్రహ్మ జ్ఞానాన్ని బోధించమని, తిరిగి వెళ్ళేందుకు సిద్ధంగా తెచ్చుకున్న టాంగాలో వెంటనే వెళ్ళిపోవాలని చెబుతాడు, అందుకు బాబా మిత్రమా! నీవు ఆదుర్దాపడవద్దు. యిప్పుడే బ్రహ్మమును చూపెదను. నాబేరమంతా నగదే కాని అరువు వుండదు. నా దగ్గరకు వచ్చి అందరూ స్వార్థపూరితమైన కోరికలను కోరతారు. నీవలె బ్రహ్మజ్ఞానాన్ని కోరేవారు చాలా తక్కువ మంది అంటూ ఏవేవో మాటలు చెబుతూ అతనిని తన విషయం మరచేటట్లుగా చేస్తాడు. ఒక పిల్లవాడిని పిలిచి నందు మార్వాడి యింటికి వెళ్ళి అయిదు రూపాయలు అప్పుగా తీసుకురమ్మనమని పంపగా యింటికి తాళం వేసివుండటంచేత తిరిగి వస్తాడు. ఈసారి యింకొకరి యింటికి పంపించగా మళ్ళీ అలానే అవుతుంది. మరి రెండు చోట్లకు కూడ పంపగా నిరుపయోగంగానే తిరిగి వస్తాడు. బ్రహ్మజ్ఞానం కోసం వచ్చిన వానివైపు చూసి నీ జేబులో 50 అయిదు రూపాయల నోట్లున్నవి. బ్రహ్మజ్ఞానమును వెంటనే తీసుకుపోయేందుకు యిది ఒక వస్తువుకాదు. నీవు గమనించగలందులకే ఈ కధనంతా నడుపుతున్నాను అంటాడు బాబా. ఆ పెద్ద మనిషి బాబా 5 రూపాయల కోసం ప్రయత్నిస్తుంటే తన వద్దగల డబ్బులో నుంచి కేవలం అయిదు రూపాయలు కూడ బాబాకు యివ్వలేకపోయాడు. అది కూడ అప్పుగా, అలాంటి పిసినారికి బ్రహ్మజ్ఞానం ఎలా బోధపడుతుంది. బాబాకు డబ్బు యివ్వకపోగా బ్రహ్మజ్ఞానం కోసం తొందరపెడుతున్నాడు. ఎక్కువ ఆలశ్యమైతే టాంగా బాడుగ పెరుగుతుందనే భయం అతనికి.

అప్పుడు మళ్ళీ బాబా తన ప్రసంగాన్ని అతనితో యిలా సాగిస్తాడు. "ఓ మిత్రుడా బ్రహ్మజ్ఞానమనగా ఆత్మ సాక్షాత్కారమే. ఆత్మకు బ్రహ్మకు భేదం లేదు. జీవుడే దేవుడు, ఈ శరీరంలో గల ఆత్మను దర్శించాలంటే అయిదింటిని భగవంతునికి సమర్పించాలి. అవి 1. పంచ ప్రాణములు 2. పంచేంద్రియములు 3. మనస్సు 4. బుద్ధి 5. అహంకారము. యివన్నీ మనిషికి అంతర్గతంగా వుండేవి. బహిర్గతంగా వుండే సంపదను పరిత్యజించటం చాలా తేలిక. అంతర్గతమైన ఈ

అయిదు విషయాలను త్యజించటం చాలా కఠినమైన విషయం. పదునైన కత్తి అంచుపై నడవటంలాంటిది. బాహ్యావస్తువులనే వదలలేని వారు పూర్తిగా వ్యామోహంలో వున్నట్లుగా అర్థం. అలాంటి వారికి అంతరంగికమైన ఈ అయిదు విషయాలు అర్థమే కావు.

అంతేకాక ఆత్మజ్ఞాని కావాలనుకునే వాడు ముందు ఈ విషయాలలో జాగ్రత్త వహించాలి.

1. మోక్షము, లేక ప్రాపంచిక బంధాల నుంచి స్వేచ్ఛ పొందాలనే తీవ్రమైన కోరిక వుండాలి. 2. యిహలోక విషయాలపైన, పరలోక ఆశలపైన కూడ విసుగు విరక్తి కలగాలి. 3. మానవుని యింద్రియాలెప్పుడు శరీరానికి బయటగల విషయాలను చూచునట్లు అలవాటు పడినవి. ఆ దృష్టిని బయటి వస్తు సముదాయముల నుంచి వేరుచేసి కేవలం శరీరం లోపలగల ఆత్మను తదేక ధ్యానముతో చూడగలగాలి. 4. చెడు, దుర్మార్గవుదారుల నుండి బుద్ధిని మర్చలేక, మనస్సును స్థిరపరచుకోలేనప్పుడు జ్ఞానమువలన కూడ ఆత్మ సాక్షాత్కారము పొందలేరు. 5. సర్వకాల సర్వావస్థల యందు సత్యము పల్కుచు, తపస్సు చేయుచు, లోన చూచుచూ, బ్రహ్మచారిగా వుండవలెను.

6. సంతోషమును కలిగించువాని కంటే మేలు కలిగించువానినే మానవులు కోరుకోవలెను. ప్రాపంచిక విషయాలు సంతోషాన్ని కలిగించును. ఆధ్యాత్మిక విషయాలు మేలు కలిగించును. తాత్కాలికమైన సంతోషం కన్నా శాశ్వతమైన మేలు కలిగించు ఆధ్యాత్మిక విషయాలనే కోరుకోవలెను.

7. మనస్సును యింద్రియములను స్వాధీనమునందుంచుకొనవలెను. అట్లు కాక యింద్రియ సుఖముల వైపు మనస్సును పోనిచ్చిన, అది బుద్ధికి కూడ అదే విషయాన్ని అప్పగించి ఆలోచింపచేయును. యిక ఆధ్యాత్మికానికి తావుండదు.

8. మనస్సును పవిత్ర పరచవలెను. మనిషి తాను చేయవలసిన పనులను సక్రమంగాను, తృప్తిగాను, ప్రతిఫలాపేక్షలేకుండాను నిర్వర్తించవలెను. అప్పుడు మనస్సు పవిత్రపడును. పవిత్రమైన మనస్సులో నుంచే వివేకము పుట్టి వైరాగ్యము అభివృద్ధి చెంది ఆత్మజ్ఞానము కలుగును. లోభము, మోహము, ఆశాపాశములు తొలగనిదే జ్ఞానం లభించదు.

9. ఈ స్థితిని ప్రతి సాధకుడు తనంతట తానుగా కష్టించి సాధించుకోవలెను. ఈ పై విషయములన్నిటిలో స్థిరమైన తరువాత గురువు చాలా అవసరము. ఆ గురువు తాను స్వయముగా ఆత్మజ్ఞానమును పొందినవాడై ఉండవలెను. స్వయముగా ఆత్మజ్ఞానాన్ని పొందని గురువులను ఆశ్రయించటంవలన ప్రయోజనం వుండదు.

10. మొదటి ఎనిమిది సాధకుడి స్వయంకృషి, దానికి సద్గురు సహాయం తోడైనప్పుడు దైవకటాక్షం కూడ తప్పక తోడౌతుంది. వేదపాండిత్యం వల్లగాని, ధనాధిక్యత, కులాధిక్యతవలన గాని, బలాధిక్యతవలన గాని, మేధాశక్తి వలన గాని ఆత్మజ్ఞానం కలగదు.

బాబా యొక్క సుదీర్ఘమైన పై విషయ వివరణ కేవలం గుల్వార్ కొరకు యిచ్చినదే కాదు. నిజ భక్తులైన పాఠకులందరికీ ఉద్దేశించినదే! పాఠకులు బ్రహ్మజ్ఞానానికి సంబంధించిన ఈ అధ్యాయంలోని భాగాన్ని మరొకసారి పారాయణ చేయుదురుగాక! భక్తితో ఈ విషయాలను పారాయణ చేయువారికి సాయి సద్గురువై వారి జీవితంలో నిలచిపోవుగాక! వారి జీవిత గమనాన్ని క్రమంగా ఆత్మసాక్షాత్కారం వైపు నడిపించుగాక!

మానవుడికి కావలసిందేమిటి! సుఖము, శాంతి. భౌతికంగా అన్న వస్త్రాలు శారీరిక అవసరాలు. వాటికి నా భక్తుని యింటిలో లోటులేదనే అభయం సాయి యిచ్చారు. కాబట్టి పాఠకులైన భక్తులు ఈ మిధ్యా ప్రపంచంలోఅన్న వస్త్రాలకు, పేరు ప్రతిష్ఠల కొరకు ప్రయాసపడి జీవితాన్ని వృధా చేసుకోకూడదు. ప్రాపంచిక బంధాలైన తల్లి తండ్రి, అన్నాతమ్ములు, భార్యాభర్తలనే ఈ సంబంధాలు ఈ జీవితం వరకే పరిమితమైనవి. కాని సాయితో సంబంధం జన్మ జన్మలకు విడువడనదిగా వుండి, మనకు క్షేమకారిగా వుంటుంది.

పవిత్రమైన ఈ సాయి జీవితచరిత్ర పారాయణ ద్వారా బాబా మనకు దగ్గర కావాలని, మన దైనందిన కుటుంబ జీవితంలో ఒక భాగంగా సాయి నిలవాలని, మన జీవితాలు సాయితో ముడిపడి పోవాలని ఆశిస్తూ ఈ అధ్యాయంతోపాటుగా రెండవరోజు పారాయణను కూడ ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

పన్నెండవ అధ్యాయం సంపూర్ణం.

రెండవ రోజు పారాయణ పూర్తి అయినది.

పదమూడవ అధ్యాయము

అది 1895వ సంవత్సరం బాబా యొక్క మహిమలను స్వయంగా అనుభవించి, వారి ప్రేమను ఆస్వాదించిన మహల్సాపతి బాబా యందు పూర్తి ఆకర్షితుడై సంసార విషయములందు విరక్తుడయ్యెను. ఒకనాడు ఖండోబా ఈయనకు కలలో కనిపించి "నీ కులవృత్తియైన "కంసాలి" పని చేయకున్న నీకు తిండి దొరకదా""? అని ప్రశ్నించగా నీ కరుణ వున్నచో నాకు తిండికి లోటేమి. నా కులవృత్తిని విడిచి పెట్టెదనని మహల్సాపతి జవాబిచ్చెను. అట్లయినచో నా పాదముల పట్టు విడువకుము అని మరల ఖండోబా చెప్పెను. ఆనాటి నుంచి ఆయన కులవృత్తిని వదిలి భిక్షుకవృత్తిని స్వీకరించెను.

మహల్సాపతి

క్రమంగా ఈయనకు జీవితముపై విరక్తి కలిగి సంసార జీవితమందు విముఖుడయ్యెను. భోజన సమయానికి మాత్రం యింటికివెళ్ళి వెంటనే వచ్చెడివాడు. మిగిలిన కాలమంతా బాబా సేవ చేయుచుండెడివాడు. రాత్రులందు బాబాతోపాటుగానే బాబా ప్రక్కనే పరుండువాడు. 1896లో ఒకనాడు బాబా మహల్సాపతితో అరే భగత్! పొల్లు పోవుటకు వీలులేని ఈ ఫకీరు మాటలు వినుము. నీవు రాత్రులందు యిక్కడ నా దగ్గరనే నిద్రిస్తున్నావు. యింటికి వెళ్ళి నిద్రించుము. నీకు ముగ్గురూ ఆడపిల్లలే. మొగ పిల్లలు లేరు కదా. నీకు కొడుకు పుట్టును. పొమ్ము యింటిలో నిద్రించుము. నీకు తప్పక కుమారుడు జన్మించునని చెప్పెను.

మహల్సాపతికి పుత్రునియందు కోరికలేదు. నిజానికి ఆయనకు దేని యందు కోరికలేదు. సంసారపు బరువును పెంచుకొనుటకు ఆయనకు యిష్టంలేదు. అందువలన బాబా మాటలను పాటించలేదు. బాబా బలవంత పరచగా అతని స్నేహితుడు "కాశీరాం షింపీ" 1896 శ్రీ కృష్ణ జయంతినాడు రాత్రి మహల్సాపతిని యింటికి తీసుకువెళ్ళి నిద్రించునట్లు చేసెను. 1897 కృష్ణజయంతినాడు అనగా ఖచ్చితంగా ఒక సంవత్సరానికి మహల్సాపతికి పుత్రుడు జన్మించెను. బాబా పలుకులు

నిజమయ్యెను. ఈ బాలునికి మార్తాండుడని పేరు పెట్టిరి. పెరిగి పెద్దవాడై బడికి వెళ్ళు వయసులో మార్తాండుడు మారాం చేస్తూ వుంటే మహల్సాపతి కొట్టబోగా ఒకనాడు ఆ పిల్లవాడు పరుగెత్తుకుని వచ్చి ద్వారకామాయిలో బాబా వడిలో కూర్చుంటాడు. మహల్సాపతి వచ్చి బలవంతంగా బడికి పంపబోతూ ఒక దెబ్బవేస్తాడు. అప్పుడు బాబా అత్యంత కరుణామూర్తియై. "మహల్సా వీడిని గురించి నీవేమీ బెంగపెట్టుకోకు వీడిని నేను పోషిస్తాను" అంటాడు.

ఈ మార్తాండుడే పెరిగి పెద్దవాడై మార్తాండ మహరాజ్ అనే పేరుతో షిరిడిలోని మహల్సాపతి యింట్లో తన తండ్రి సమాధి ప్రక్కనే కూర్చుని వుండేవాడు. 1985లో ఈ రచయిత వీరిని కలిసినప్పుడు పై సంఘటనను చెబుతూ ఆనాటి బాబా వాక్కు ఫలితంగానే ఈనాటి వరకు సాయి భగవానుడే తన భక్తుల రూపంలో తనను పోషిస్తున్నాడని చెప్పారు. బాబా యొక్క తల్లిదండ్రుల పేరు, జన్మస్థలం వివరాలు బాబా తన తండ్రికి చెప్పారని, అయితే ఆనాటి హిందూ ముస్లిం విభేదాల కారణంగా ఆ విషయాలను రహస్యంగా వుంచారని, తన తండ్రి ఆ వివరాలు తనకు చెప్పాడని, కాని యితరులెవ్వరికీ వీటిని చెప్పవద్దని తనచేత ప్రమాణం చేయించు కున్నాడని, ఆ కారణంచేత బాబాయొక్క చిన్నతనం వివరాలు తనకు పూర్తిగా తెలిసినా చెప్పకూడదని వీరు చెప్పారు. 1986లో వీరు మరణించారు.

బాబా మహల్సాపతిని అతని కుటుంబాన్ని ఎట్లు రక్షించెనో తెలుసుకొనెదము. ఒకనాటి రాత్రి మహల్సా రాత్రి భోజనమునకు యింటికి వెళ్ళుచుండగా బాబా "అరే భగత్ దారిలో యిద్దరు పొడవాటి దొంగలున్నారు జాగ్రత్త" అని హెచ్చరిస్తాడు. అదేవిధంగా అతని యింటి ముందు ఒక పాము, యింటి ప్రక్కన యింకో పాము కనిపిస్తాయి. అలాగే యింకో రోజు "నీవు వచ్చునప్పుడు లాంతరు తీసుకొని రమ్ము దారిలో దొంగను ఎదుర్కొనవలసి వచ్చును" అని చెప్పెను. మహల్సా లాంతరు తీసుకొని రాగా మసీదుకు కొంతదూరములో పాము కనిపించెను. అతని అరుపులు విని గ్రామస్తులు వచ్చి దానిని చంపిరి.

1908 ప్రాంతంలో మహల్సాపతి కుటుంబ సభ్యులంతా వ్యాధిగ్రస్తులైరి. బాబా దర్శనార్ధము వచ్చిన ఒక వైద్యుడు వారికి మందులనిచ్చెను. ఆ మందులు పనిచేయవని తానే వ్యాధిని నయం చేస్తానని చెపుతూ బాబా తన సటకాను చేత

పట్టుకుని ద్వారకామాయి చుట్టూ తిరుగుతూ "రమ్ము నీ శక్తి ఏ మాత్రమో నేను చూసెదను" అంటు బిగ్గరగా కేకలు వేసి కళ్ళెఱ్రచేసెను. వెంటనే వారి కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యవంతులైరి. బాబా నటకాతో దండించి కోపగించి అరచినది మహల్సాపతి యింట్లో వున్న వ్యాధిని గురించి అయి వుండవచ్చును.

యింకొకసారి మహల్సాపతి భార్య పుట్టింటికి వెళ్ళెను. అక్కడ ఆమెకు కంఠవాపు వ్యాధి కలిగి చాలా బాధపడెను. షిరిడిలో బాబా మహల్సాపతితో "నీ భార్య తీవ్రమైన కంఠ వ్యాధితో బాధపడుతున్నది. ఆమెను నేను తప్ప యింకెవరూ రక్షించలేరు." అనెను అందుకు మహల్సావతి "నిజమే బాబా మమ్ము రక్షించగల వారు ఈ ప్రపంచంలో మీరు తప్ప యింకెవరూ లేరు, అంటాడు. మహల్సాపతి మనోవాక్కాయ కర్మలతో త్రికరణ శుద్ధిగా బాబాయే తన సర్వస్వం అని నమ్మిన భక్తుడు. అందువలననే అడగక పోయినా, ఆయనకు తెలియక పోయినా కూడా తానే ముందుగా తెలుసుకుని ఆయన భార్య యొక్క జబ్బును నయం చేశాడు సాయిబాబా.

యిలాంటి త్రికరణ శుద్ధితో కూడిన అంకిత భావంగల భక్తులను ఈనాటికీ బాబా వారు అర్ధించకపోయినా రక్షిస్తూనే వున్నాడు. సర్వస్వ శరణా గతి, సంపూర్ణ అంకిత భావాన్ని అలవరచుకోమని మా పాఠకులను పదే పదే ప్రార్థిస్తున్నాం. సాయికి భావన, భక్తి ముఖ్యంగాని ఆచార వ్యవహారాలు కాదు.

షిరిడికి 150 మైళ్ళు దూరంలో గల 'జిజూరి' అనే గ్రామంలో ఖండోబాకు జరుగు ఉత్సవములకు మహల్సాపతి ప్రతి సంవత్సరం వెళుతూండేవాడు. ఒక సంవత్సరం ఆ గ్రామమంతా ప్లేగు వ్యాధి విపరీతంగా వుండటంవలన ఏమగునో అని బాధపడుతూ వ్యాకులుడై దారి మధ్యలో ఆగినప్పుడు వికలమనస్కుడైన మహల్సాపతికి ఒక్క క్షణం బాబా శరీరంతో దర్శనం యిస్తాడు. వారి పాదములపైనబడి నమస్కరించి లేవగా మళ్ళి అదృశ్యమౌతాడు. ఎలాంటి బాధలు లేకుండా యాత్రను పూర్తి చేసుకుని తిరిగి రాగానే మహల్సాపతితో బాబా "ఏమి భగత్ ఆనందకరమగు తీర్థయాత్ర మధ్యలో వ్యాకులుడవైతి వేమి? ఆ సమయమున నీ బండి వద్దకు నేను వచ్చితిని. గమనించితివా? అని ప్రశ్నిస్తాడు.

యింకొక సందర్భంలో "డోర్‌హాలీ" అనే గ్రామంలో గల తన కూతురు అత్తగారింటికి మహల్సాపతి విందు భోజనమునకై వెళ్ళునప్పుడు వలదని బాబా వారిస్తాడు. బంధువులేమైనా అనుకుంటారేమోనని వెళ్ళి అవమానము పొంది ఆకలితో మరీ తిరిగి షిరిడి చేరుకుని బాబా పాదాలపై శిరస్సు వుంచి విలపిస్తాడు. మరియొక

సందర్భములో మహల్సాపతి "అర్ధంగోను" అను గ్రామమునకు వెళ్ళదలచి బాబా అనుమతిని కోరగా అక్కడ తగాదాలు, దెబ్బలాటలు జరుగును. వెళ్ళవద్దని వారిస్తాడు. కాని ఆయన వెళతాడు. బాబా చెప్పినట్లుగానే ఆ గ్రామంలో పిల్లల మధ్య జరిగిన చిన్న తగాదా కారణంగా గ్రామంలోని వారంతా రెండు వర్గాలుగా విడిపోయి కర్రలతో కొట్టుకుని దెబ్బలాట జరుగగా మహాల్సా సురక్షితంగా తప్పించుకుని తిరిగివస్తాడు.

మహాల్సాపతి యందు బాబా చూపించిన రక్షణ భారం సాయి యొక్క భక్తవాత్సల్యానికి నిదర్శనం. ఈ ప్రకారంగా తనను ఆశ్రయించిన వారియొక్క యోగక్షేమాలను నిరంతరం కంటికి రెప్పవలే కాపాడు సమర్ధతగలవాడే సమర్ధుడైన సద్గురువు.

చావడి

గురుస్థాన్ వద్దకు వెళ్ళి అప్పుడప్పుడు బాబా కళ్ళు మూసుకుని అలౌకిక దృష్టితో లోపల వున్న గురువు వెంకూసాతో భావనలను లయం చేసేవారు. శిష్యుని పిలుపును విన్న వెంకూసా బాబా యొక్క ధ్యేయ వస్తువుగా వారి శిరస్సులో ప్రవేశించే వాడు. యిలా గురుశిష్యులు ఏవేవో మౌనంగా సంభాషించుకునే వారు. యిదే ప్రకారంగా రాత్రివేళల్లో ద్వారకామాయిలో తండ్రి గురుధన్‌తో కూడ తరచు మాట్లాడుతూ వుండేవాడు సాయి. మసీదుకు ముందు భాగంలో చావడి అనే పేరుతో సాధువులు విశ్రాంతి తీసుకునే ఒక పెద్ద గదిలాంటిది వుండేది. గ్రామంలోకి వస్తూ పోతూ వుండే సాధులు, సన్యాసులు యిందులో వుంటూ వుండేవారు.

ద్వారకామాయి లోపల నాపరాళ్ళను పరిపించేందుకు నానా చందోర్కరు మొదలైన వారు అన్ని ఏర్పాట్లు చేసుకుంటారు. ఒకరాత్రికి రాత్రి ఆ పని పూర్తి చేయించాలనే ఉద్దేశంతో ఆ రాత్రికి చావడిలో బాబాను నిద్రించమని ప్రార్థిస్తారు. అందుకు సాయి అంగీకరిస్తారు. ప్రతిరోజు బాబాతోపాటు నిద్రించే తాత్యా, మహల్సాపతి కూడ మిగిలిన వారితో కలిసి మసీదు మరమ్మతు పనులలో నిమగ్నమౌతారు. బాబా వంటరిగానే చావడికి వెళ్ళి కూర్చుంటాడు. చావిడిలో యింకెవరూ వుండరు: సాయి ఒక్కక్షణం ధ్యాన నిమగ్నుడై ద్వారకామాయి, గురుధన్, వెంకూసాలపై మనోదృష్టిని కేంద్రీకరించగా వారు ముగ్గురూ జ్యోతుల రూపంలో వచ్చి బాబా ముందు నిలుస్తారు. అప్పుడు వాళ్ళు నలుగురు ఏవేవో మాటలు మాట్లాడుకుంటారు. కొద్దిసేపు తర్వాత గురుధన్, ద్వారకామాయిలు తిరిగి తమ తమ స్థానాలకు వెళ్ళిపోతారు. వెంకూసా బాబాలు మాత్రం ముందు ముందు షిరిడిలో జరిగే విషయాలను రాబోయే 500

సంవత్సరముల వరకు జరుగగల విషయాలను చర్చిస్తారు. యింతలో తొలి కోడి కూసి తెల్లవారబోతూ వుండగా మెంకూసా తిరిగి గురుస్థాన్ క్రింది భాగాన్ని చేరుకోబోవాలని అనుకుంటూ వుండగా బాబా వారిని ఆ చావడిలోనే కొలువుండమని తాను కూడ రోజు విడిచి రోజు అక్కడికి వచ్చి కలుస్తానని ప్రార్థిస్తాడు. శిష్యవాత్సల్యుడైన మెంకూసా వెంటనే అంగీకరించి చావడిలోని కుడివైపు భాగంలో తానుంటానని, స్త్రీలనెవ్వరినీ ఆ స్థానంలోకి ప్రవేశించకుండా చూడమని బాబాతో చెబుతాడు. బాబా అంగీకరిస్తాడు. ఆరోజు నుంచి ఈనాటి వరకు మెంకూసా చావడిలోనే గుప్తరూపంగా వున్నాడు.

బాబా తన తల్లివడిలో నింతరం నివశిస్తూ అటు జన్మనిచ్చిన తండ్రిని ఆకర్షిస్తూ వారికి జ్ఞానబోధ చేస్తూ తన ఆశ్రితులకు భక్తిని, ముక్తిని ప్రాసాదిస్తూ కలియుగ దైవమై రాబోయే సాయి యుగానికి నాంది పల్కుతున్నాడు. పురాతన భక్తి మార్గాలకు, ఆచార వ్యవహారాలకు పూజా పద్ధతులకు సాయి స్వస్తి చెప్పాడు. ఈ విషయంలో సాయి స్వయంగా చెప్పిన మాటలు "ఎవరు అదృష్టవంతులో ఎవరి పాపములు క్షీణించినవో వారు నాపూజ చేసెదరు. ఎప్పుడూ నీవు నానామమును స్మరించుచుండినచో నిన్ను సప్తసముద్రములను సైతం దాటించెదను. పూజాతంతు తోగాని, యోగములు, యాగములు, క్రతువులతోగాని నాకు పనిలేదు. ఎక్కడ పవిత్రమైన భక్తి వుండునో అక్కడే నా నివాసము". యిలాంటి భక్తిగల వారికి బాబా ఏమేమి చేసేనో కొందరి విషయములలో తెలుసుకుందాము.

బాబావాక్కుల మహిమ

1909లో భీమాజీ పాటిల్‌కు భయంకరమైన క్షయరోగము వచ్చెను. నానా సాహెబ్ సలహాపై షిరిడికి వచ్చి బాబా పాదములపై పడెను. మొదట అతనిని రక్షించుటకు బాబా వప్పు కొనకపోయినా రోగి ప్రాధేయపడగా సాయి కరుణించి "నీవు భయపడకుము నీ కష్టములు పోయినవి. ఎంతటి పీడయున్నవారైనా ఈ మసీదు మెట్లు ఎక్కగానే వారి కష్టములన్నీ తొలగిపోవును. యిక్కడి ఫకీరు దయగల వాడు. అందరినీ ప్రేమ, దయతో కాపాడును." అని అభయ వాక్కులు పలుకగానే రోగము నయమగుట ప్రారంభమై కొద్ది రోజులలోనే పూర్తి ఆరోగ్యవంతుడయ్యెను. ఆ తరువాత బాబా అతనికి రెండు స్వప్నముల నిచ్చెను. మొదటి స్వప్నములో ఒక ఉపాధ్యాయుడు అతనిని కొట్టుచున్నట్లుండెను. రెండవ స్వప్నంలో వాని ఛాతీ మీద పెద్ద బండను పెట్టుటచే బాధ కలిగెను. కొట్టుట, బరువు పెట్టుట ద్వారా కలలో అతను పొందిన బాధతో చెడు కర్మను పూర్తిగా తొలగించి అతనికి సంపూర్ణ

ఆరోగ్యమును తిరిగి ప్రసాదించెను. సాయి యొక్క దివ్యశక్తిని గమనించిన భీమాజీపాటిల్ స్వగ్రామమునకు తిరిగి వెళ్ళి మొదటిసారిగా సత్యనారాయణ వ్రతమువలె సాయి సత్యవ్రతమును ప్రారంభించెను.

హార్దా నివాసి దత్తపంతు. ఈతడు పదునాలుగు సంవత్సరములు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడెను. ఎన్ని మందులను వాడినా గుణమివ్వలేదు. బాబా యొక్క కీర్తి విని షిరిడికి చేరి వారి పాదములపైబడి రక్షించమని ప్రార్థించెను. బాబా అతని వైపు దాక్షిణ్యముతో చూచి ఆశీర్వదించి తన అభయహస్తమును పంతు తలపై వుంచి మృదువుగా తట్టెను. ఆ తరువాత వూదీ ప్రసాదమునిచ్చెను. వెంటనే అతని కడుపునొప్పి తగ్గెను. తిరిగి ఆ బాధ ఎన్నడూ అతనిని బాధించలేదు.

కాకా మహాజని అను యింకొక భక్తుడు ఒకసారి నీళ్ళ విరోచనములతో బాధపడుతూ కూడ బాబా సేవలోనే వుండాలని నిశ్చయించుకుని చెంబు నిండ నీళ్ళు పెట్టుకుని మసీదులో సిద్ధముగా వుంచుకొనెను. విరోచనములకు వెళ్ళవలసి వచ్చినప్పుడు బయటకు వెళ్ళివస్తూ వుండెను. బాబాకు అన్నీ తెలుసు కాబట్టి వారే తన వ్యాధిని నయం చేస్తారనే విశ్వాసంతో అతడుండెను. మసీదుకు ముందు భాగంలో రాళ్ళు తాపన చేయు పని ప్రారంభిచబడినది. వున్నట్టుండి బాబా కళ్ళెర్రచేసి తీవ్ర స్వరంతో బిగ్గరగా అరచెను. ఆ కేకలకు భయపడి అందరు బయటకు పరుగెత్తుకు పోయారు. పరుగెత్తుతున్న కాకా మహాజనిని మాత్రం బాబా చేతితో పట్టుకొని కూర్చుండపెట్టి ప్రక్కనే ఎవరో వదిలిపెట్టిన సంచిలోగల వేరుశెనగ పప్పును గుప్పెడు తీసి అతనికిచ్చి తినుమనెను. కొంత పప్పు తాను కూడ తినెను. కొన్ని నీళ్ళు త్రాగి కాకాను త్రాగుమనెను. తరువాత బాబా నీ నీళ్ళ విరోచనములు ఆగిపోయినవి. యిప్పుడు నీవు రాళ్ళు తాపన చేయు పని చూసుకోవచ్చును అనెను. అంతే వెంటనే కాకా విరోచనములు ఆగిపోయినవి. ఈ వింత చర్యలో పని చేసినది బాబా యొక్క వాక్కుగాని వేరేది కాదు.

యింకొక సందర్భంలో నానా చందోర్కరు కడుపు నొప్పితో బాధపడి ఎన్ని మందులు వాడినా నయం కాలేదు. అతడు విసిగిపోయి షిరిడి చేరి బాబాను ఆశ్రయించెను. బాబా ఆశీర్వదించగానే ఆ బాధ పూర్తిగా తగ్గెను.

బాలా గణపతిషింపే యను బాబా భక్తుడు మలేరియా జబ్బుతో బాధపడెను. మందులు, కషాయములు ఏ మాత్రం పనిచేయలేదు. వెంటనే షిరిడికి వెళ్ళి బాబాను ప్రార్థించగా వారు లక్ష్మీమందిరం ముందువున్న నల్లకుక్కకు పెరుగన్నం కలిపి పెట్టుమని చెప్పెను. బసకు తిరిగివెళ్ళగా అన్నము పెరుగు

సిద్ధముగావుండెను. రెంటినీ కలిపి లక్ష్మీమందిరం వద్దకు తీసుకువెళ్ళగా అక్కడ ఒక నల్లకుక్క తోక ఆడించుచూ అతని కొరకే ఎదురు చూచు చున్నట్లుగా వుండెను. పెరుగన్నము ముందు పెట్టగా దానిని అది పూర్తిగా తినెను అతని జ్వరం వెంటనే తగ్గి పూర్తిగా ఆరోగ్యం కలిగెను.

బాపూ సాహెబ్ బుట్టీకి ఒకసారి వాంతులు, విరోచనములయ్యెను. అతడు ధనికుడగుటచే ఎన్నో రకాల మందులను వాడెను. అయినను ప్రయోజనము కలుగలేదు. బాగా నీరసించుటచే బాబా దర్శనమునకు కూడ పోలేకపోయెను. బాబానే అతనిని పిలిపించి తన ఎదురుగా కూర్చోమని చెప్పెను. కళ్ళెర్రచేసి అతని కళ్ళలోకి చూస్తూ జాగ్రత్త యిక నీవు విరోచనము చేయరాదు. వాంతి కూడ చేయరాదు. అని గద్దించి హెచ్చరించెను. అంతే అతని రోగము ఎటు పోయినదో తెలియదు. పూర్తి స్వస్థత చేకూరెను.

ఆళంది నుంచి ఒక సన్యాసి షిరిడికి బాబా దర్శనార్థమై వచ్చెను. అతనికి చెవిపోటు బాధ చాలా ఎక్కువగా వుండెను. అతని బాధను గమనించిన శ్యామా అతని తరపున ఆ బాధను తగ్గించమని బాబాను వేడుకొనెను. (అల్లా అచ్ఛాకరేగా) దేముడు మేలు చేయును అని సాయి ఆశీర్వదిస్తూ తన దృష్టిని సన్యాసిపై ఒక్క క్షణకాలం వుంచెను. అతని చెవిపోటు తగ్గెను.

పైన వ్రాయబడినవి బాబా చూపిన అనేక వేలకొలది మహిమలలో కొన్ని మాత్రమే! ఈ కొద్ది సందర్భాలలోను బాబాయొక్క వాక్కు ప్రభావమే ఎక్కువ వారిది బ్రహ్మవాక్కు యిలాంటి శక్తివంతమైన బ్రహ్మతేజస్సుతోగల బ్రహ్మవాక్కును పలుకగల సద్గురువే గురుబ్రహ్మ అనే పదానికి అర్హులు. మిగిలిన గురువులంతా శిష్యులు తెచ్చే ధనంపైన వారిచ్చే వస్తు సముదాయాలపైనే ఆశక్తి కలిగివుంటారు గాని, వారు తమను నమ్మిన శిష్యులకు ఏవిధంగాను వుపయోగపడలేరు. యిలాంటి బాధ గురువులను నమ్మి తమ ధనాన్ని కాలాన్ని వృధా చేసుకోకుండా సమర్థుడైన సాయిని నమ్మి యిహలోకంలో సుఖాన్ని పరలోకంలో మోక్షాన్ని పొందవలసిందిగా పాఠకులకు విజ్ఞప్తి చేస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

పదమూడవ అధ్యాయం సంపూర్ణం.

పదునాల్గవ అధ్యాయము

అది 1906వ సంవత్సరం ఆషాఢ శుద్ధ పూర్ణమ. దీనిని వ్యాస పూర్ణమగా అంతకు ముందు హైందవ ప్రముఖులు నిర్ణయించిరి. అష్టాదశ పురాణాలకు మూలకారకుడైన వ్యాసుని పేరున దీనిని వ్యాస పూర్తిగా నిర్ణయించారు. ఆరోజు ఉదయం బాబా సాఠే మామగారైన దాదా కేల్కరును పిలిపించి ఈ రోజు గురు పూర్ణిమ. గురువును పూజించవలసి రోజు నీవు వెళ్ళి శ్యామా మొదలైన భక్తులందరినీ పూజా సామాగ్రితో తీసుకునిరా అని చెప్పగా దాదాకేల్కరు అనాడు అక్కడ వున్న ప్రముఖ భక్తులనందరినీ సమీకరించి పూజా ద్రవ్యములతో సహా మసీదుకు తీసుకువచ్చెను. అప్పటికి బాబా అరమోడ్పు కన్నులతో తన దృష్టిని అనంత దూరాలలో ఎక్కడో కేంద్రీకరించి ఏకాగ్రతలో వున్నాడు. వారి స్థితిని గమనించిన వారందరిలో ఏ ఒక్కరికీ బాబాకు ధ్యానభంగం చేస్తూ వారిని మాట్లాడించుటకు ధైర్యం చాలలేదు. కొద్దిసేపటికి తర్వాత బాబానే కళ్ళు తెరచి ఎదురుగా నున్న భక్త సమూహాన్ని చూసి ఒక్కక్షణ కాలం మళ్ళీ మౌనం వహిస్తాడు.

అంతవరకు బాబా శక్తివంతులైన అద్భుతశక్తులు గల దైవస్వరూపం అనే నమ్మకం వారందరిలో వుందిగాని సాయిని గురు రూపంలో పూజించాలనే భావన ఎవరికీ లేదు. అందువలన గురుపూజ అంటే ఏమి చెయ్యాలో, ఎవరికి చేయాలో, ఎలా చేయాలో అర్థం కాక చూస్తూ వుండిపోయారు. వారి మనోభావాలను గమనించిన సాయి వారికి యిలా బోధించారు.

మీరంతా నన్నొక దివ్యశక్తులు గల ఫకీరుననే, భావనతో పూజించి, అర్చించి, ఆరాధిస్తున్నారు. మరి కొందరు నన్ను సాక్షాత్తు దైవ స్వరూపం అంటున్నారు. కాని చిత్రాతి చిత్రమైన ఈ సృష్టికంతటికీ యజమాని దేముడొక్కడే "అల్లా మాలిక్ హై". నేను ఆయనకు ప్రియ అనుచరుడను మాత్రమే మీకందరికీ నేను తండ్రి వంటివాడిని. మీరు నా నుంచి ఉపయోగం పొందాలి. మీ ఆలోచనలను, ఆచరణలను భౌతిక దృష్టి నుంచి ఆధ్యాత్మికం వైపు మరల్చి మీ అందరిలో సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను పెంచి పోషించి, వాటి ద్వారా మీకు మీ ద్వారా మానవ జాతికంతటికీ శాంతి సౌఖ్యాలను ప్రసాదించే దారిని చూపించటానికే నేను వచ్చాను. యిది ఈ

సాయి అవతార లక్ష్యం. అందరి దేముళ్ళను పూజించినట్లుగా నన్ను కూడ ఒక ఫోటోలో పెట్టి పూజచేసి వూరుకుంటే మీరు నావలన ఉపయోగం పొందలేరు. నన్ను మీ గురువుగా భావించి నాకు మీరు సర్వస్వశరణాగతులై నా జీవితంలో నేను స్వయంగా ఆచరిస్తున్న విధానాలు, మీకు బోధిస్తున్న విషయాలను జాగ్రత్తగా అవగాహనే చేసుకుంటూ వాటిని ఆచరణలో పెట్టాలి. మీరు చేయు (కర్మలు) పనులే మీ భవిష్యత్ జీవితాలకు రాబోయే జన్మలకు కూడ పునాదులు. ఈనాటి ఈ వ్యాస పూర్ణిమను మీరంతా గురుపూర్ణిమగా భావించి గురువుగా నన్ను ఆరాధించి ఆనందించి తరించవచ్చును అని మృదు మధురంగాను, అతి సున్నితంగాను విషయాన్ని వివరించి చెపుతాడు.

గురుపూర్ణిమ

అక్కడి వారందరిలో మొదటగా దాదా కేల్కర్ పూజా పళ్ళెంతో బాబావద్దకెళ్ళి సాష్టాంగ ప్రణామంచేసి పాదాలను కడిగి ఆ తీర్థం కొంత లోపలికి తీసుకుని తాను తలపై జల్లుకొని అక్కడి వారందరికీ యిచ్చిన తరువాత బాబా నుదుటిపై గంధంపూసి బొట్టుపెట్టి అక్షంతలు పూలతో పూజించి, బాబాకు ముందుగా కొబ్బరికాయను కొట్టి కర్పూరపు అరతిని యిస్తూ వుంటే బాబాయొక్క ముఖం దేదీప్యమానంగా వెలిగిపోతూ క్షణక్షణానికి రంగులు మారుతున్నట్లుగా చూపరులకు కనిపిస్తూ వుండగా ఆశ్చర్యాన్ని పొందిన ఆనాటి భక్తులంతా బాబా పాదాలను తాకి నమస్కరించాలని తహతహలాడారు. వారి మనోభావాలను గమనించిన బాబా ద్వారకామాయి ముందుభాగంలో తాను లోగడ సృష్టించిన రాయి వద్దకు అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూ వుంటే మిగిలిన భక్తులందరు వారి వారి పూజాపాత్రలలోగల పూలను బాబా అడుగు వేయబోయేముందుగా నేలమీద వేసుకుంటూ పూలపై నడిపించుకుంటూ ముందుకు వస్తారు. రాతి దగ్గరకు చేరిన బాబా దానిపై కూర్చుని ఎడమ చేతిని కుడికాలు బొటన వ్రేలుపై అన్చి కుడి చేతిని కుడి కాలు తొడపై వుంచుకుని దృష్టిని కేంద్రీకరించి ఒక్కొక్క భక్తుని రెండు కళ్ళలోకి చూపును కలిపినప్పుడు, బాబా యొక్క చూపులు భక్తుల హృదయాలలోకి చొచ్చుకొని పోయి హృదయ వీణ యొక్క తీగలు మీటినట్లుగా మధుర భావనలు హృదయంలో మొలకెత్తి అంతవరకు జీవితంలో ఎన్నడూ అనుభవించని ఆనందాన్ని వారు అనుభవిస్తూ, పరవశులై బాబా పాదాలమీద తలవాల్చి నమస్కరిస్తే వారి

పాదాలలో నుంచి ఏదో దివ్యశక్తి భక్తుల శరీరాలలోకి ప్రవేశించి హృదయంలోకి వెళ్ళినట్లుగా అనుభూతి పొందేవారట. సద్గురువు నుంచి లభించే ఈ శక్తి పాతం ఎవరికి వారు అనుభవించి ఆనందించాలే తప్ప వర్ణించటానికి వీలుకాదు. ఆనాటి ఆ విచిత్రసంఘటనలను, అనుభూతులను స్వయంగా అనుభవించిన వారంతా ఆ మరుసటి ఆషాడ శుద్ధపూర్ణిమ నుంచి గురు పూర్ణిమ ఉత్సవాన్ని మేళతాళాలతో, బాజా భజంత్రీలతో, వివిధ రకాల అలంకరణలతో చేయటం ప్రారంభించారు. ఈ నాటికీ ఈ గురు పూర్ణిమ షిరిడిలో నిర్వహించబడుతున్నది. సాయి భక్తులందరికి అతి ముఖ్యమైన ఈ గురుపూర్ణిమనాడు తమ శక్తి కొలది అందరూ గురువును పూజించి గురు అనుగ్రహాన్ని తప్పక పొంది తీరాలి. భక్తి శ్రద్ధలతో ఆ రోజున గురుపూజ చేయువారికి గురువు సులభ సాధ్యుడై నిరంతరం తోడు నీడగా వుంటాడు. సాయిబాబా తాను స్వయంగా చెప్పిన ప్రకారం సద్గురువు కాబట్టి వారిని మించిన గురువు మనకు ఈ భూగోళంలో యింకొకరు దొరకరు. వారికి మనం సర్వస్వశరణాగతులమై జ్ఞానమార్గాన్ని మనకు చూపించమని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని ముగిద్దాము. ఈ అధ్యాయాన్ని భక్తి శ్రద్ధలతో పారాయణ చేయు వారికి బుద్ధి వికశించి సత్య దృష్టి కలుగుగాక!

ఓం శాంతి శాంతి శాంతిః

పదునాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పదిహేనవ అధ్యాయము

పదవ అధ్యాయములో మీనతాయి ప్రసవవేదనకు బాబా విభూది పంపి రక్షించిన కథను తెలుసుకున్నాము. ఈ అధ్యాయంలో మరికొన్ని వూదీ మహిమలను కూడ తెలుసుకుందాము. బాబా తన భక్తులకు ఊదీ ప్రసాదము యిచ్చుట ద్వారా ఏమి బోధించదలచెనో తెలుసుకొనవలెను. ఈ ప్రపంచములో మనకు కనిపించు ప్రతి వస్తువు చివరికి నశించి బూడిదగా మారును. ఆఖరికి మన శరీరం కూడ అంతే, శరీరంలో నుంచి ప్రాణం పోయిన తరువాత దానిని దహనం చేస్తే కొద్దిపాటి బూడిదగా ఈ శరీరం మారిపోతుంది. యిలాంటి అశాశ్వితమైన ఈ శరీరం కోసం ఎన్నో ఆశలు, వ్యామోహాలు, అన్యాయాలు, అక్రమాలు, పాపాలు చేస్తావెందుకు? అశాశ్వితమైన ఈ సృష్టిలో నీవు అనుకునే ఈ శరీరం కూడ ఈ బూడిదవలె

అశ్వాశ్వితమైనదని తెలుసుకోమని హెచ్చరించటానికే బాబా భక్తులందరికీ విభూదిని యిచ్చేవాడు. బాబా యిచ్చే ఈ ఊది ఎలా పనిచేసేదో తెలుసుకుందాము.

విభూది మహిమలు

నాసిక్ నివాసి ఆనందాశ్రమము అను హోటల్‌యజమాని నారాయణరావు స్నేహితునికి ఒకసారి తేలు కుట్టెను. ఆ బాధ భరింపరానిదిగా వుండెను. నారాయణరావు బాబా వూదీ కొరకు వెదుకగా కనిపించలేదు. వెంటనే బాబా పటం వద్దకు వెళ్ళి ప్రార్థించి పటం ముందు రాలిపడిన అగరువత్తి బూడిదను చిటికెడు తీసి తేలు కుట్టినచోట వ్రాసి చేయి తీయగానే వారికీ ఆశ్చర్యము కలుగునట్లుగా నొప్పి తగ్గిపోయెను.

బాంద్రాలో గల బాబా భక్తుని కుమార్తె మరొక గ్రామమునకు వెళ్ళి ప్లేగు జ్వరముతో బాధపడెను. అతడు తనవద్ద సాయి విభూది లేదని కొంత తనకు పంపమని నానా చందోర్కరకు కబురుపంపెను. ఆ వార్త నానాకు ఠాణా రైల్వేస్టేషన్‌లో తెలిసెను. అప్పుడు ఆయన తన భార్యతో కళ్యాణ్ పోవుటకు స్టేషన్‌కు వెళ్ళెను. వారి వద్ద కూడ వూదీ లేదు. నానాకు ఏమి చేయుటకు తోచలేదు. సాయిని ప్రార్థించెను. బాబా నీ విభూదిని విశ్వాసముతో కోరిన వారికి నేను పంపలేకపోతున్నాను. నీవు సర్వ శక్తివంతుడవు. నీ పేరున ఈ మట్టిని తీసి ఆ గ్రామములో గల భక్తురాలికి పెట్టినట్లుగా భావించి యిక్కడ నా భార్య నొసట పెట్టుచున్నాను. నీవు ఆ బాలిక ప్లేగుజ్వరాన్ని వెంటనే తగ్గించమని ప్రార్థిస్తాడు. కబురు తెచ్చిన భక్తుడు యిదంతా చూసి తిరిగి వెళ్ళగా యిక్కడ నానా చందోర్కరు తన భార్య నుదిటిపై మట్టిని బాబా పేరుతో పెట్టిన క్షణం నుంచి అక్కడ ఆ బాలిక ప్లేగు జ్వరం తగ్గినట్లుగా తెలుసుకుని ఆశ్చర్యపడతాడు.

మాలెగాంలో గల ఒక డాక్టరు మేనల్లునికి ఎన్ని మందులు వాడినా నయం కాని రాచపుండు బాగు చేసుకొనుటకు అతని తల్లిదండ్రులు అతనిని షిరిడీకి తీసుకుని రాగా బాబా వారితో కురుపుపై ఊదీని పూయుడు. ఒక వారం రోజులలో నయమగును. యిదిమసీదు కాదు, ద్వారవతి. ఎవరైతే యిందు కాలు- మోపెదరో వారు ఆరోగ్యమును ఆనందమును పొందెదరు. వారి కష్టములన్నీ గట్టెక్కును. అంటూ బాబా ఆ కురుపుపై తన చేతిని వేసి నిమిరెను. కరుణతో నిండిని తన చూపులను

ఆ కుర్రవానిపై ప్రసరింపజేసెను. వూదీరాయగా బాధ నెమ్మదించెను. క్రమముగా తగ్గిపోయెను.

ఒకసారి శ్యామా తమ్ముని భార్యకు ప్లేగు వ్యాధి వచ్చెను. చంకలో రెండు బొబ్బలు లేచెను. శ్యామాను అర్థించి బాబా సహాయమును కోరుమనెను అప్పటికి రాత్రి అయ్యెను. శ్యామా బాబా వద్దకు పరుగెత్తి విషయం చెప్పెను. బాబా ఈ రాత్రి యందు నీవు వెళ్ళవద్దు. ఊదీ పంపుము భయములేదు మనకు అందరకూ తండ్రి, యజమానియు ఆ దైవమే. అందరికీ దైవము ఒక్కడే "సబ్‌కా మారిక్ ఏక్ హై". భయము లేదు. నీవు రేపు ఉదయమే వెళ్ళి త్వరగారమ్ము అని సలహా ఇచ్చి విభూదిని అతని తమ్ముని చేతిలో వుంచెను. శ్యామా బాబా సలహా ప్రకారం ఉదయమే వెళ్ళగా ఆమె పూర్తిగా ఆరోగ్యాన్ని పొంది స్వయంగా టీ తయారుచేసి తనకు యిచ్చుట చూసిన శ్యామా ఉదయము వెళ్ళి రమ్ము అన్న బాబా మాటలు తలచుకొని ఆనందాశ్చర్యములలో మునిగిపోయెను.

డాక్టరు పిళ్ళేయను వాడు బాబాకు ప్రియమైన భక్తుడు. అతడు తరచుగా బాబా దగ్గర కూర్చునెడి వాడు. బాబా కూడ అతనిని ఎక్కువగా ప్రేమిస్తూ అనేక విషయములు మాట్లాడుతూ వుండెడివాడు. ఒకసారి ఈయనకు నారిపుండు వ్యాధి వచ్చెను. భరించలేని బాధను అనుభవించుచుండెను. కాకా దీక్షిత్ దగ్గరకు వెళ్ళి ఆ బాధ తాను భరించలేనని. మరణమే ఈ బాధ కన్నా సుఖమనిస్తున్నదని, బాబావద్దకు వెళ్ళి తనకు బదులుగా వారిని ప్రార్థించి ఈ బాధ తీవ్రతను తగ్గించి దానిని పది జన్మలకు పంచి పెట్టవలసిందినదిగా కోరమని చెప్పెను. దీక్షిత్ ఈ విషయం బాబాకు వివరించగా బాబా మనస్సు కరిగి కరుణాదృష్టితో అతడేల పదిజన్మల కాలము బాధ పడవలెను. భయమును వదలమని చెప్పుము. గత జన్మలలో అతడు చేసిన పాపమును పదిరోజులలోనే నేను నశింప చేయగలను. యిహ పరసౌఖ్యము లిచ్చుటకు నేను ఈ ద్వారకామాయిలో సిద్ధముగా కూర్చుని వుండగా భక్తుడు చావును ఎందుకు కోరవలెను? అతనిని యిక్కడకు తీసుకురండి. ఆ బాధను శాశ్వితముగా తొలగించెదమని చెప్పగా పిళ్ళేను తీసుకువచ్చి ద్వారకామాయిలో కూర్చొబెట్టగా బాబా అతనికి తన బాలీసును యిచ్చి పుండుపై చేయివేసి నిమిరి తన అభయ హస్తమును చూపుచూ నెమ్మదిగా విశ్రాంతి తీసుకొనుము. బాధలకు అసలైన మందు మన గత జన్మ పాపములను అనుభవించి తద్వారా విముక్తి

పొందుటయే. కష్టసుఖములకు మనము చేయు కర్మలే కారణము కొంచె మోర్పు కొనుము. అల్లాయే ఆర్చి తీర్చువాడు. దేముని ధ్యానించిన నీ క్షేమమును చూచును. దైవమునకు శరీరము, మనస్సు, ధనము, వాక్కు సమస్తము అర్పించి సర్వస్వ శరణాగతి కావలెను. అట్లు చేసిన భగవంతుడు తప్పక మనలను రక్షించి తీరును. భగవంతుడు మనందరికీ యజమాని. "అల్లా మాలిక్" యిప్పుడే ఒక కాకి వచ్చిపొడుచును. అప్పుడు నీ కురుపు నయమగునని చెప్పెను.

యింతలో అబ్దుల్ అను క్షురవాడు వచ్చి దీపములను తుడిచి బాగు చేయుచుండగా అతని కాలు పిళ్ళే కురుపు మీద పడగానే ఆ పుండులో నుంచి ఏడు గినియా పురుగులు బయటకువచ్చెను. ఆ తరువాత ఊదీ తినుటవలన పైన వ్రాయుటవలన ఎలాంటి మందులు వాడకుండా పదిరోజులలో పూర్తిగా మానిపోయెను.

యిరానీ వాని కుమార్తెకు ప్రతి గంటకు వచ్చు మూర్ఛలు, హార్దా పురమను వూరిలో వృద్ధునికి. మూత్రకోశములోగల రాయి, బొంబాయికి చెందిన స్త్రీకి ప్రతి కాన్పుకు యోనికి అడ్డంగా తిరుగు పిండం, యివి అన్ని బాబా యొక్క విభూదితో పూర్తిగాను సురక్షితంగాను నయమయ్యెను.

బాంద్రాలో నివసించు ఒక పెద్ద మనిషి నిద్రించుటకు నడుము వాల్చగానే ఎప్పుడో చనిపోయిన తన తండ్రి స్వప్నములో కనిపించి భయంకరంగా తిడుతూండటంవలన వెంటనే లేచి కూర్చునేవాడు. ఈ విధంగా అతడు చాలాకాలము నిద్రపట్టని ఈ విచిత్ర జబ్బుతో బాధపడుతుండటం చూసిన అతని స్నేహితుడు సాయిబాబా విభూదిని ప్రతిరోజు పరుండునప్పుడు నుదిటిపై బొట్టు పెట్టుకుని కొంచెం నోటిలో వేసుకోమని చెప్పెను. అలా చేయుటవలన అతనికి ప్రతిరోజు మంచి నిద్ర పెట్టేటిది. ఆ తరువాత అతడు బాబా ఫోటోను యింటిలో పెట్టి పూజిస్తూ సాయి భక్తుడయ్యెను.

కాకా మహాజని స్నేహితుడు విగ్రహారాధనను అంగీకరించడు. వింతలు, తమాషాలు స్వయంగా సాయిబాబా వద్ద చూడాలనే ఉద్దేశంతో అతడు ఒకసారి కాకాతో షిరిడికి వెళ్ళెను. బాబాకు దక్షిణ యివ్వనని, నమస్కరించననీ ముందుగానే కాకాకు చెప్పెను. యిద్దరూ షిరిడికి చేరగనే కాకజని స్నేహితుడిని బాబా ముందుగా మంచి మాటలతో ఆహ్వానించెను. బాబా యొక్క కంఠధ్వని, ఆ మాటలు అన్నీ

ఎప్పుడో మరణించిన అతని తండ్రి మాటలవలె వినిపించెను. ఒక్క క్షణకాలం బాబా రూపంలో తన తండ్రి కనిపించెను. అతని సంతోషమునకు అంతులేదు. వీరు తప్పక నా తండ్రిగారే అనుకొనుచూ అప్రయత్నంగా మసీదు మెట్లు ఎక్కి బాబా పాదములపై బడి కన్నీరు మున్నీరుగా ఏడ్చెను. కొద్ది క్షణాల తర్వాత లేచి కూర్చొనగా మరల బాబా మామూలుగా కనిపించెను. అప్పుడు సాయి అతనితో నీకు దక్షిణ యిచ్చుటకు యిష్టములేదు. అందువలన నిన్ను అడుగలేదు. నీకు నాకు మధ్య గల ఆ తెరను తీసివేయుము. అప్పుడు మనిద్దరము ఒకరినొకరు చక్కగా చూసుకొనగలము, కలుసుకొనగలము, ఆనందించగలము. నీవు వేరు, నేను వేరు కాదు మనిద్దరం ఒక్కటే. నాలోనే నీ వున్నావు. నీలోనే నేనున్నాను. యిక ముందైనా బేధం భావం విడిచి పెట్టుము. అని చెప్పి త్వరగా యింటికి తిరిగి వెళ్ళుమని ఆదేశించెను. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేమంగా అతడు తిరిగి యింటికి వెళ్ళెను. బాబా చెప్పిన పైమాటలను అతడు పదే పదే గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని ఎంతో కాలం అనుభవించాడు. యింటికి వెళ్ళి తలుపుతెరువగానే లోపలి నుంచి ఒక పిచ్చుక వేగంగా బయటకు ఎగిరిపోయెను. లోపల రెండు చనిపోయి వుండెను. అతడు షిరిడికి వెళ్ళినప్పుడు పొరపాటున ఆ మూడింటినీ లోపల వుంచి యింటికి తాళంవేసి వుండవచ్చును. వాటిలో రెండు మరణించినా మూడవ దాని ప్రాణం నిలుపుటకై బాబా తనను వెంటనే యింటికి పంపెనని అతడు గ్రహించి పశు పక్ష్యాది జీవులపై కూడ బాబాకు గల ప్రేమను గ్రహించి ఆశ్చర్యపడెను.

కొందరు బాబాను విమర్శనా దృష్టితో చూచెడివారు. హిందూ మతంలోగల అనేక శాఖలు, ఉప శాఖలు మతాన్ని చిన్నా భిన్నం చేయుటచే ఆఖరికి దేముడే లేడేమోనని సామాన్య మానవుడు ఆలోచించే స్థితి వచ్చింది. దీనికి తోడు భౌతికతత్వం బాగా పెరగటంవలన సినిమాలలోను,నవీన సాహిత్యంలోను, దైవ భక్తులను పనికి మాలినవారుగా, అసమర్థులుగా ప్రదర్శించి చూపుతూ వుండటంవలన నవీన నాగరికతకు అలవాటు పడిన యువతారానికి దేముడు, దైవభక్తి ఒకవెక్కిరింతగా తయారైనది. అలాంటి ఆధునిక భావాలు గల హైకోర్టు ప్లీడరగు ధక్కర్‌నకు ఒక కంపెనీ వుండెడిది. అందులో కాకా మహాజని మేనేజర్‌గా పని చేయుచుండెడివాడు. దైవభక్తి కన్నా ఆధునిక విద్యలు, తెలివి తేటలు, ముఖ్యమని తోటిమనిషిని ప్రేమించటం ముఖ్యంగాని దేమునికి నైవేద్య పెట్టటం వృధా అనే మానవతావాది ధక్కర్. కాకా తరచు షిరిడికి వెళ్ళి చాలారోజులు వుండటం మొదలైన బాబా లీలలు విన్న తరువాత ఒకసారి బాబాను పరీక్షచేసి ఈ మహిమలలోని నిజాన్ని

బట్టబయలు చేయాలని దక్షిణ ద్వారా ధనం పోగుచేస్తున్నాడని నిరూపించాలని ధక్కర్ హోళీ శెలవులలో కాకాతోపాటుగా షిరిడికి వెళ్ళెను. కాకా బాబాకు సమర్పించుటకు రెండు సేర్ల ఎండు ద్రాక్ష పళ్ళను తీసుకొనెను. షిరిడికి వెళ్ళి బాబాను దర్శించి కాకా ద్రాక్షపళ్ళను బాబాకు సమర్పించగా వాటిని అక్కడి వారందరికీ పంచి పెట్టమని బాబా ఆజ్ఞాపించెను. వాటిని నోటిలో వేసుకొని నమిలి గింజల నేమి చేయవలెనో తెలియని ధక్కర్ మసీదులోపల వేయుట గౌరవముగా నుండదని భావించి వాటిని చాలా చిరాకుపడుతూ జేబులోనే వేసుకొనెను. అలా తినిన ద్రాక్ష పళ్ళ గింజలు జేబులో వేసుకొనుట తన హోదాకు తగిన పనికాదని, చాలా అసహ్యాకరమైన పని అని భావించి తన చేత తనకు యిష్టములేని అలాంటి పని చేయించినందుకు బాబాను తన మనస్సులోనే ప్రశ్నించెను. యిదేనా నీమహత్యం, గొప్పతనం, అంటూ తన మనసు లోపలనే నిలదీసి అడిగెను.

అతని మనోభావములను గ్రహించగలిగిన బాబా అతనిని తన దగ్గరకు పిలిచి అంతకు ముందు పంచగా మిగిలిన వాటిలో నుంచి మరికొన్నిటిని తీసి అతని చేతిలో పెట్టి తినుమనెను అతడు తినుటకు యిష్టములేక చేతిలో పట్టుకుని కూర్చుండెను. మరల బాబా తినమని హెచ్చరించగా వారి యాజ్ఞానుసారము వాటిని తినగా అందులో ఏ ఒక్క ద్రాక్షపండులోను గింజలులేవు. అతని ఆశ్చర్యమునకు మేరలేదు. అందిరినీ ప్రశ్నించి అందరికీ గింజలు గల ద్రాక్ష పండ్లు వచ్చినవని తెలుసుకొనెను. మహిమలను చూడవలెనని కోరిన తనపై బాబా ఈ మహిమను ప్రయోగించారని తలచి సంతోషపడుతూ వుండగా కాకా అతనిని తన యజమాని అని బాబాకు పరిచయం చేసెను. అప్పుడు బాబా అతను నీకు యజమాని కావచ్చును. కాని అతని యజమాని (దేముడు) మరియొకడు కలడు. ఆయనే అందరికీ యజమాని. "అల్లా మాలిక్ హై" అంటూ ధక్కర్‌ను ఆశీర్వదించగా అతడు తనను తాను మరచి బాబా పాదములపై పడి సాష్టాంగ నమస్కారము చేయగా బాబా పాదములు కళ్యాణతిలకం దిద్దిన విష్ణుమూర్తి పాదములవలె ఎర్రని పారాణీతో ధగధగలాడుచుండెను. కళ్ళు జిగేలుమనగా మరల లేచి చూచుసరికి మామూలు పాదములే కనిపించెను. ఆ విచిత్ర దృశ్యమును చూచి ధక్కర్ మరింత భక్తి భావంతో రెండవసారి పాదనమస్కారం చేయగా ధక్కరుతో బాబా "దైవం సర్వశక్తి స్వరూపం. సర్వవ్యాపకం. సర్వసమర్ధవంతం. విరాట్ దైవస్వరూపం పంచేంద్రియాలకు, బుద్ధికి అంత తేలికగా అందే శక్తికాదు. ప్రతి మానవుడు ఆ దైవశక్తిని చేరుకునే ప్రయత్నం చేయాలి. మానవసేవ కూడ మాధవసేవే అయినా

దైవాన్ని విస్మరించరాదు". అని చెప్పి దక్షిణ గురించి అతని మనస్సులో గల సందేహం నివారించుటకు యిట్లు మరల చెప్పెను

"ఈ మసీదు తల్లికి ఎవరు ఋణపడెదరో వారినే నేను దక్షిణ అడిగెదను. ఆ తల్లి ఎవరిని చూపునో వారి వద్దనుంచే దక్షిణ తీసుకొనెదను. ఒకరూపాయి నేను ఎవరిదగ్గరనుంచైనా తీసుకొనినచో దానికి పదిరెట్లు వారికి తిరిగి ఇవ్వవలెను. యిది నా నియమము. దానమిచ్చువాడు ప్రస్తుము విత్తనములు నాటుచున్నాడు. అది ముందు గొప్ప పంట పండును. ఈ జన్మలో యితరులకిచ్చిన గాని మరుజన్మలో దానిని పొందలేవు. దానమువలన వైరాగ్యము పెరుగును. వైరాగ్యమువలన భక్తి, దానివలన జ్ఞానము కలుగును. ఇప్పుడు ఒక రూపాయి దానమిచ్చి ముందు ముందు పదిరూపాయలు లాభం పొందవచ్చును.

సాయికి సర్వం సమర్పణ

బాలాజీ పాటిల్ నెవాస్కరు అనునతడు షిరిడి నివాసి. బాబాకు గొప్పభక్తుడు. మొదట యితడు బాబా తిరుగుదారులన్నిటినీ తుడిచి శుభ్రపరచువాడు. యితడు ప్రతి సంవత్సరం తన పొలములోని పంటను కోయగానే మొత్తము పంటను తెచ్చి బాబాకు అర్పించెడివాడు. బాబా యిచ్చిన దానిని మాత్రం తీసుకుని వెళ్ళి కుటుంబాన్ని పోషించుకుంటూ వుండేవాడు. బాబాపై యింత విశ్వాసముంచినందుల కేనేమో ఆ కుటుంబం ఏనాడు దేనికొరకు శ్రమపడలేదు. బాబా అభయ సూత్రమైన- "నా భక్తుని యింటిలో లేదు అనుమాట వినిపించదు" -అను దానికి ప్రతీకగా నేవాస్కరు కుటుంబ జీవితంలో ఏనాడు దేనికి బాధపడలేదు. యిందుకు ఒక ఉదాహరణ.

ఒకనాడు వీరి కుటుంబము కొందరు బంధువులను భోజనమునకు పిలవగా భోజన సమయమునకు పిలిచిన వారికంటే మూడురెట్లు బంధువులు వచ్చిరి. వండిన పదార్ధములు చాలవని వారు ఆందోళన చెందిరి. సాయిపై భారంవేసి, వంటలు చేసిన అన్ని పాత్రలపై గుడ్డలను కప్పి లోపల సాయి విభూదిని చల్లి గుడ్డనుపూర్తిగా తీయకుండా వడ్డనను ప్రారంభించిరి. వచ్చిన వారందరూ భుజించగా యింకనూ మిగిలెను. నా భక్తుని యింటిలో లేదు అనుమాట వినిపించదు అన్న బాబా అభయం ఈ సంఘటన ద్వారా నిజమైనది.

ఈ అధ్యాయములోని విభూది మహిమలను పారాయణ చేసిన భక్తులు సాయి విభూదిని సర్వరోగ నివారణిగా భావించి దగ్గర వుంచుకొనవలెను. ప్రతి రోజు ఉదయం ముఖ ప్రక్షాళన కాగానే చిటికెడు విభూది నోటిలో వేసుకుని నీరు త్రాగితే మంచిది. ఏదైనా కొత్త వస్తువును ఖరీదు చేసి తెచ్చినపుడు మొట్ట మొదట బాబా విభూదిని చల్లి దానిని పవిత్ర పరచి ఆ తరువాతే దానిని ఉపయోగించవలెను. స్నానం చేయగానే నుదట బొట్టుగా పెట్టుకొనవచ్చును.

ఓం శాంతి శాంతి శాంతిః
పదిహేనవ అధ్యాయం సంపూర్ణం.

పదహారవ అధ్యాయము

సాఠేబాబాకు సన్నిహితముగా మెలిగినా ఆధ్యాత్మికంగా ఎక్కువ అభివృద్ధిని సాధించలేకపోయెను. వయసు మళ్ళినా అతడు కామమును జయించలేకపోయెను.

సాఠేను పతనము నుండి రక్షించుట

షిరిడి గ్రామంలో పురుషులను శరీరిక సుఖం కొరకు ఆకర్షించు చెడు ప్రవర్తనగల ఒక అందమైన స్త్రీ వుండెడిది. అక్కడికి వెళ్ళవలెనని అనుకున్న సాఠే ముందుగా బాబా దగ్గరకు వెళ్ళగా బాబా శాలకు వెళ్ళుచున్నావా అని ప్రశ్నించెను. ఆ స్త్రీ వుండు ప్రదేశమును అక్కడి వారు శాల అని పిలిచెడివారు. కాని సాఠేకు ఆ విషయం అర్థం కాక శాల అనగా పాఠశాల అనే భావనతో యింకేదో సమాధానం చెప్పెను. ఆ తరువాత స్త్రీ యింటికి వెళ్ళి వరండాలో కూర్చుని ముందుగా ఆమెతో కొన్ని సరససల్లాపములను సాగించెను. వారి మాటలు నైతిక పతనమునకు సంసిద్ధముగా నుండెను. సాఠే లోపల ప్రవేశించుటకు సిద్ధమై గది తలుపులను తెరవగా ఎదురుగా బాబా నిలబడి తన పదునైన చూపులతో సాఠేను హెచ్చరిస్తున్నట్లు కనిపించెను. చేతితో ఏవో సైగలు చేసెను. యింత శ్రమపడి నా దగ్గరకు వచ్చినది యిలా పతనమవటానికా? అని అడిగినట్లుగా సాఠేకు అనిపించెను. అతడు వెంటనే వెను తిరిగి మసీదుకు చేరెను. బాబా పాదములంటి మరల ఈ జన్మలో ఆ యింటిలోనికి అడుగు పెట్టనని మనో నిశ్చయము చేసుకొనెను. అది గ్రహించిన బాబా అభయ హసమునెతి ఆశీర్వదించెను. ఈ సంఘటనలో బాబా నోరు అంచ

ఏమీ మాట్లాడలేదు. మౌనభావాలతోనే కథను నడిపారు. సాఠేవలె తన వాడు ఏ తప్పు చేస్తున్నా అది అతనికి మాత్రమే అర్థం అయ్యేవిధంగాను, యింకెవరికీ తెలియనీయకుండాను,సాయి తన భక్తులను సంస్కరించేవాడు.

మేఘశ్యాముడు

మేఘుడు గొప్ప శివ భక్తుడు, బాబాను శివ అవతారం అని భావించేవాడు. అతని శివభక్తికి నిదర్శనంగా పానపట్టంలో వున్న శివలింగాన్ని ఎవరో భక్తులు బాబాకు యివ్వగా వారు దానిని మేఘునికి బహూకరిస్తారు. అతడు దానికి ప్రతినిత్యం అభిషేకం చేసేవాడు. తరువాత దానిని గురుస్థాన్ వద్దగల వేపచెట్టు క్రింద ప్రతిష్టించారు. నేటికీ దానిని మనం చూడవచ్చును. ఒకనాడు మధ్యాహ్నం మేఘుడు సాఠేవాడాలో తలుపు లోపల గడవేసుకుని నిద్రించుచుండెను. కలలో బాబా కనిపించి మేఘా! శివలింగమునకు దగ్గరలో త్రిశూలమును వ్రాయుమని చెప్పి అక్షింతలను అతనిపై చల్లెను. వెంటనే మేల్కొని చూడగా బాబా కనిపించలేదు. గదినిండా కలలో బాబా చల్లిన అక్షింతలు పడివుండెను.

మేఘుడు ద్వారకామాయికి వెళ్ళి నీ విప్పుడు త్రిశూలమును రచించమని వాడాకు వచ్చి ఆదేశించితివా అనెను. ఔనని బాబా తలవూపెను. నేను తలుపు లోపలి గడివేసుకుని పడుకుని వుండగా నీవెట్లు రాగలిగితివని మరల ప్రశ్నించెను. అందుకు బాబా బిడ్డా సాయి అనగా ఈ కన్పించు శరీరమనుకుంటివా! నేను అన్ని చోట్ల కలను సృష్టి అంతా వ్యాపించి వున్నాను. నా రాకకు తలుపులు, గోడలు యింకేమీ అడ్డురాలేవని చెప్పెను.

మేఘశ్యాముడు 1912లో మరణించెను. అప్పుడు బాబా స్వయంగా వెళ్ళి ఆ మృతశరీరాన్ని తాకి యితడు నా నిజభక్తుడని కన్నీరు కార్చెను. అతని శరీరానికి చేయవలసిన కర్మకాండలకు అగు ఖర్చు బాబాయే స్వయంగా యిచ్చి తన తరపున ఆ కార్యక్రమమును చేయుమని కాకా దీక్షిత్‌ను నియమించెను. ఆ తరువాత కొద్దిరోజులకు శ్యామా బాబా ఏకాంతంగా వున్న సమయం చూసి మసీదులోకి వెళ్ళి బాబా నీ విచిత్ర చర్యలు మాకు అర్థమగుటలేదు. ఎందరెందరో చనిపోగా మేమంతా విలపిస్తూ వుంటే, మరణం శరీరానికి గాని ఆత్మకు కాదని ఆత్మనిత్యము, సత్యము అని మాకు బోధించే మీరు మేఘుడు మరణించినప్పుడు కన్నీరు కార్చి శవము వెంట కొంతదూరం వెళ్ళి వదలలేక విలపిస్తూ తిరిగి వచ్చితిరేమి? అతనిపై మీకింత

మమకారానికి కారణం ఏమిటిని అడుగుతాడు. అందుకు బాబా చిరునవ్వు నవ్వుతూ శ్యామా మంచి ప్రశ్ననే వేసితివి. నీకు వచ్చిన రెండు సందేహములు సత్యములే. కాకపోతే ఆ రెంటినీ సమన్వయ పరుచుకోవటమే అవసరం. ప్రతి విషయానికి దేశకాల పరిస్థితులు, కాల కారణ కర్మాలు వుంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని ఏ విషయాన్నైనా ఆలోచించి అవగాహన చేసుకోవాలి. అది లేనప్పుడు అప్పుడప్పుడు గురువును విమర్శనాత్మకంగా చూడవలసి వస్తుంది. గురువునే విమర్శించే స్థితి శిష్యుని వద్ద వున్నప్పుడు అతడు ఆ గురువు నుంచి ఉపయోగం పొందలేడు సరికదా! తన పద్ధతిలోనే ప్రవర్తిస్తూ గురువుకు మనస్తాపం కలిగిస్తూ ఉంటాడు. అర్థంకాని విషయాలను మీకు తెలిసినంతలోనే నిర్ణయించుకుని నిర్ధారించుకుంటే మంచిది కాదు. యిలాంటి స్థితి ప్రతి శిష్యునికి వస్తుంది. కాని ఎవరైతే గురువుకు సర్వస్వ శరణాగతి అవుతారో వారు మాత్రం గురువు ఏం చేసినా అది తమ మంచికేనని భావిస్తారు. వారి మనసులో ఈ ద్వంద్వ భావం ఏర్పడే అవకాశమే వుండదు.

ప్రస్తుత విషయంలో ఆత్మనిత్య సత్యమేనే విషయం యదార్ధమే. నశించేది మరణించేది శరీరంగాని ఆత్మకాదు. సాధారణంగా మరణించే మనుమలంతా మళ్ళీ యింకో శరీరంలో జన్మించి మనకు కలుస్తూనే వుంటారు. కాని మేఘుడు ప్రాపంచిక విషయాలపై వ్యామోహాన్ని పూర్తిగా వదిలినవాడు. అతనికి జన్మపరంపర నుంచి విముక్తి లభించింది. అతడు తిరిగి జన్మించడు. ఆత్మరూపంలో సూర్య చంద్రాది గ్రహాలను దాటి వెళ్ళిపోతున్నాడు. అందువలనే అతని గురించి బాధపడ్డాను అంటాడు.

అక్కడే గల మహల్సాపతి ఈ వివరణను విని, బాబా విషయాన్ని ఎంత చక్కగావివరించారు. యిప్పుడు అసలు విషయం చక్కగా అర్థమైనదని ఆనందిస్తాడు. బాబా మహల్సాపతిని చూచి భగత్ అడగనివాడెప్పుడూ తెలియనివాడు గానే వుంటాడు. అడిగినవాడు మాత్రం అడిగే వరకే తెలియనివాడుగా వుంటాడు. అడగగానే విషయాన్ని తెలుసుకోగలుగుతాడు అని చెబుతాడు.

గ్రంధములను బాబా తాకి పవిత్రపరచుట

బాబా భక్తులు కొందరు మత గ్రంధములను పారాయణ చేయుటకు ప్రారంభించునపుడు దానిని బాబావద్దకు తీసుకుని వచ్చి వారి చేతికి యిచ్చెడివారు. బాబా వాటిని తెరచి లోపలి పేజీలను చూచి తిరిగి వాటిని భక్తులకు యిచ్చేవారు. అలా బాబా తాకి పవిత్రమైన గ్రంధములను పారాయణ చేసినచో ఫలితము

ఎక్కువగా వుంటుందని, విషయం చక్కగా బోధపడుతుందని నిర్విఘ్నంగా పారాయణ సాగుతుందని వారి విశ్వాసం.

ఒకసారి కాకా మహజని ఏకనాధ భాగవతమును షిరిడికి తెచ్చెను. శ్యామా దానిని చదువుటకు తీసుకుని మసీదుకు రాగా బాబా దానిని తీసుకుని చేతితో తాకి దానిని తిరిగి శ్యామాకిచ్చి తనవద్దనే వుంచుకొనమని చెప్పెను. అది కాకా పుస్తకము కాబట్టి తిరిగి ఇచ్చి వేయవలెనని శ్యామా చెప్పెను. 'నేను దానిని నికిచ్చితిని. జాగ్రత్తగా నీ వద్ద భద్రపరచుము, అది నీకు ఎక్కువ ఉపయోగపడు"నని బాబా చెప్పెను. యిలా బాబా అనేక పుస్తకములను శ్యామాకు యిచ్చెను. శ్యామా అమాయకుడైన మూఢభక్తుడు. పెద్దగా చదువు లేనివాడు, అధ్యాత్మిక మత గ్రంధములు ఎక్కువగా చదువని వాడు. అందువలనే బాబా బహుశా అతనికి ఎక్కువ పుస్తకములను యిచ్చి వుండవచ్చును.

ఒకసారి రామదాసు అను శ్రీ రామభక్తుడు షిరిడికి వచ్చి కొన్ని రోజులు అక్కడ వుండెను. ప్రతిరోజు మసీదు ముందు భాగంలో విష్ణు సహస్ర నామము, అధ్యాత్మిక రామాయణములను అనేక సారులు పారాయణ చేసెను. ఒకనాడు ఆ రామదాసు విష్ణు సహస్ర నామమును పారాయణ చేయుచుండగా బాబా అతనికి ఒక పనిచెప్పి బయటకు పంపించెను. అతడు పారాయణను ఆపి బాబా ఆజ్ఞ ప్రకారం బయటకువెళ్ళెను. అప్పుడు బాబా ఆ విష్ణు సహస్రనామ పుస్తకమును తీసికొని శ్యామాకిస్తూ, శ్యామా ఈ పుస్తకము చాలా విలువైనది. గొప్ప ఫలదాత. నీకు నేను దీనిని బహుకరించుచున్నాను. దీనిని శ్రద్ధా భక్తులతో చదువుము. ఒకసారి నా గుండె వేగముగా కొట్టుకొనుటచే చాలా బాధపడితిని. ప్రాణాపాయము కూడ సంభవించునేమో అనుకొంటిని. అలాంటి క్లిష్ట పరిస్థితిలో ఈ పుస్తకమును హృదయమునకు హత్తుకొంటిని. అది నాకెంతో మేలు చేసెను. వెంటనే ఆ బాధ తగ్గినది అల్లాయే స్వయముగా వచ్చినన్ను బాగు చేసెననుకొంటిని. అలాంటి గొప్ప మహిమ గల పుస్తకమగుటచే దీనిని నీకు యిచ్చుచున్నాను. రోజుకు ఒక నామము చొప్పున చదివినను ఎంతో మేలు కలుగునని చెప్పెను.

శ్యామా తనకు పుస్తకము వద్దని చెప్పెను. రామదాసు పిచ్చివాడు, మొండివాడు, కోపిష్ఠి అగుటవలన అతని పుస్తకమును తీసుకొనినచో అతనితో తప్పక జగడము వచ్చునని భయపడెను గాని బాబా తనకు మేలు చేయబోతున్నాడని ఆలోచించలేకపోయెను. రామదాసు తిరిగి వచ్చి విషయం తెలుసుకుని చాలా గోల

చేసెను. శ్యామా ఎంత నిదానంగా విషయమంతా చెప్పినా శాంతించలేదు. అప్పుడు బాబా అతనిని దగ్గరకు పిలిచి రామదాసు నీవు చికాకు పడి కోపగించుకుంటున్నా వెందుకు. యిందులో శ్యామా ప్రమేయం ఏమీలేదు. నేను ఆ పుస్తకమును తీసి అతని కిచ్చితిని. శ్యామా మనవాడు కాదా? అనవసరముగా వానితో జగడమాడెదవేల! నెమ్మదిగా ప్రేమతో మాటలాడుము. పవిత్ర గ్రంధములను ప్రతినిత్యం నీవు పారాయణ చేయుచున్నావు గాని నీ మనసు యింకా అపవిత్రముగానే యున్నది. నిజమైన రామదాసునికి సమభావం కావలెను గాని, మమకారం కాదు. ధనమిచ్చిన పుస్తకము లెన్నో వచ్చును కాని మనుష్యులురారు. జాగ్రత్తగా ఆలోచించి తెలివిగా ప్రవర్తించుము. నీకు ఈ పుస్తకము కంఠస్థముగా వచ్చును. శ్యామాను కూడా దానిని చదివి మేలు పొందనిమ్ము. నీ పుస్తకమునకు బదులు కావలెనన్నచో శ్యామా వద్ద నుంచి వేరొక పుస్తకం తీసుకొనుమని చెప్పెను.

బాబా యొక్క మధుర కోమలమైన ఈ బోధను విని రామదాసు శాంతించి పంచరత్న గీతను శ్యామా నుండి కావలెనని కోరెను. బాబా చేసిన పైబోధ కేవలం రామదాసునికే కాదు. మనందరికీ వర్తించును. ఎన్ని పవిత్ర గ్రంధములు చదివినా సాక్షాత్తు భగవంతుని సన్నిధిలోనే కాలం గడిపినా హృదయం పవిత్రం కానిచో ఫలితం వుండదు. బాహ్యా వస్తువుల మీద మమకారం, నేను నాది అనే అహంభావాలు పోవాలి. అందరూ ఒకటేననే సమభావం రావాలి. అలాంటి హృదయ పరివర్తనకు ప్రతివారు ప్రయత్నించాలి.

ఒకసారి బాపుసాహెబ్ జోగ్ తిలక్ రాసిన గీతారహస్యమును గ్రంధమును తీసుకుని బాబా దర్శనమునకై వెళ్ళగా బాబా దానిని అడిగి తీసుకుని లోపలి పేజీలను చూచి తన జేబులోనుంచి ఒక రూపాయి బిళ్ళను తీసి పుస్తకముతోపాటు దక్షిణగా తిరిగి జోగునకిస్తూ దీనిని పూర్తిగా శ్రద్ధగా చదువుము. నీకు మేలు కలుగునని ఆశీర్వదించెను.

బాబా పవిత్ర గ్రంధములను ఆశీర్వదించి యితరులకు యిచ్చునట్లుగానే ఈ నాటికి చాలామంది భక్తులు షిరిడికి వెళ్ళినప్పుడు ఏవైనా పుస్తకాలు కొనుక్కుంటే వెంటనే వాటిని బాబా సమాధిమీద వుంచి పవిత్ర పరచుకొనిన తరువాతనే పారాయణను ప్రారంభిస్తారు. మరికొందరు ఎక్కడ ఏ కొత్త వస్తువు కొనినా బాబాకు సమర్పించుకుండా వుపయోగించరు.

సాయి యుగం

కైలాసంలో వుండే శివరూపం మానుషరూపంలో భూమికి దిగవచ్చిన అవతారం షిరిడి సాయిబాబా. లోకక్షేమం కోసం విషాన్ని కంఠంవద్దే నిలిపి పరుల క్షేమంకోసం తాను బాధను అనుభవించిన దయాళువైన గరళకంఠుడు, బోళాశంకరుడు సాయి. అలాంటి సాయి స్మరణ ఆనందదాయకం. సాయి పూజ శుభప్రదం. వారి సన్నిధిలో వున్నప్పుడు భక్తులు మాటలకందని అలౌకికమైన ఆనందడోలికలలో తేలియాడుతూ వుండేవారట. బాబా తరచు అల్లామల్లిక్ అంటూ వుండే వారు. బాబా మోక్షాన్ని కాని, భగవంతుని యందు సంపూర్ణలయాన్ని కాని కోరక భగవంతునికి ప్రతి రూపాలైన సర్వ ప్రాణులకు సేవచేసి ఆనందింపచేయాలనే ప్రేమ స్వరూపంగా నిలిబడిపోయాడు. సాయి అంటే ప్రేమ. నిస్వార్థ ప్రేమ, పవిత్ర ప్రేమ. కేవలం ప్రేమ కోసమే ప్రేమించే దైవ ప్రేమకుమూర్తీభవించిన రూపం సాయి. వీరి ప్రేమ కేవలం మానవ జాతిపైనే కాక పశు పక్ష్యాది సర్వ జీవులపై కూడ సమంగా వ్యాపించి వుండేది.

ధనం పేరుతో కులం పేరుతో, మతం పేరుతో, జాతి పేరుతో, ప్రాంతాల పేరుతో, రాజకీయ పార్టీల పేరుతో ఎవరికి అందిన జనాన్ని వారు పోగు చేసుకుని నాయకులై మరల ఆ జనానికి సంబంధించిన ధనాన్నే దోచి, దాచి కోట్లకు పడగలెత్తుతూ, అవసరమైతే ఆ జనంపైనే మళ్ళీ మారణహోమం సాగించి ప్రజాసేవకులమని, ప్రజా నాయకులమని ప్రచారం చేసుకునే దోపిడీ దొంగలు, ఖూనీ కోరులూ విపరీతంగా పెరిగిపోతున్న నేటి సమాజంలోకి సాయి ప్రేమతత్వం విపరీతంగా ప్రచారం చేయబడాలి. తద్వారా సమాజంలో సోదర ప్రేమ వ్యాపించాలి. శాంతి సుఖాలు మానవులందరికీ సమంగాను, శాశ్వితంగాను లభించాలి. అదే సాయి ప్రచారలక్ష్యం. అందుకే ఈనాడు సాయి ప్రభంజనం వాడ వాడలా పల్లె పల్లెలా వెల్లువై ప్రవహిస్తున్నది. సాయి తన సర్వశక్తులతో దేశం నలుమూలలా వ్యాపించి, విజృంభిస్తున్నాడు. సాయి యుగం రాబోతున్నది. అన్ని కులాలను, అన్ని మతాలను, అన్ని సిద్ధాంతాలను తనలో అంతర్లీనం చేసుకుని వసుధైక కుటుంబంగా మానవులందరి మధ్యన పరస్పర ప్రేమ బీజాలను నాటే ఈ సాయి శకంలో వున్న ఈ పాఠకులందరూ ధన్యులు. వీరందరినీ సాయి సైనికులుగా మార్చి సాయి ప్రేమ సామ్రాజ్యాన్ని నిర్మించి రక్షించే బలవత్తరమైన సాయి సైన్యంగా తయారు చేయమని సమర్థుడైన సాయిని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటిలో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః
పదహారవ అధ్యాయం సంపూర్ణం.

పదహేడవ అధ్యాయము

ఈ విశాల సృష్టిలో అనేక దేశాలలో అనేక ప్రాంతాలలోకి యోగీశ్వరులను పంపి భగవంతుడు అధ్యాత్మిక విషయాలను ప్రచారం చేయించి పెరుగుతున్న అధర్మాన్ని కొంతవరకైనా సమతూకం చేయుచుండును. యిదియోగీశ్వరుల లేక ప్రవక్తల వ్యవస్థ. యిందులో ఎవరెవరు ఎక్కడెక్కడ నుంచి పని చేయుచున్నదీ మిగిలిన యోగులందరికీ తెలియుచుండును. వాసు దేవానంద సరస్వతి చెప్పినట్లుగా అలాంటి యోగులందరికీ పెద్ద అన్న లాంటి వారు శ్రీ షిరిడి సాయిబాబా.

పూర్వ జన్మములో చేసిన పుణ్యఫలమువల్లనే మనకు యోగులతో పరిచయము కలుగును. అట్టి పుణ్యములేని వారు నిరంతము ఆశలతో సతమతమౌతూ, కోరికలకు బలి అయిపోతూ, కేవలం జంతు జన్మనే గడుపును గాని భక్తి మార్గమున మనసు నిలుపలేరు. అటువంటి పుణ్యఫలముగానే ఈనాడు మనం యోగులందరికీ రాజైన శ్రీ షిరిడి సాయిబాబా జీవితచరిత్రను భక్తి శ్రద్ధలతో పారాయణ చేయగలగుతున్నాము. దీనిని మనకు గల ఒక గొప్ప అదృష్టముగా భావించవలెను.

అప్ప - అనుకన్నడయోగి

ఠాకూర్ అనునతడు రెవిన్యూ శాఖలో గుమాస్తా ఉద్యోగము చేయుచుండెను. ఆయన ఒకసారి 'అప్ప' అను కన్నడయోగిని దర్శించి పాదములకు నమస్కరించగా వారు విచారసాగరమను వేదాంత గ్రంధమును ఆయనకు యిచ్చి దీనిని నీవు తప్పక చదువవలెను. నీ వట్లు చేసినచో నీ కోరికలు నెరవేరును. ముందు ముందు నీవు ఉద్యోగరీత్యా ఉత్తరదిశగా వెళ్ళునప్పుడు నీవు అదృష్టవశమున ఒక గొప్ప యోగిని కలుసుకొనెదవు. వారి దర్శనమువలన నీ మనసుకు శాంతి ఆనందము కలుగును. వారు నీ జీవితగమనమునకు చక్కని దారిని చూపగల సమర్ధులని చెప్పెను.

ఆ తరువాత ఠాకూరు జన్నేరు అను వూరుకు బదిలీకాగా అక్కడికి చేరుటకు లోతైన లోయను దున్నపోతు ఎక్కి ప్రయాణము చేయవలసివచ్చెను. అక్కడ వున్నంత వరకు అతడు చాలా బాధలు పడెను. ఆ తరువాత పెద్ద ఉద్యోగముపై కళ్యాణ్‌కు బదలీ అయ్యెను. అక్కడ నానా చందోర్కరువలన బాబా

మహిమలు తెలుసుకుని షిరిడికి వచ్చి బాబా పాదములకు నమస్కరించగా అతనికి ఆనందము కలిగెను. సర్వజ్ఞుడైన బాబా అతనితో యిక్కడి మార్గము అప్పా చెప్పే నీతులంత తేలికైన మార్గము కాదు. లోయలో దున్నపోతుపై ప్రయాణము చేయునంత సులభము కాదు. కష్టపడి కృషిచేయవలసి వుండును. ఈ మార్గము పదునైన కత్తి అంచుపై నడచుట లాంటిది అనెను.

తానెవరో, ఎక్కడి నుండి వచ్చెనో ఎందుకు వచ్చెనో ఏమీ అడగకుండా తన విషయాలన్నీ చెప్పిన సాయి భగవానుని మాటలువిన్న ఠాకురునకు కళ్ళనిండా ఆనందభాష్పములు నిండెను. శరీరమంతా పులకించెను. ఆనంద డోలికలలో తేలియాడుతూ మైమరచెను. కన్నడ యోగి అప్పా చెప్పిన మాటలు యదార్ధములని గ్రహించెను. భక్తి పారవశ్యంలో బాబా పాదములకు సాష్టాంగ ప్రణామము చేసెను. బాబా అతని తలపై తట్టి మరల ఈ విధముగా చెప్పెను. అప్పా చెప్పినదంతయూ నిజమే! కాని వాటినన్నిటినీ జాగ్రత్తగా నేర్చుకుని ఆచరణలో పెట్టవలెను. కేవలం చదువుటవలన ప్రయోజనం వుండదు. చదివిన దానిని ఆలోచించి ఆచరణలో పెట్టుకోవలెను. గురువు ఆశీర్వాదంలేని పుస్తక జ్ఞానం వలన ప్రయోజనం వుండదు. బాబా నోటి నుండి వెలువడే ప్రతిమాట ఒక అమృతధార. ఈ అమృతాన్ని సేవించి ఆనందించటమే కాకుండా శాశ్వతమైన శాంతిమార్గంలో పాఠకులంతా పయనించవలెను.

నవవిధభక్తిమార్గములు

పూనాలోగల అనంతరావు పాటంకర్ అనునతడు వేదపండితుడు. వేద వేదాంగములు, ఉపనిషత్తులు, అష్టాదశపురాణాలను చదివినా అతనికి మనశ్శాంతి కలుగలేదు. అందుచేత షిరిడికి వచ్చి బాబాను చూడగనే అంతవరకు జీవితంలో ఏనాడు పొందని ఆనందమును అనుభవించెను. నాయందు దయచూపి నన్నాశీర్వదింపుమని బాబా పాదములపైబడి వేడుకొనెను. వెంటనే బాబా అతనితో ఈ విధముగా చెప్పెను. ఒకసారి నా దగ్గరకు ఒకవర్తకుడొచ్చెను. అతడు నన్నేదో ప్రశ్నించవలెనని అనుకొనెను. కాని అడుగలేకపోయెను. నావైపే కేంద్రీకరించిన దృష్టితో చూచెను. అదేసమయంలో అతని ముందు గల అడగుర్రము లద్దివేసెను. అది తొమ్మిది వుండలుగా పడెను. ఆ వర్తకుడు ఆ తొమ్మిది వుండలను తన ఉత్తరీయములో పెట్టుకొనెను. అందువలన అతడు మనస్సును కేంద్రీకరించగలిగి మనశ్శాంతిని పొందెను.

మనశ్శాంతికి గుర్రపు లద్దెలకు సంబంధం ఏమిటో ఆ వేదపండితుడైన పాటంకర్‌కు అర్థంకాలేదు. సామాన్యుడైన దాదాకేల్కర్ బాబా ప్రేరణచే పైకథ యొక్క విషయమును ఈ విధముగా వివరించెను.

వర్తకుడనగా సామాన్య మానవులలో లేని విశేష గుణాలతోవున్న జ్ఞాని. ఆడ గుర్రమునగా భగవంతుని అనుగ్రహం. తొమ్మిది వుండల లద్దె అనగా నవవిధ భక్తి మార్గములు. సాధకుడు సద్గురుని యందు దృష్టి నిల్పి శ్రద్ధతో గురువును సేవించిన దైవం కనికరించి నవవిధ భక్తి మార్గములను అతనికి చూపును. అందులో ఏ మార్గము తనకు యిష్టమగును, సాధ్యముగను వుండునో దానిని సాధకుడు ఎన్నుకుని భగవంతుని పొందవచ్చును. అవి

1. శ్రవణము : దైవకథలను పురాణములను వినుట.
2. కీర్తనము : దైవమును కీర్తించుట, భజన, పాటలు, కీర్తనలు మొదలైనవి.
3. స్మరణము : వినిన వాటిని తరచుగా గుర్తుచేసుకుని జ్ఞాపకముంచుకొనుట.
4. పాదసేవనము : సాష్టాంగ నమస్కారము, పాదపూజ, మొదలైనవి.
5. అర్చనము : ప్రతిదినం చేసుకునే వివిధ రకములైన పూజలు.
6. నమస్కారము\: శిరస్సువంచి భక్తిశ్రద్ధలతో నమస్కరించుట.
7. దాస్యము : సేవకునివలె భగవంతునికి సేవచేయుట.
8. సఖ్యత్వము :· భగవంతుని స్నేహితునిగా భావించి స్నేహము చేయుట.
9. ఆత్మనివేదనము : తన ప్రాణాన్ని, ఆత్మను భగవంతునికి సమర్పించుట.

భక్తి అనేది ఈ తొమ్మిది రకాలుగా వుంటుంది. మనస్సు స్థిరమౌతున్న కొద్దీ ఈ తొమ్మిది విధాలుగాను దేముడిని పూజించి ఆరాధించవచ్చును. బాబా చెప్పిన కథలోని జ్ఞానివలె మనం కూడ నవవిధ భక్తిమార్గాల ద్వారా దైవాన్ని చేరుటకు గట్టి కృషి చేయవలెను.

అవస్థే - కథ

పి.ఆర్. అవస్థే గ్వాలియర్‌లో జడ్జిగా పనిచేయుచుండెడివాడు. రేగే గారి వలన సాయిబాబా మహిమలను విని శ్రీ సాయిబాబాను చూడవలెనని కోరుకొనెను. 1914లో పండరీపురం వెళ్ళుతూ షిరిడికి రేగేతో పాటుగా కలిసివచ్చెను. అవి ప్రపంచ మహాయుద్ధము జరుగుచున్న రోజులు. వీరిద్దరు రైలులో గ్వాలియర్ నుంచి మన్మాడుకు ప్రయాణం చేయుచున్న సమయంలో రైలు "మౌ"అను సైనిక శిబిరములు గల స్టేషన్ దగ్గరకు రాగానే సైన్యమును తరలించుటకై అందరినీ రైలునుంచి దింపి వేయుచుండిరి వీరిద్దరు కూడ దిగవలసివచ్చెను. వారిరువురు బాబాను ప్రార్థించిరి. యింతలో సేనాధిపతి వచ్చి యిది చాలా చిన్న పెట్టె. సైన్యమునకు చాలదు. మీరు దిగవలసిన పనిలేదు అని చెప్పెను. ఆ రాత్రి అంతా అవస్థే ఏవేవో భజనలు పాడుతూ, బాబాను ప్రార్థించెను. మరునటి రోజు వుదయం షిరిడికి చేరుకొనిరి. షిరిడికి చేరి మసీదుకు వెళ్ళిన తరువాత బాబా రేగేతో ఈ చపలచిత్తుడైన పిశాచమెవరు? అని ప్రశ్నించెను. ఆ తరువాత రేగేతో "నా బిడ్డలను రైలు నుంచి దింపవలెనని చూసిరి. నేను ఆ సేనాధిపతితో "వారు నా బిడ్డలు నా వద్దకు రానిమ్ము" అని చెప్పితిని. ఈ అవస్థే తెల్లవార్లు నా ప్రక్కనే వుండి బాబా బాబా! యని రొదపెట్టుచునే వున్నాడు" అనెను.

ఈపై వుదాహరణలను బట్టి బాబా ఎప్పుడూ తనను నమ్మిన భక్తులను వెంటాడి రక్షిస్తాడని తెలియుచున్నది. అవస్థే అంతకుముందు ఒక యోగినిని తన గురువుగా భావించెడివాడు. ఇప్పుడు షిరిడికి వచ్చి సాయిబాబాను సేవించినట్లయిన యోగిని అయిన తన గురువునకు ద్రోహము చేసినట్లగుననే అనుమానం ఆయనను బాధించెను. సాయిబాబాలోనే తన గురురూపం అంతర్లీనమై వుంటుందని, వారు సర్వ దేవతాస్వరూపులని, గురువులందరికి రాజులాంటివాడని, వారు జగద్గురువులని, వారిని సేవించినచో నీ గురువును సేవించినట్లేనని రేగే చెప్పెను. అయినను అతని మనసునకు నిదర్శనముగా నమ్మకము కలుగవలెనని ఆలోచించి మధ్యాన్న ఆరతి సమయంలో ఒక అన్నము ముద్దను పాత్రయందుంచుకొని అది పైకి కనపడకుండా ఏర్పాటు చేసుకొనెను. దానిని బాబా స్వయంగా అడిగి తీసుకొనినచో నిజముగా తన గురువైన యోగిని బాబాలో వున్నట్టే అనుకొని ద్వారకామాయికి వెళ్ళెను. మెట్లెక్కుచుండగా అతని చేతులు తొణికి అన్నము ముద్ద క్రిందపడెను. తాను రహస్యముగా దాచినది

బట్టబయలయ్యేను. ఆ ముద్దను తీసుకుని పాత్రలో వేయుచుండగా బాబా అతనిని పిలిచి దానిని నాకు యివ్వు. నేను దానిని స్వీకరించి నీవు కోరుకొనిన వారికే అందచేయగలనని చెప్పి దానిని తీసుకొనెను. అవస్థకు చాలా ఆనందము కలిగినది. తన గురువైన యోగినీమాత ఎప్పుడో మరణించినది. వీరు శరీరంలో పిలిచిన పలికే దైవమై ఎదురుగానున్నారు. నేటినుంచి వీరిలో నా గురువును చూసుకుంటూ నా జీవిత చుక్కానిగా వీరినే ఎంచుకొనెదనని నిశ్చయించుకొనెను. అదేవిధముగా ఆ తరువాత కూడ ఏవిషయంలోనైనా బాబా సలహా కావాలన్నప్పుడు షిరిడి వచ్చి వారిని సేవించి భౌతిక సమస్యలను తీర్చుకుంటూ ఆధ్యాత్మికంగా కూడ సాయి సహాయము వలన ఎంతో అభివృద్ధి సాధించగలిగెను.

సాయిబాబాను గురువుగా స్వీకరించుట

ఈ కథ వలన మనం నేర్చుకోవలసిన నీతి-సాయిని సేవించే భక్తులు అంతకుముందు ఎవరినైనా తమ గురువుగా భావించివుంటే ఆ గురువుని లేక ఆ దేముణ్ణి మేము ఇది వరకు పూజించి సేవించే వాళ్ళం. యిప్పుడు ఈ సాయిబాబాను సేవిస్తే ఆ గురువుకు లేక దేమునికి అపచారం చేసినట్లవుతుందేమోనని బాధపడవలసిన పనిలేదు. సాయిబాబా గురువులకు గురువు, సమర్ధ సద్గురువు. వీరు గురువు లందరికీ రాజాధిరాజు వంటివారు. యోగులందరికీ చక్రవర్తి. అఖిలాండకోటి బ్రహ్మాండములను ఆజ్ఞాపించి అదుపులో వుంచగల నాయకుడు. యదార్ధానికి వీరి రక్షణలోకి తన శిష్యుడు ప్రవేశిస్తే నిజమైన ఏ గురువైనా సంతోషిస్తాడు. శిష్యుల ధనంమీద, అధికారాల మీద, వ్యామోహాలు గల గురువులు మాత్రమే బాధపడి మెట్ట వేదాంతంతో అడ్డదిడ్డమైన కథలు సృష్టించి చెబుతారు.

గురువును మార్చుకునే విషయంలో బాబా కూడ కొన్ని సందర్భాలలో ఒప్పుకోలేదు. యిక్కడ గమనించవలసినది ఏ సందర్భంలో ఎలాంటి శిష్యుడు తన గురువుని, లేక అంతకుముందు నమ్మిన దేముణ్ణి వదిలి తన దగ్గరకు వచ్చాడో అనే విషయం బాబా ముఖ్యంగా చూసేవారు. ఒక గురువుని లేక దేముణ్ణి కొన్నాళ్ళు సేవించి వారివలన భౌతికంగా ఏమీ లాభం పొందలేదని యింకో గురువును సేవించే వారు ఏకాలంలో చూచినా ఎక్కువగానే వుంటున్నారు. ఎవరికీ మొక్కుకుంటే పనులైతే వారి దగ్గరకే పరుగులు తీస్తారు. వీరికి కావలసింది గురుబోధలోని విషయ జ్ఞానంకాదు.

గురువు వలన కేవలం భౌతికమైన అభివృద్ధి కావాలి. వీరు నిజానికి ఏ గురువును శ్రద్ధతో ఎక్కువకాలం సేవించలేరు. అలాంటి శ్రద్ధ సాబురీలు లేని భక్తులు తన వద్దకువస్తే బాబా నీకు కావలసింది గురువు మార్పు కాదునాయనా! గురువు నందు ఎంతకాలమైనా చెక్కుచెదరని భక్తి విశ్వాసములు నిలవలేనప్పుడు నీ పాత గురువును మార్చుకుని నా దగ్గరకు వచ్చినా వుపయోగం పొందలేవు. కాబట్టి ముందు గురువును సరియైన పద్ధతిలో సేవించటం నేర్చుకోమనే భావనతో నీ గురువును మార్చుకోవద్దని చెప్పేవారు.

దీనినే పట్టుకుని శ్రీ షిరిడి సాయిబాబాను ఆశ్రయించి, వారి మహిమలను స్వయంగా రుచి చూసిన తరువాత కూడ వారికి సర్వస్వ శరణాగతులు కాలేకపోతున్నవారు చాలామంది ఈనాడు మనకు కనిపిస్తూ వుంటారు. యిలాంటి వారికి మా విజ్ఞప్తి. సాయికి సమానమైన గురువు జరిగిన కాలంలోలేరు. రాబోయే కాలంలోరారు. ఈ సచ్చిదానంద సమర్ధ సద్గురునికి సాష్టాంగ ప్రణామంచేసి ఈ పారాయణ పూర్తి అయ్యేలోపుగా బాబాయొక్క నిజస్వరూపం మనకుఅర్ధమయ్యేలా చేయమని కోరదాము. వారి పాదములయందు అచంచలమైన భక్తి మనకు కలుగునట్లు, అలాంటి భక్తి స్థిరమై జీవితాంతం నిలచేటట్లుగా చేయమని ప్రార్థిద్దాము. మన శరీరంలో నుంచి ప్రాణం బయటకు పోవునప్పుడు ఈ బంధువులు, ఆస్థిపాస్తులు మనకు తోడురావు కాబట్టి ఆ వంటరి ప్రయాణంలో కూడ సాయి, మనకుతోడై ముక్తినిగాని, లేక యింతకకంటె ఉత్తమమైన జన్మను కాని యిచ్చి జన్మజన్మలకు మనకు సాయిబాబాతోడు నీడగా వుండాలని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

పదిహేడవ అధ్యాయం సంపూర్ణం.

పద్దెనిమిదవ అధ్యాయము

అది 1909వ సంవత్సరం మేనెల. భౌగోళికంగా మహారాష్ట్ర ప్రాంతంలో గల ఎత్తయిన ప్రాంతాలలో షిరిడి కూడ ఒకటి. నీటి ఎద్దడి వేసవికాలంలో విపరీతంగా వుండేది. దానికి తోడు మండుటెండలు మానవ శరీరాన్ని అతలాకుతలం

చేసేవి. రాత్రులందు గాలి స్తంభించినట్లుగా వుండటంచేత ప్రజలంతా యిళ్ళ బయట బల్లలు దుప్పట్లు పరచుకొని నిద్రించేవారు. పగలు కాచిన ఎండ తీవ్రత, రాత్రులందు స్థంభించిన గాలితో అసౌకర్యంగా వున్న ప్రజలంతా వుదయపు వేళలలో చల్లగా సాగేపిల్లగాలుల తాకిడికి ఆహ్లాదాన్ని అనుభవించేవారు. రాత్రంతా చికాకు పడిన తరువాత శరీరానికి తగులుతున్న ఆ చల్లని చిరుగాలి దేముడు వారికోసం పంపిన దైవదూతవలె అనిపించేది. అమాయకులైన చిన్న బిడ్డలు తమ బోసినోటిని తెరచి నిశ్శబ్దంగా నవ్వుతూ పిలుస్తున్నట్లుగా ఉదయపు వాతావరణం ఆహ్వానిస్తున్నది. ఆ పిలుపు నందుకున్నట్లుగా బాబా కూడా వుదయం ద్వారకామాయి నుంచి బయలుదేరి లెండిబాగ్ వైపుగా వెళ్ళాడు. ఆయన వెనుక శ్యామా, తాత్యా, బాలాషింపీ, భాగోజీ షిండే మొదలైన భక్తులు కూడ వెళ్ళిరి.

రెండు మేకలకధ

బాబా నడుస్తూ వుండగా వారి ముందు నుంచి ఒక మేకలమంద వెళ్ళుచున్నది. ఆ గుంపులో మధ్యనున్న రెండు మేకలను బాబా గబగబా వెళ్ళి పట్టుకొనెను. భాగోజీషిండే బాబాకు సహాయముగా వెళ్ళెను. ఆ రెండు మేకలు తనకు కావలెనని చెప్పి వాటి యజమానికి 32 రూపాయలను యిచ్చి బాబా వాటిని కొనెను. ఆ రెండు కలిసి ఏడు రూపాయలకంటే ఎక్కువ ఖరీదు చేయవని అందరూ అనుకొనుచుండిరి. బాబా 5 శేర్ల శెనగపప్పును తెప్పించి వాటికి పెట్టిరి. ఈవింత చర్యను చూసి శ్యామా బాబాను ప్రశ్నించెను. అందుకు బాబా నాకు యిల్లుగాని కుటుంబముగాని లేదు, అందువలన ధనమును నిలువచేయరాదు అని చెప్పిరి. అయినా తాత్యా, శ్యామాలు వారిలో వారు ఆ విషయమును గురించి గంభీరముగా చర్చించుచుండిరి. వెంటనే బాబా ఆ రెండు మేకలను తిరిగి వాటి యజమానికి యిచ్చివేసిరి. వాటికధను ఈ ప్రకారంగా బాబా అక్కడి భక్తులకు వివరించి చెప్పెను - ఈ రెండు మేకలు గత జన్మలో మానవులు. కొంతకాలం నాతో కలిసి వున్నారు. వారు ఒకేతల్లికి పుట్టిన అన్నదమ్ములు. మొదట ప్రేమగానే వుండేడెవారు. పెరిగి పెద్దవారౌతున్న కొద్ది యిద్దరికీ విరోధము కలిగెను. చిన్నవాడు తన తెలివి తేటలతో ఎక్కువధనం సంపాదించెను. పెద్దవాడు ఈర్ష్యతో తమ్ముని చంపి ఆ ధనాన్నంతా అపహరించుటకు అనేక ప్రయత్నములు చేసెను. ఈ ప్రకారంగా అన్నదమ్ములిద్దరూ ఒకరిని యింకోకరు చంపుటకు చాలాప్రయత్నములుచేసిరి. ఆఖరికి ఒకే స్థలములో ఒకే సమయంలో ఒకరినొకరు చంపి యిద్దరూ మరణించిరి. వారి కర్మ ప్రభావంగా

మేకలుగా ఈ జన్మలో పుట్టిరి. నాకుదగ్గరగా వెళుతున్నపుడు గుర్తుపట్టి చేరదీసితిని. సుఖప్రదమైన మానవ జీవితం నుంచి జంతు జన్మకు దిగజారిపోయి బాధపడుతున్న వారిద్దరికీ గతజన్మలో నాతోగల సంబంధం దృష్ట్యా వారిని నావద్ద వుంచుకుని సుఖజీవితాన్ని ప్రాసాదించాలనుకున్నాను. కాని నా బేరము గురించి మీరు అనవసరమైన రాద్ధాంతం చేయుట చూసి వాటిని తిరిగి వాటి యజమానికి అప్పచెప్పితిని.

ఈ రెండు మేకల యొక్క కధవలన మనం రెండు విషయాలను గ్రహించవలెను. విరోధ భావములు, కొట్లాటలులాంటి చెడ్డపనులు చేసినచో మరు జన్మలో మనకు మానవ జన్మ నుంచి జంతు జన్మకు పతనం తప్పదు. 2• గత జన్మలో తన స్నేహితులైనాసరే ఈ జన్మలో సహచరులు గొణుకుతూ బాధపడుతూ వుంటే వారి కోసం రెండు మేకలను తిరిగి వదిలేశారు బాబా. మన చుట్టూ వున్న వారికీ యిష్టమైన పనులనే సాధారణంగా మనం చేస్తూవుండాలి. మనతోపాటు వుండే వారిని నొప్పించరాదు.

హరికానోబా

బొంబాయి నివాసి హరికానోబా యనునతడు బాబా పేరు ప్రఖ్యాతులు విని పరిశీలించి విషయం తెలుసుకోవలెనని షిరిడికి వచ్చెను. మసీదుకు వచ్చునప్పుడు తనకుగల కొత్త బట్టలు, కొత్త తలపాగా, కొత్తచెప్పులు ధరించి అత్తరు రాసుకొని సొగసుగాముస్తాబైయ్యెను. విలువైన తన కొత్త చెప్పులను ఎక్కడ వుంచవలెనా అని చాలాసేపు ఆలోచించి ఆఖరికి మసీదు ముందుభాగంలో ఒక మూల భద్రపరచి లోపలికి వెళ్ళి కొంత సేపటికి తన వంతురాగా బాబాకు నమస్కరించెను. సాయి అతనికి విభూది ప్రసాదము పెట్టిరి. మసీదులో వున్నంతసేపు అతని దృష్టి బాబాపైకాక బయట వదలిన కొత్త-చెప్పులపైనే ఉండెను. వెంటనే బయటకు వచ్చి చూడగా అతడు భయపడినట్లుగానే ఆ చెప్పులు పోయినవి. సాయిబాబా ఏదో మహిమలు గలవాడనివస్తే తన కొత్త చెప్పులు పోయినవే అని చిరాకుపడుతూ మదిలో బాబాను నిందించుకుంటూ బసకువెళ్ళి భోజనము చేయుచుండగా ఒక పిల్లవాడు చిన్నచేతికర్ర పైభాగంలో ఆ రెండు చెప్పులను వుంచి వీధిలో హరికాబేటా, జరీకాఫేటా - అనగా హరి యొక్క కుమారుడు, జరీతలపాగవాడు అని అర్థం.

అలా కేకలు వేయు సమయంలోనే కానోబా బయటకు వచ్చెను. తన చెప్పులను చూచి ఎంతో సంతోషించెను. ఆ పిల్లవానిని పిలిచి వివరములడుగగా, సాయిబాబా తనను పిలిచి ఈ రెండు చెప్పులు యిచ్చి పైవిధంగా కేకలు వేయుచు వెళ్ళమని, ఎవరైనా వీటిని అడిగినచో అతని పేరు కానోబా అని, తండ్రి పేరు హరి అని, తలపై జరీపాగ వుంటుందన్న వివరాలు సరిచూసుకొని వీటిని తిరిగి యివ్వమని చెప్పిరని వివరించెను.

ఆ వ్యక్తి తానేనని. లోపలికి వెళ్ళి జరీ తలపాగను తెచ్చి చూపించి చెప్పులను తీసుకుని పరమానందమును పొందెను. తన పేరు, తలపాగ విషయం బాబాకు తెలిసిన తెలిసి యుండవచ్చును. కాని తన తండ్రి పేరు కూడ తెలియుట ఆశ్చర్యము. బాబాను పరీక్షించుటకు వచ్చిన అతనికి బాబా సర్వజ్ఞుడని నిర్ధారణ కలిగెను.

ఫకీరు మద్దూషా

1913లో జలగాం దగ్గరగల మీరిన్ గ్రామనివాసియైన మద్దూషా షిరిడికి వచ్చి అత్యవసరముగా ఒక ధర్మకార్యము కొరకు 700ల రూపాయలు కావలెనని బాబాను ప్రార్థించెను. బాబా ఆదేశముపై బాబా సాహెబ్ జోగ్ 700ల రూపాయి నాణేములు బాబా సమక్షంలో ఆ ఫకీరుకు యివ్వమని "లక్షణ్-గులాబ్" అను యువకులకు యిచ్చెను. కాని వారు ఆ ఫకీరు వచ్చిన తరువాత అతనికి 500 రూపాయలు మాత్రమే యిచ్చి చెరియొక వంద తీసుకుని దాచుకొనిరి.

మద్దూషా బాబాతో తనకు 500 మాత్రమే ముట్టినవని చెప్పి చాలా బాధపడెను. బాబా ఆ విషయమును పట్టించుకోనట్లుగానే విభూది ప్రసాదమిచ్చి అతనిని పంపి వేసెను. ఆ ఫకీరు షిరిడి విడిచి రెండుమైళ్ళు దాటి నీంగామ్ దగ్గరకు వెళ్ళగానే యిరున్‌షా అనుపేరుగల తహసీల్‌దారు అతనిని చూచి బండిదిగి తనవద్దగల ఆహారము పొట్లమును యిచ్చి దానిని భుజించిన తరువాత సంతోషముతో ఈ రెండు వందలు తీసుకుని వెళ్ళమని రెండువందల రూపాయలు ఫకీరునకిచ్చెను. ఫకీరు ఆ పైకమును తీసుకుని సంతోషించి ఆహారము కూడ తీసుకుని విశ్రాంతి చెంది తిరుగు ప్రయాణమయ్యెను.

యిరున్‌షా షిరిడిచేరి తాత్యాపాటిల్ యింటిలో బసచేసి తనకు కలిగిన స్వప్న వివరమును వివరించెను. స్వప్నములో ఎవరో నీవు బండిపై షిరిడి రమ్ము. దారిలో నీంగాంలో పులిచర్మం వేసుకుని నీకు ఎదురయ్యే ఫకీరునకు రెండువందల రూపాయలతోపాటుగా ఆహారము కూడ తీసుకువెళ్ళి యివ్వమని చెప్పిరి. తాను షిరిడికి వస్తూవుండగా కలలో చెప్పిన ప్రకారం మద్దూషా నీంగాం దగ్గరే ఎదురుపడగా 200 రూపాయల పైకముతోపాటు ఆహారము కూడ యిచ్చితినని చెప్పెను.

ఈ సంఘటన జరిగిన ఆరునెలల తరువాత లక్షణ్-గులాబ్ అను యువకులిద్దరూ వేరొక విషయములో చెరొక వేయి రూపాయలు తెచ్చి యిరున్‌షా చేతిలో పెట్టిరి. ఆనాడు మరల యిరున్‌షాకు కలవచ్చెను. కలలో ఆరునెలల క్రితం నామాట ప్రకారం నీవు ఫకీరుకు 200 రూపాయలిచ్చినావు. దానికి పదిరెట్లు ఈనాడు నీకిస్తున్నానని కలలో ఆయనకు ఎవరో చెప్పిరి. దీనిద్వారా మనం తెలుసుకోవలసిన నీతి. దైవ ఆజ్ఞకు వ్యతిరేకంగా పనిచేసి దైవధనాన్ని కాజేసిన లక్షన్-గులాబ్‌ల నుంచి బాబా పదిరెట్లు వసూలుచేసి దైవాజ్ఞను పాటించిన 'యిరున్‌షా'కు యిప్పించెను. దేముని సొమ్మును ఆశతో అపహరించి సొంతం చేసుకొనువారు ఈ జన్మలో గాని లేక మరుజన్మలోగాని పదిరెట్లు తిరిగి యివ్వక తప్పదు. ఎట్టి పరిస్థితులలోను మనది ఒక రూపాయి దేమునికి ఖర్చు పెట్టాలేగాని, దేముని రూపాయికి ఆశపడితే రౌరవాది ఘోర నరక బాధలు అనుభవించక తప్పదు.

బాబా నుండి మంత్రోపదేశము కోరుట

రాధాబాయి దేశ్‌ముఖ్ అనుపేరుగల వృద్ధురాలు సాయిబాబాను గురువుగా భావించి వారివలన ఉపదేశము పొంది ఆత్మ సాక్షాత్కారమును పొందవలెనను ధృడసంకల్పముతో షిరిడికి వెళ్ళి సాయి ప్రభువును ఉపదేశము చేయుమని కోరగా బాబా మౌనము వహించియుండిరి. అందుకు ఆమె సత్యాగ్రహముచేసి సాయి నుండి ఉపదేశము పొందు వరకు ఆహార పానీయములు మాని ఆమరణ నిరాహారదీక్షను పూనినది. ఆమె ఆవిధముగా మూడు రోజులు నిరాహారదీక్షను సాగించుటచే నీరసించి బలహీనమైపోయెను. అది గమనించిన శ్యామా బాబాకు చెడ్డపేరు వచ్చును గనుక వెంటనే ఆమె విషయములో బాబాను కల్పించుకోమని ప్రార్థించినాడు. అప్పుడు బాబా ఆమెను పిలిపించి ఈ విధముగా తెల్పెను.

తల్లి నేను నీ బిడ్డ వంటివాడను, నీవు నా తల్లిలాంటిదానివి. నీవు అనవసరంగా ఆత్మను హింసించుకుంటూ మరణమును కోరెదవేల? నేను ఒక భిక్షుకుడను. నాపై దయచూపుము. నా గురువు గొప్ప సాధుసత్పురుషుడు. వారిని నేను ఆశ్రయించగనే నన్ను రెండు కాసుల దక్షిణ అడిగిరి. అవి మామూలు నాణెములకావు 1. శ్రద్ద 2. సాబురి. శ్రద్ధ అనగా ప్రగాడమైన విశ్వాసము. సాబురి అనగా ధైర్యముతోను ఉత్సాహముతోను కూడిన ఓర్పు. వారు అడిగిన వెంటనే ఈ రెండు గుణములను నాలో పెంచుకుని వారికి దక్షిణగా అర్పించితిని. వారు వెంటనే నా తలను గొరిగించి నేనిచ్చిన దక్షిణను స్వీకరించిరి.

నా గురువు ధ్యాననిష్టలో వుండగా నేను వారి ఎదురుగా కూర్చుని నా దృష్టిని యితర విషయములయందు పోనీయక రేయింపగళ్ళు ఆకలిదప్పులు కూడ మరచి ప్రేమతో వారి ముఖారవిందముపైనే దృష్టిని కేంద్రీకరించి యుండెడివాడను. వారు కూడ నన్ను ప్రేమతో నిండిన దృష్టితో చూచెడివారు. మా యిద్దరం అప్పుడు పరస్పర ప్రేమానందములలో నిండియుండెడివారము. వారు నా ఎదుట లేనిచో క్షణకాలమైన నేను ఆ ఎడబాటును సహించగలిగే వాడినికాదు. గురువు తప్ప నాకు యితరలక్ష్యముగాని, గమ్యముగాని వుండెడిదికాదు. నా గురువును కాక నేను యింకేమియు కోరుకొనలేదు. వారు కూడ నా ప్రేమను తప్ప యింకేమియు నా నుండి కోరలేదు. నిరంతరం వారు తన కరుణా దృష్టినినాపై ప్రసరించుచుండెడివారు.

ఈ మసీదులో కూర్చుని నేనెన్నడు అసత్యము పలుకను. నా గురువు నా చెవిలో ఏ మంత్రమును చెప్పలేదు. కాబట్టి నేను నీకు కూడ ఏ మంత్రమును ఉపదేశించలేదు. నీవు నన్ను గురువుగా పొందదలచినచో - నావలెనే ప్రవర్తించుము నీ ఆలోచనలకు, ఆశయములకు నన్నే లక్ష్యముగా పెట్టుకొనుము. అంచంచలమైన శ్రద్ధతో నీవు నన్ను చూడుము. నేను కూడ నిన్ను అదేవిధముగా చూచెదను. జీవితములో కలుగు వడిదుడుకులు, అటుపోటులు నిన్ను నా నుంచి దూరం చేయ ప్రయత్నించును. వాటికి లొంగక ఎంతకాలమైనను ఓర్పుతో, ఆనందంతో వుండుము. అట్లున్నగాని పరమార్ధము లభించదు. చతుర్వేద సాధనలతో, ఆరు శాస్త్రములతోగాని అష్టాంగ యోగములతో గాని, నీకు పనిలేదు. ప్రగాఢమైన భక్తితో నీవు గురువును సేవించిన చాలును యిదేనా గురువు నాకు బోధించిన ఏకైక సత్యము. బాబాయొక్క బోధనలు ఆ వృద్ధురాలి హృదయమునకు నాటి ఆమెతన ప్రాయోపవేశమును

విరమించినది. ఆ రోజు ద్వారకామాయిలో ఆమెను బాబా తన ప్రక్కనే కూర్చుండబెట్టుకుని మరీ భోజనము చేయించెను.

ఈ కథ ద్వారా మనం తెలుసుకోవలసిన నీతి, సాయి సిద్ధాంతం మంత్రతంత్రాలకు, పూజా పునస్కారాలకు, ఆచార వ్యవహారాలకు, తరతరాల నుంచి వస్తున్న మూఢ విశ్వాసాలకు అతీతమైన సులభమార్గం. సాయికి అర్పించవలసినవి మనసు, బుద్ధి, అహంకారం. ఈ మూడింటిని మనం గురువుకు అర్పించినప్పుడు పంచేంద్రియాలు తమ శక్తిని కోల్పోతాయి. యింద్రియాలు వశమైతే మనిషి అజేయుడౌతాడు. బాబా చెప్పిన ప్రకారం దృష్టినంతటినీ గురువుపై కేంద్రీకరించినప్పుడు శరీరంలో ఏమి మార్పులు జరుగుతాయో చూద్దాము. మన యింద్రియాలైన కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం యివి బయట వస్తువులు అందించే విషయ వాసనల ఆనందాన్ని కోరుకుంటూ మన దృష్టిని బయటి విషయాలవైపే లాగుతూ వుంటాయి. యిది యింద్రియాల సహజ స్వభావం. ప్రగాఢ దృష్టిని గురువుపై కేంద్రీకరిస్తే యింద్రియాలు కోరే సుఖాలవైపు మనసు పరుగు తీయకుండా నిలబడుతుంది. అప్పుడు యితర కోరికలు నశించి గురుదేవుని మీద కోరిక ఒక్కటే నిలబడుతుంది. ఈ ఏకాగ్రత కొరకే పూర్వం తపసులు చేసేవారు. గురువును లక్ష్యంగా పెట్టుకుని ఏకాగ్రతతో చేసే ప్రతి పని తపస్సుతో సమానమౌతుంది.

మహాభారత కథలో ఏకలవ్యుడు ద్రోణాచార్యుణ్ణి యిదే ఏకాగ్రతతో ధ్యానించుటచే తనంతట తానుగానే సమస్త విద్యలు గురువు నుంచి పొందగలిగాడు. బాబా బోధించిన గురు పరంపరలోని భక్తిభావం తపస్సుకు సంబంధించిన ఒక భాగమే! ఈ భావనను దృష్టిలో వుంచుకుని పైన పలికిన బాబా వాక్కులను జాగ్రత్తగా యింకొకసారి పారాయణ చేయండి. ఈనాటి దేశకాల పరిస్థితులను బట్టి తపస్సు, యజ్ఞ యాగాదులు చేయలేని బలహీనులైన మానవజాతికి కైలాసవాసి అయిన సాయి అందించిన సులభమైన ముక్తిమార్గం ఈ సాయి మార్గం.పాఠకులంతా సాయిని తమ జీవిత లక్ష్యంగా చేసుకుని వారు చూపిన ఈ సాయి మార్గంలో పయనించి, శ్రద్ధ, సాబురిలను నిరంతరం తమ అంగరక్షకులుగా వుంచుకొని యింద్రియాలనే దోపిడీ దొంగలకు లొంగకుండా సాయి సామ్రాజ్యంలో ప్రవేశించి యిహపరములలో శాంతి సౌఖ్యములను పొందెదరుగాక!

ఓం శాంతి శాంతి శాంతిః

పద్దెనిమిదవ అధ్యాయం సంపూర్ణం

మూడవరోజు పారాయణ పూర్తి అయినది.